అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
ఆదివారం 21-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 202 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెలిలో (సోపతి) | వెల : 8.00



లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

1500 మంది పోలీసుల భారీ బందోబస్తు

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

వదంతులు సృష్టిస్తే చర్యలు

హైదరాబాద్ నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

వివరాలు 5లో

ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు

విద్యాశాఖ ఉత్తర్వులు జారీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సమయాలకు అనుగుణంగా ఉన్నత పాఠశాలల సమయాల్లో మార్పులు చేస్తున్నట్టు ప్రకటించింది. ఉదయం 9.30 గంటలకు బదులుగా ఉన్నత పాఠశాలలు ఇక నుంచి ఉదయం తొమ్మిది గంటలకే ప్రారంభమవుతాయి. సాయంత్రం 4.45 గంటలకు బదులుగా 4.15 గంటల వరకు ...15లో

రాజ్యాంగంపై కాంగ్రెస్ దాడి

ఇచ్చిన హామీలు ఆ పార్టీ అమలు చేయటం లేదు



గవర్నర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందనీ, రాజ్యాంగం మీద అది దాడి చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ...15లో



ప్రాథమిక పాఠశాలల
భవిత ప్రశ్నార్థకం

ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీలను మారిస్తే తీవ్రనష్టం

నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం

సర్కారు బడుల్లో నాలుగో తరగతిలో విద్యార్థులు చేరుతారా?

ప్రయివేటు స్కూళ్లలో ప్రవేశాలు పెరిగే అవకాశం

ప్రభుత్వ నిర్ణయంపై పలు ఉపాధ్యాయ సంఘాల విమర్శ

సెమీ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రతిపాదనపై సానుకూలత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'చిన్న పిల్లలకు సొంత గ్రామాల్లోనే సౌకర్యవంతంగా ఉండేలా ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతాం. వాటిలో మూడో తరగతి వరకు విద్య అందించే దిశగా చర్యలు చేపడతాం. ప్రతి కేంద్రంలో విద్యాబోధనకు ఒక టీచర్‌ను నియమిస్తాం. నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లను త్వరలో ఏర్పాటు చేస్తాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షలో చెప్పారు. ప్లే స్కూళ్ల తరహాలో అంగన్‌వాడీలను మార్చడమే కాకుండా మూడో తరగతి వరకు అక్కడే విద్యాబోధన ఉంటుందన్న ముఖ్యమంత్రి ప్రకటనపై విమర్శలు వస్తున్నాయి. ఆ నిర్ణయం వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ...15లో



15లో

ప్రభుత్వ పాఠశాల విద్యకు మంగళమే

కేంద్రం మాయలో పడొద్దు : రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సూచన

సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైతే
రూ.లక్ష ఆర్థిక సాయం

స్థానిక పేద అభ్యర్థులకు మాత్రమే...

- సింగరేణి ఆర్థిక సహకారం
- నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత
- అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్‌క్యాలెండర్
- 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- అభ్యర్థులతో ముఖాముఖి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులై మెయిన్స్‌కు అర్హత సాధించిన తెలంగాణలోని పేద అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పథకానికి 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' గా నామకరణం చేశారు. రాష్ట్రానికి చెందిన పేద అభ్యర్థులు సివిల్స్ ప్రిలిమ్స్ పాసై, మెయిన్స్‌కు ఎంపికై, దేశంలోనే ఉన్నతస్థానాలకు ఎదిగితే అది రాష్ట్రానికి గర్వకారణంగా ఉంటుందన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించడమే తమ ప్రజాప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను వెంటనే విడుదల చేస్తామన్నారు. శనివారంనాడిక్కడి ప్రజాభవన్‌లో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సివిల్స్ అభ్యర్థులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ...15లో



విశ్వనగరంగా
హైదరాబాద్

లండన్ ఐకానిక్‌లా మూసీ

రూ.1.50 లక్ష కోట్లతో ప్రణాళికలు సిద్ధం

మూసీ ప్రక్షాళనే ప్రజా ప్రభుత్వానికి మార్క్

గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 6లో

తెలంగాణలో ఎవరిపైనా
వివక్ష ఉండదు

జాతీయస్థాయిలో తెలుగువారి లోటు కనిపిస్తున్నది: కమ్మ గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 15లో

రుణమాఫీ కాలేదనే ఆందోళన వద్దు

- రైతు వేదికల వద్ద ఏఈఓను సంప్రదించండి : మంత్రి తుమ్మల విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమకు రుణమాఫీ కాలేదనే ఆందోళన చెందొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. సాంకేతిక సమస్యలుంటే రైతువేదికల వద్ద ఏఈఓలను సంప్రదించాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మొదట్లోనే రూ.31వేలకోట్ల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఆత్రుతతో రైతులను ప్రక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మీడియాలో పుంఖానుపుంఖాలుగా తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజ నిజాలను తెలుసుకుని ప్రసారాలు చేయాలనీ, వార్తలు రాయాలని కోరారు. రైతులను ఆగం చేయడం, అయోమయానికి గురి చేయడం తగదన్నారు. రుణమాఫీకి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం కానివ్వబోమని చెప్పారు. గత ప్రభుత్వం రైతు బంధు చెల్లించకుండా ఉంటే తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. మార్గదర్శకాలను ఖరారు చేసిన తర్వాత రైతు భరోసా ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసం వల్ల తమపై అపనమ్మకం పెట్టుకోవద్దని మంత్రి కోరారు.

రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ రూ. 2 లక్షల రుణమాఫీ అని చెప్పి సవాలక్ష ఆంక్షలు పెడుతోందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల్లో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. హామీ ఇచ్చిన మేరకు ప్రతీ రైతుకు రుణమాఫీ చేయకుంటే అసెంబ్లీ, సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు భరోసా యాసంగి పంటకు ఇవ్వకపోగా, వానా కాలానికి కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అసెంబ్లీలో చర్చించకుండానే రుణమాఫీ చేసిన సర్కార్, రైతు భరోసా చెల్లింపులో చర్చ దేనికో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత సర్కార్ రైతుల పూర్తి సమాచారం ఇవ్వక పోవడంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు అందరికీ అందడం లేదని చెప్పారు.. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్‌కు సంబురాలు చేసుకునే అర్హత లేదని వ్యాఖ్యానించారు.

పాఠశాలల పనివేళలను ఉదయం 9.30కు మార్చండి

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టీఆర్టీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పనివేళలను ఉదయం 9.30కు ప్రారంభమయ్యేలా మార్చాలని టీఆర్టీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనివేళలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతాయని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత పాఠశాలలు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉంటాయనీ, చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులొస్తారని పేర్కొన్నారు. వర్షాకాలం, శీతాకాలంలో ఉదయం తొమ్మిది గంటలకల్లా విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవడం కష్టమవుతుందని వివరించారు. ఉదయమే పిల్లలు అల్పాహారం తిని రావాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా పాఠశాలల పనివేళలను ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యేలా మార్చాలని కోరారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయండి

- పీఆర్టీయూ తెలంగాణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమిటీలతో కాలయాపన చేయకుండా 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ జీవోను అమలు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఆ సమస్యను త్వరగా పరిష్కరించి బాధితులను సొంత జిల్లాలకు పంపాలని కోరారు.

జూకంటి జగన్నాథానికి దాశరథి అవార్డు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ప్రతిఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక 'శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు' 2024 సంవత్సరానికి గానూ జూకంటి జగన్నాథానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవార్డుతోపాటు లక్షా 1,116 రూపాయల నగదు, జ్ఞాపికను అవార్డు గ్రహీతకు అందజేస్తారు. ఈ సందర్భంగా జగన్నాథానికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నాలుగు వారాల్లోగా జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

సహకార శాఖకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు నాలుగు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి రాష్ట్ర సహకార శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏండ్ల తరబడి ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంటూ బ్రహ్మండభేరి గోపరాజు ఇతరులు వేసిన పిటిషన్ తరపున న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదించారు. ప్రస్తుత కమిటీ సభ్యుల జోక్యం లేకుండా తుది ఓటర్ల జాబితాను రెడీ చేయాలని సహకార సంఘ అధికారిని హైకోర్టు ఆదేశించింది. ముగ్గురు సభ్యుల కమిటీ నివేదికతో ప్రమేయం లేకుండా ఓటర్ల లిస్ట్ రెడీ చేయాలని ఆదేశించింది.

ట్రాన్స్ జెండర్ రిజర్వేషన్ల పరిశీలించాలి

కార్మిక శాఖలోని ఖాళీ పోస్టుల భర్తీలో కులాల వారీ రిజర్వేషన్లతోపాటు ట్రాన్స్‌జెండర్ల రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలన చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ శాఖలోని పోస్టులను టీజీ సర్వీస్ కమిషన్ నియామకాల ప్రక్రియను చేపట్టింది. థర్డ్ జెండర్ కేటగిరీకి రిజర్వేషన్లు కల్పించని తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ నిబంధనల్లోని 22ను కొట్టేయాలంటూ ట్రాన్స్‌జెండర్ బి. ఏడుకొండలు వేసిన పిటిషన్‌ను జస్టిస్ పి సుజయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావులతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల విచారణ చేపట్టింది.

అది అక్రమమం


- పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించటంపై యూఎన్ ఉన్నత న్యాయస్థానం

దిహేగ్: పాలస్తీనా భూ భాగాన్ని ఇజ్రాయిల్ దశాబ్దాలుగా ఆక్రమిం చటం చట్టవిరుద్ధమనీ, వీలైనంత త్వరగా దీనికి ముగింపు పలకాలని ఐక్యరాజ్యసమితి ఉన్నత న్యాయస్థానం తెలిపింది. పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ ఉనికిని కొనసాగించటం చట్టవిరుద్ధమని కోర్టు గుర్తించిందని ఐసీజే అధ్యక్ష న్యాయమూర్తి నవాఫ్ సలామ్ అన్నారు. ఇజ్రాయిల్ ఆక్రమణను వీలైనంత త్వరగా ముగించాలన్నారు. ఇజ్రాయిల్ అన్ని కొత్త సెటిల్మెంట్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలనీ, ఆక్రమిత భూమి నుంచి సెటిలర్లందరినీ ఖాళీ చేయాలని ఐసీజే వివరించింది. ఇజ్రాయిల్ విధానాలు, ఆచారాలను సైతం తప్పుబట్టింది. కాగా, అంతర్జాతీయ న్యాయస్థానం నిర్ణయాన్ని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తోసిపుచ్చారు. 'అబద్ధాల నిర్ణయం' అని నిందించారు. తమ మాతృభూమిలోని అన్ని ప్రాంతాలలో ఇజ్రాయిల్ స్థిరనివాసాల చట్టబద్ధత వివాదాస్పదం కాదని వివరించారు.

కార్పొరేషన్ రుణాలకు విరామం

2020-21 యాక్షన్ ప్లాన్‌తోనే ఆగిన సబ్సిడీ రుణాలు

- దళిత, మైనార్టీ, బీసీ బంధు పేర మిగతా వాటికీ బ్రేక్
- ఎన్నికల కోడ్‌తో గ్రౌండింగ్ కాని బంధు పథకాలు
- స్వయం ఉపాధికి నోచని.. సామాజిక తరగతులు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్పొరేషన్లకు నిధులిచ్చేనా..?



'సమాజంలో నెలకొన్న ఆర్థిక అసమానతల్ని తొలగించడంతో పాటు ఆదాయ ఉద్పాదక ఆస్తులను సృష్టించడం, స్వయం ఉపాధికి దారి తీసే నైపుణ్యం పెంపొందించడం' అనే లక్ష్యాలతో సామాజిక తరగతుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు చతికిల పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయి. ఎన్నికల వేళ భ్రమలకు గురి చేసి ఓట్లేయించుకోవడం తప్ప వారికి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చే సబ్సిడీ పథకాలకు నిధులివ్వడంలేదు. ప్రభుత్వమేదైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు నిధుల కొరతతో ఉత్సవ విగ్రహాలుగా మారాయి. 2020-21 వార్షిక ప్రణాళిక తర్వాత కార్పొరేషన్లకు నిధులే ఇవ్వలేదు. మూడేండ్లుగా నిధుల్లేక, స్వయం ఉపాధి పథకాలేవీ అమలుకు నోచుకోలేదు. బీసీ కుల వృత్తులు, సంచార జాతులు, దళిత, గిరిజన, మైనార్టీలకు పైసా రుణం అందలేదు. గత ప్రభుత్వం ఎన్నికల వేళ దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాల పేర హడావుడి చేసినా కోడ్ వల్ల అవీ అందని ద్రాక్షే అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో కార్పొరేషన్లకు సరిపడా నిధులిచ్చి పాత పథకాలన్నిటినీ అమలు చేయాలని సామాజిక సంఘాలు కోరుతున్నాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం (ఎస్సీ), గిరిజన అభివృద్ధి శాఖ (ఎస్టీ), వెనుకబడిన తరగతులు అభివృద్ధి శాఖ (బీసీ), మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరంలో సామాజిక తరగతుల అభివృద్ధి కోసం సబ్సిడీతో కూడిన పథకాలు అమలవుతాయి. దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకుతో సంబంధంలేకుండా భూమి కొనుగోలు పథకం ఉండేది. భూమిలేని దళిత కుటుంబాలకు మూడెకరాల వరకు వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చేది. మౌలిక వసతుల కల్పన కోసం భూములన్న దళితులకు బోర్లు, బావుల తవ్వకం, పంపుసెట్లు, విద్యుద్దీకరణ, చిన్న నీటి పారుదల పథకాలుండేవి. 2016 తర్వాత ఆ పథకాల్ని మూలన పడేశారు. స్వయం ఉపాధి పథకం ద్వారా పరిశ్రమలు, వ్యాపారం కోసం ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలిచ్చేది. బ్యాంకు అనుబంధంగా 80 శాతం సబ్సిడీతో యూనిట్‌కు రూ.1 లక్ష వరకు, 60 శాతం సబ్సిడీతో లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలిచ్చేది. ఆటోలు, వాహనాలు, కిరాణం, టెంట్‌హౌస్ వంటి వ్యాపారాలు, పాడి పరిశ్రమ కింద మిల్క్‌సెంటర్లు, గొర్రెలు, గేదెల పెంపకం కోసం రుణాలిచ్చేది. నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌ఎఫ్‌డీసీ) కింద కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి బ్యాంకు లింకు లేకుండానే దళితులకు వంద శాతం సబ్సిడీతో కూడిన రుణాలిచ్చేది. కాగా, ఆ పథకం ఉందనే విషయమే ఎవరికీ తెలవని పరిస్థితి. ట్రైకార్ పేరిట గిరిజనులకు కూడా స్వయం ఉపాధి, మౌలిక వసతుల కల్పన, అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ కోసం సబ్సిడీ రుణాలిచ్చేది. బీసీ కుల వృత్తులు, సంచార జాతుల కోసం పథకాలున్నాయి. 11 ఫెడరేషన్లు ఏర్పాటు చేసి.. వాటి ద్వారా సబ్సిడీ రుణాలందేవి. సంచార జాతులకు ఆటో రిక్షాలు, కుమ్మర్లకు మట్టి బొమ్మలు, పాత్రల తయారీ కోసం రుణాలిచ్చేది. మైనార్టీలకు డ్రైవర్ కమ్ ఓనర్ పథకం పేర వాహనాల కోసం సబ్సిడీ రుణాలు, ట్రైలరింగ్ శిక్షణ, స్వయం ఉపాధి పథకాలున్నాయి.

2020-21 తర్వాత నో యాక్షన్ ప్లాన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా 2020-21లో వార్షిక ప్రణాళికల కింద వివిధ పథకాల్ని అమలు చేశారు. ఆ ఏడాదిలో మంజూరు చేసిన యూనిట్లన్నీ కూడా గ్రౌండింగ్‌కు నోచలేదు. ఆ తర్వాత 2021-22, 2022-23, 2023-24 మూడేండ్ల పాటు కార్పొరేషన్లకు నిధులివ్వకపోవడంతో యాక్షన్ ప్లాన్ అనేదే లేకుండా చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో 2020-21 కార్యాచరణ ప్రణాళికల కింద సంగారెడ్డి జిల్లాలో 504 యూనిట్లకు రూ.1021.99 లక్షలు మంజూరైనా అవి విడుదల కాలేదు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద బోరు, బావుల తవ్వకం కోసం 154 మంది లబ్దిదారుల్ని ఎంపిక చేయగా... కేవలం 48 బోర్లు మాత్రమే వేశారు. మెదక్ జిల్లాలో పాడి గేదెలు, స్వయం ఉపాధి, దళిత బంధు పథకాల ద్వారా 775 యూనిట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా.. కేవలం 559 మాత్రమే మంజూరయ్యాయి. సిద్దిపేట జిల్లాలో కూడా 570 యూనిట్లు ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ 2017-18 యాక్షన్ ప్లాన్ తప్ప తర్వాత ఎలాంటి పథకాలూ అమలు కాలేదు. 11 ఫెడరేషన్లు, ఎంబీసీలు రుణాల కోసం తిరుగుతూనే ఉన్నారు. 2020-21లో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో 2030 యూనిట్లు మంజూరయ్యాయి. ఆ తర్వాత మూడేండ్లుగా రుణాలే ఇవ్వలేదు. మైనార్టీ కార్పొరేషన్ పరిస్థితి కూడా అంతే.

గతేదాది 'బంధు' పేరిట కాలయాపన

2020-21లో తొలి విడత పైలెట్ ప్రాజెక్టుగా దళిత బంధు పథకాన్ని నియోజవర్గానికి కొందరికే ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు పాత పథకాల కోసం ఇవ్వాల్సిన నిధుల్ని మళ్లించారు. పథకాల్ని పక్కన పెట్టి కొత్తగా ఓటు బ్యాంకు కోసం దళిత బంధు, బీసీ, మైనార్టీ బంధు అంటూ ఎన్నికల ముందు దరఖాస్తుల్ని స్వీకరించారు. దళిత బంధు కింద నియోజకవర్గానికి 1100 యూనిట్లు మంజూరు చేశారు. రాష్ట్రంలో 1.30 లక్షల కుటుంబాల్ని ఎంపిక చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1210 యూనిట్లు ఎంపిక చేశారు. గ్రౌండింగ్ చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయాయి. బీసీ బంధు పేరిట 5 వేల మంది, మైనార్టీ బంధు పేర 1700 లబ్దిదారుల్ని ఎంపిక చేయగా.. వీరెవ్వరికీ ఆర్థిక సహాయం అందలేదు.

కార్పొరేషన్లకు నిధులిచ్చి పథకాల్ని కొనసాగించాలి : అశోక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు వచ్చే బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలి. గతంలో అమలైన పథకాలన్నీ కూడా అమలు చేయాలి. సబ్సిడీతో కూడిన రుణాల్ని బ్యాంకులతో సంబంధంలేకుండా మంజూరు చేయాలి. ఐదేండ్లుగా కార్పొరేషన్లకు నిధులివ్వలేదు. బంధు పేరిట దగా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం సామాజిక తరగతుల ఆదాయ వనరుల్ని పెంచేందుకు అవసరమైన పథకాల్ని అమలు చేయాలి.

హామీలు వెంటనే అమలు చేయాలి

వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు ఆశా యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్ కోఠిలోని వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, రాష్ట్ర నాయకులు ఎం.మీనా వినతిపత్రాన్ని సమర్పించారు. ఆశావర్కర్లకు 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోనూ, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరోగ్యశాఖ కమిషనర్ హామీలిచ్చారని వారు గుర్తుచేశారు.

గతేడాది అక్టోబర్ 9న సమ్మె సందర్భంగా నాటి డీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు యూనియన్ రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు, పెండింగ్ పీఆర్సీ ఎరియర్స్, కరోనా రిస్క్ అలవెన్స్, సమ్మె కాలం వేతనాలు, ఇతర పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామి ఇచ్చారని తెలిపారు. ఆశావర్కర్ల వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆశాల ధర్నా సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరోగ్యశాఖ కమిషనర్ రూ.50 లక్షల ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులకు రూ.50 వేలు, రిజిస్టర్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామన్న హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీల్లో ఒక్క సమ్మెకాలం వేతనాల హామీ మాత్రమే నెరవేర్చారే తప్ప ఇతర సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. ఇదే విషయంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ శాఖ ఉన్నతాధికారులకు చాలాసార్లు విన్నవించినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆశాలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పారితోషికాలను రూ.18 వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలనీ, ఆశాలకు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. బీసీజీ సర్వే వ్యాక్సినేషన్‌కు పారితోషికం నిర్ణయించాలనీ, లేకపోతే ఆ పనిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా రెండో తేదీకల్లా పారితోషికాలు చెల్లించాలని, అదే విధంగా ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

జనజీవనానికి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి

- రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించిన మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారీ వర్షాల వల్ల జనజీవనానికి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మరో రెండు రోజులపాటు కొనసాగుతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి ఉధృతి క్రమక్రమంగా పెరుగుతుండడంపై ఆయా పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గోదావరి ఉధృతి, వరద పరిస్థితులపై శనివారం ఆయా జిల్లా కలెక్టర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ముప్పు ప్రాంతాల్లో సహాయక చర్యలపై మరింత ముమ్మరం చేయాలన్నారు.భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాలు కురుస్తున్న ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లాలపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ సంబంధిత చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్తు, పంచాయతీ రాజ్, ఆర్అండ్ బి తదితర విభాగాలతో రెవెన్యూ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ విభాగం నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలనీ, ఆ విభాగంలో అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కవి జయరాజ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారు. శనివారం ఉదయం ఆయనకు గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ పంజాగుట్టలో నిమ్స్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. కాగా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన కృషికిగాను తెలంగాణ ప్రభుత్వం 2023లో కాళోజీ నారాయణరావు అవార్డును అందించిన విషయం తెలిసిందే.

మాజీ ఐజీ ప్రభాకర్‌రావును తీసుకురావటంపై సీనియర్ పోలీసు అధికారుల మల్లగుల్లాలు

యూఎస్‌కు స్పెషల్ టీమ్ పంపే విషయమై సీరియస్‌గా యోచన

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీ ప్రభాకర్‌రావును అమెరికా నుంచి తీసుకురావటంపై పోలీసు ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. ఈ కేసులో ఒకటో నిందితుడిగా పేర్కొనబడిన ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్‌కుమార్ సైతం అమెరికాలోని ఉన్నట్టు అంచనా ఉన్నప్పటికీ.. నిజానికి ఆయన ఎక్కడున్నాడనే విషయమై అధికారులకు స్పష్టమైన సమాచారమేదీ లేదు. అయితే, ఈ కేసు వెలుగులోకి వచ్చిన దాదాపు వారం ముందు అమెరికాకు వెళ్లిపోయిన ప్రభాకర్‌రావు కోసం కోర్టు అనుమతితో మొదట లుకౌట్ నోటీసును దర్యాప్తు అధికారులు జారీ చేశారు. అనంతరం ఆయనతో పాటు శ్రవణ్‌కుమార్‌లు దేశం దాటి వెళ్లినట్టు రూఢీ కావటంతో తిరిగి కోర్టు అనుమతితోనే రెడ్‌కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ రెడ్‌కార్నర్ నోటీసును అంతర్జాతీయంగా అమలు చేసే అధికారం ఇంటర్‌పోల్‌కు ఉండటంతో ఆ విభాగానికి రాష్ట్ర సీఐడీ విభాగం ద్వారా సీబీఐకి, సీబీఐ నుంచి ఇంటర్‌పోల్‌కు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియ సాగుతున్న దశలోనే తాను అమెరికాలో ఉన్నాననీ, అక్కడ క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నాననీ, అది పూర్తి కాగానే భారత్‌కు వస్తానంటూ ప్రభాకర్‌రావు నేరుగా దర్యాప్తును పర్యవేక్షిస్తున్న వెంకటగిరికి లేఖ రాశారు. తర్వాత తాను వర్చువల్‌గా విచారణకు హాజరవుతానంటూ కూడా సమాచారాన్ని పంపించాడు. ఈ సమాచారాన్ని నాంపల్లి కోర్టుకు అందజేశారు. ప్రభాకర్‌రావు విజ్ఞప్తిని తోసిపుచ్చిన న్యాయమూర్తి.. నిందితుడిని కోర్టులో హాజరుపర్చాలంటూ దర్యాప్తు అధికారులను ఆదేశించారు. తాజాగా కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఒకపక్క న్యాయ నిపుణులతో చర్చిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు.. మరోపక్క, అమెరికా నుంచి ప్రభాకర్‌రావును ఏ విధంగా తీసుకురావాలనే విషయమై మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే రెడ్‌కార్నర్ నోటీసును కూడా జారీ చేశామనీ, ఆ విషయమై ఇంటర్‌పోల్ ద్వారా నిందితుడికి సమాచారమిచ్చి తీసుకువచ్చే ప్రక్రియ కూడా సాగుతున్నదని ఒక పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఈ ప్రక్రియ అమలులో జరుగుతున్న జాప్యానికి గల కారణాలను విశ్లేషించి త్వరగా అమలు చేసేలా సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌పై ఒత్తిడి తీసుకురావటం ఒక మార్గమనీ, లేదా ఇక్కడి నుంచి ఒక ప్రత్యేక టీమ్‌ను అమెరికాకు పంపించి ప్రభాకర్‌రావును తీసుకొచ్చే విషయమై అడుగు వేయటం ఇంకో మార్గమని కూడా ఉన్నతాధికారులు సీరియస్‌గా యోచిస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఒకట్రెండ్రోజుల్లో ఒక నిర్ణయం తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర హోంశాఖకు సమాచారాన్నందించి తదుపరి చర్యకు దిగాలని సీనియర్ పోలీస్ అధికారులు నిర్ణయించినట్టు తెలుస్తున్నది.


11 జిల్లాలకు ఎల్లో అలర్ట్

- రెండు రోజుల పాటు సాధారణం నుంచి భారీ వర్షాలు
- గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు
- వెల్లడించిన వాతావరణ శాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమైన వాయుగుండం శనివారం ఒడిశా తీరంలో ఉన్న చిలుకా సరస్సును దాటిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. జైసల్మర్, అజ్మీర్, మాండ్ల, రాయిపూర్‌తో పాటు ఒడిశా తీరం వద్ద కేంద్రీకృతమైన వాయుగుండం గుండా వెళుతూ, తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కొనసాగుతుందని తెలిపింది. దీని ప్రభావం వల్ల ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబాబాద్, నారాయణపేట జిల్లాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురువనున్నాయి.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికి పైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 78.3 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లిలో రెండు మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది.

అర్థ సత్యాలు... వక్రీకరణలు



వాస్తవ చిత్రాన్ని ప్రతిబింబించని ఆర్థిక సర్వేలు

- ఫీల్ గుడ్ అంటూ పాలకుల కాలక్షేపం
- పెరుగుతున్న ప్రజా సమస్యలు...లభించని పరిష్కారాలు
- చేదు అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోని ప్రభుత్వం
- విధాన మార్పులు తప్పవంటున్న ఆర్థిక నిపుణులు

కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం ఈ నెల 23న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. గత బీజేపీ ప్రభుత్వం ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించిన విషయం తెలిసిందే. బడ్జెట్ సమర్పణకు ముందు గత సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సరం ఆర్థిక వ్యవస్థ పనితీరు ఎలా ఉంది, రాబోయే కాలంలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది అనే అంశాలను అందులో పొందుపరుస్తారు. ప్రభుత్వం తీసుకోబోయే దిద్దుబాటు చర్యలను ఈ సర్వే సూచిస్తుంది. అయితే ప్రభుత్వం గత అనుభవాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోవడం లేదని, దిద్దుబాటు చర్యల ఊసే ఉండడం లేదని ఇటీవలి అనుభవాలు చెబుతున్నాయి.

న్యూఢిల్లీ : ప్రభుత్వ రాజకీయ నిర్ణయాలు ప్రజల అవసరాలకు భిన్నంగా ఉంటాయి. బడ్జెట్ చాలా మందికి కొరుకుడు పడని పత్రాల సమాహారం. అది ఓ అంకెల గారడీ. ప్రజాకర్షణ పథకాల ప్రకటనతో నిండి ఉంటుంది. అయినప్పటికీ ప్రజా సమస్యలు యథావిధిగా అపరిష్కృతంగా ఉంటూనే ఉంటాయి. అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అంతా భేషుగ్గా ఉన్నదని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం అందులో చెప్పుకుంటుంది. బడ్జెట్‌లో బయటపెట్టే సమాచారం కూడా పరిమితమైనదే. ముందుగానే ఎంపిక చేసుకొని దానిని బడ్జెట్‌లో పొందుపరుస్తారు. పూర్తి చిత్రం బయటపడదు కాబట్టి ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి విశ్లేషకులు ఇతర అంశాలను కూడా పరిశీలిస్తారు. ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు బడ్జెట్‌ను పొగుడుతుంటే విమర్శకులు వాస్తవ చిత్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తారు.

2011 లెక్కలే ప్రామాణికం

బడ్జెట్‌లో రెండు ప్రధానాంశాలు ఉన్నాయి. మొదటిది కీలక సమాచారం బయటపెట్టకపోవడం. రెండోది అందించిన సమాచారం కూడా అవాస్తవాలతో కూడుకోవడం. ఉదాహరణకు 2021లో జనగణన చేయాల్సి ఉంది. కోవిడ్ తర్వాత పలు దేశాలు జనాభా లెక్కలు సేకరించినప్పటికీ మన ప్రభుత్వం ఆ ప్రక్రియను ఇంకా ప్రారంభించనే లేదు. పలు సర్వేల నిర్వహణ, సమాచార సేకరణ కోసం జనగణన అవసరమవుతుంది. ఇప్పుడు అన్నింటికీ 2011 లెక్కలనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే అప్పటి నుండి దేశంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కాబట్టి ఫలితాలు 2024 పరిస్థితిని ప్రతిబింబించవు. ఉపాధి, వ్యవసాయోత్పత్తి, అసంఘటిత రంగం, పేదరికం, అసమానతలు వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని వక్రీకరించి చూపుతున్నారు.

దిగజారిన ర్యాంకింగులు

స్టాక్ మార్కెట్ మదింపులు రికార్డు స్థాయిలో ఉండడాన్ని చూస్తుంటే కోవిడ్ తర్వాత సంఘటిత రంగం ఎలా కోలుకున్నదీ అవగతమవుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు సూచిక అని ప్రభుత్వం చెబుతోంది. విదేశీ మదుపరులు కూడా సంఘటిత రంగంలోనే పెట్టుబడులు పెడుతున్నారు. అసంఘటిత రంగంపై వారికి ఆసక్తి లేదు. ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సి ఉంది. నిరుద్యోగం, వినియోగంపై జాతీయ సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరించడమే కాదు...ఆకలి, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి విషయాలలో అంతర్జాతీయ సూచికలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ దానిని అంగీకరించేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. అంతర్జాతీయ ర్యాంకింగులు వంద శాతం కచ్చితమైనవి కాకపోయినప్పటికీ దిగజారుతున్న మన స్థాయిని ప్రతిబింబిస్తున్నాయి. కొన్ని సూచికలలో ఇతర దేశాల కంటే మన దేశం పనితీరు దారుణంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం క్షీణించాయి. పాలకుల నిరంకుశత్వం కారణంగా మతపరమైన వేధింపులు పెరిగిపోయాయి. ప్రతిపక్షాలపై దాడి చేసేందుకు దర్యాప్తు సంస్థలను ఓ పథకం ప్రకారం ఉపయోగించుకుంటున్నారు.

పాఠాలు నేర్వని ప్రభుత్వం

సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రభుత్వం తొలిసారి ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతోంది. ఎన్నికల్లో ఎదురైన ఎదురు దెబ్బల నుండి పాలకులు గుణపాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించడానికి విధానాలలో మార్పులు చేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో గత ఐదు సంవత్సరాల వాస్తవ చిత్రాన్ని ఆర్థిక సర్వే ప్రజల ముందు ఉంచాలి. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడానికి పెరుగుతున్న ఆర్థిక అశాంతి మాత్రమే కారణం కాదు. ప్రజల వ్యతిరేకతకు నేపథ్యం కూడా కారణమే. ఒకవేళ అంతా బాగుంది అని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం చెప్పుకుంటే విధానాల్లో మౌలిక మార్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ప్రజా సమస్యలు అలాగే ఉంటాయి. 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' విధానానికి ప్రభుత్వం స్వస్తి చెబితే మంచిది. ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే రాబోయే కాలంలో మరిన్ని ఎదురు దెబ్బలు తప్పవు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక సమస్యలను గత ఐదు సంవత్సరాలుగా...ముఖ్యంగా గడచిన ఏడాదిలో ప్రభుత్వం పరిష్కరించి ఉండాల్సింది. కానీ ఆ పని జరగలేదు. జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం సుతరామూ ఇష్టపడలేదు. దాని ఫలితం సార్వత్రిక ఎన్నికల్లో కన్పించింది.

గత చేదు అనుభవాల నుండి ప్రభుత్వం పాఠాలు నేర్చుకుంటుందా? ఆర్థిక సర్వే వాస్తవికతను ప్రతిబింబిస్తుందా? ప్రభుత్వం విధానపరమైన లోపాలను సవరించుకొని ప్రజల ముందుకు వస్తుందా? అసత్యాలు, కట్టుకథలను ప్రచారం చేసి ఇంతకాలం పబ్బం గడుపుకున్న పాలకులు ఇకనైనా కళ్ళు తెరిచి బడ్జెట్‌లో ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తారా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం లభించాలంటే రాబోయే పార్లమెంట్ సమావేశాల వరకూ వేచి చూడక తప్పదు.

తప్పుడు లెక్కలు... అందమైన అబద్ధాలు

కోవిడ్ మహమ్మారి ప్రభావం అధికంగా ఉన్నప్పుడు కూడా 2020-21లో పేదరికం తగ్గిందని తప్పుడు లెక్కలు చూపారు. అలాగే 2014-2024 మధ్య కాలంలో 24 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారంటూ మరో అందమైన అబద్ధం చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలకు వాస్తవ చిత్రాన్ని అందించేందుకు విమర్శకులు ప్రత్యామ్నాయ సమాచారాన్ని ఉపయోగించుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, విమర్శకుల వాదనకు మధ్య చాలా తేడా ఉంటోంది. దేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుతున్న మాట వాస్తవం. అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. అయితే అదే సమయంలో పేదరికం అలాగే ఉంది. విద్య, ఆరోగ్యంలో నాణ్యత లోపించింది. ఈ సమస్యలే సమాజానికి ఆందోళన కలిగిస్తున్నాయి. వీటినే విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. కోవిడ్ నుండి కోలుకున్న తర్వాత పరిస్థితిలో పెద్దగా మార్పేమీ రాలేదు. అసంఘటిత రంగాన్ని తొక్కేసి సంఘటిత రంగం వృద్ధి చెందుతోంది.

అనుకున్నదొక్కటి... అయ్యిందొక్కటి

డిజిటలైజేషన్ ప్రక్రియ అవినీతిని అరికడుతుందని భావించారు. జీఎస్టీ కూడా ఆ పని చేస్తుందని అనుకున్నారు. కానీ బూటకపు కంపెనీలు పుట్టుకొచ్చి ప్రయోజనం పొందాయి. జీఎస్టీ ఎగవేత కారణంగా ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు నష్టపోయింది. నకిలీ ఆధార్ కార్డులు, ఖాతాల హ్యాకింగ్ వంటివి పెరిగిపోయాయి. డిజిటలీకరణతో నగదు చెలామణిని తగ్గించవచ్చునని ప్రభుత్వం అనుకుంది. కానీ ఇప్పుడు అది మరింత పెరిగింది. 2012-13 తర్వాత పెట్టుబడుల స్థాయి పడిపోయింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడం సమస్యను మరింత పెంచింది. బడ్జెట్ లోటు పెరిగిపోవడంతో కార్మికులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను ప్రభుత్వం కుదిస్తోంది. బడా కంపెనీలపై మాత్రం వరాల జల్లులు కురిపిస్తూనే ఉంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం వ్యయం తగ్గిపోతోంది.

ప్రయివేటు జర్నలిజం కళాశాలల్లో సంక్షోభం

గణనీయంగా పడిపోతున్న విద్యార్థుల సంఖ్య

- అధ్యాపకులు, సిబ్బందికి జీతాల చెల్లింపులో జాప్యం

మూత పడుతున్న కాలేజీలు



న్యూఢిల్లీ : దేశంలోని ప్రముఖ జర్నలిజం కళాశాలల్లో తీవ్ర సంక్షోభం నెలకొంది. ఓ వైపు ఫీజులు పెరిగిపోతుంటే అధ్యాపకుల జీతాలు మాత్రం అలాగే ఉంటున్నాయి. మరోపక్క విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పడిపోతోంది. బెంగళూరులోని ఓ ప్రముఖ జర్నలిజం కాలేజీలో మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో 2020లో 18 మంది విద్యార్థులు చేరగా 2021లో 19 మంది చేరారు. 2022లో ఆ కాలేజీలో చేరింది తొమ్మిది మంది మాత్రమే. దీంతో అధ్యాపకులు, సిబ్బందికి జీతాల చెల్లింపులో జాప్యం జరిగింది. గెస్ట్ లెక్చరర్లతో కాలక్షేపం చేశారు. యాజమాన్యం కొన్ని స్వల్ప కాలిక కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. చివరికి 2001లో ప్రారంభమైన ఈ కాలేజీని గత నెలలో మూసేశారు.

దేశంలోని పలు ప్రయివేటు జర్నలిజం స్కూళ్లు, కళాశాలల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. దేశంలోని ఐదు ప్రముఖ సంస్థల్లో గత ఐదేండ్లలో ప్రవేశాలు 15 నుండి 40 శాతం పడిపోయాయి.

ఈ సంవత్సరం సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్‌లో 10-20 శాతం, నేషనల్ స్కూల్ ఆఫ్ జర్నలిజంలో 15 శాతం, స్కావియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్‌లో 20 శాతం, మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్‌లో 30-40 శాతం మేర ప్రవేశాలు తగ్గిపోయాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపునకు చెందిన బెన్నెట్ యూనివర్సిటీ పీజీడీ ప్రోగ్రామ్‌లను నిలిపివేసింది.

ప్రధాన స్రవంతి మీడియాపై విశ్వసనీయత తగ్గిపోవడం, అధిక ఫీజులు, తక్కువ వేతనాలు వంటివి ఈ పరిస్థితికి కారణమని డీన్లు, మీడియా నిపుణులు, విద్యార్థులు తెలిపారు.

యూపీఎస్సీ చైర్మెన్ రిజైన్

'వ్యక్తిగత కారణాలతో' రాజీనామా చేసిన మనోజ్ సోనీ

- పదవీకాలం ముగియక ముందే బాధ్యతల నుంచి తప్పుకున్న వైనం
- ఆమోదం లభించలేదన్న అధికారిక వర్గాలు



న్యూఢిల్లీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) చైర్మెన్ మనోజ్ సోనీ తన పదవికిఅనూహ్యంగా రాజీనామా చేశారు. తన పదవీ కాలం ముగియక ముందే ఆయన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వాస్తవానికి 2029, మే వరకు ఆయనకు యూపీఎస్సీ చైర్మెన్‌గా పదవికాలం ఉన్నది. అయితే, వ్యక్తిగత కారణాలతో ఆయన రాజీనామా చేసినట్టు అధికారిక వర్గాలు తెలి పాయి. ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ అంశం తెరపైకి వచ్చిన తర్వాత యూపీఎస్సీ చుట్టూ ఉన్న వివాదాలు, ఆరోపణలతో ఆయన రాజీనామాకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించాయి. "యూపీఎస్సీ చైర్మెన్ వ్యక్తిగత కారణాలతో పదిహేను రోజుల క్రితం తన రాజీనామాను సమర్పించారు. ఇది ఇంకా ఆమోదించబడలేదు" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ప్రముఖ విద్యావేత్త అయిన మనోజ్ సోనీ(59).. జూన్ 28, 2017న కమిషన్ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించారు. యూపీఎస్సీ చైర్మెన్‌గా మే 16, 2023న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదవీకాలం మే 15, 2029తో ముగియనున్నది. మనోజ్ సోనీ యూపీఎస్సీ చైర్మెన్‌గా ఉండటానికి ఆసక్తి చూపటం లేదనీ, రిలీవ్ కావాలని అభ్యర్థించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఆయన అభ్యర్థనకు అంగీకారం లభించలేదని వివరించాయి. యూపీఎస్సీకి ఒక చైర్మెన్ నేతృత్వం వహిస్తారు. ఇందులో గరిష్ఠంగా పది మంది సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం యూపీఎస్సీ లో ఏడుగురు సభ్యులు ఉన్నారు. అంటే, కేటాయించిన బలం కంటే ముగ్గురు తక్కువగా ఉన్నారు.

అడవులు, జలపాతాల వద్ద పర్యాటకాన్ని అభివృద్ధి చేయండి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అడవులు, జలపాతాల వద్ద పర్యాటకులను ఆకర్షించేందుకు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, ఎన్‌సీసీ, బడ్జెట్‌పై భట్టి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో ఉన్న పచ్చని, దట్టమైన అడవులు, జలపాతాలను గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ టూరిస్టులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం పదేండ్ల కాలంలో అనేక నిర్మాణాలను ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో వందలాది కోట్ల ప్రజాధనం నిరుపయోగమైందని తెలిపారు. గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన వాటి నిర్మాణాలను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. ఆక్రమణలకు గురికాకుండా మైదానాల్లో నిత్యం క్రీడలు నిర్వహించాలని పేర్కొన్నారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీజ్‌లో ఉన్న ఆస్తుల వివరాలపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. సాంస్కృతిక సారథి కళాకారుల సేవలను వినియోగించుకునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు, తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాలపై గ్రామీణ ప్రజానీకంలో కళాకారులు చైతన్యం తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న చెక్‌పోస్ట్‌లను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎమ్‌డీ ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలు నిర్వహించకుండానే ఎల్జీకి మరిన్ని అధికారాలు

సెప్టెంబర్‌లోగా ఎలక్షన్లు నిర్వహించాలన్న సుప్రీంకోర్టు

- అంతలోనే మోడీ సర్కారు నోటిఫికేషన్ జారీ
- కేంద్రం తీరుపై జమ్మూకాశ్మీర్‌లోని ప్రతిపక్ష పార్టీల ఆగ్రహం

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కు ప్రత్యేక అధికారం ఉన్న పాలనా రంగాలను వివరిస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇది ఎన్నికైన శాసనసభ అమలులో ఉన్నా లేదా అన్నదానితో సంబంధం లేకుండా ఎల్జీకి అధికారాలను కట్టబెట్టింది. పోలీస్, పబ్లిక్ ఆర్డర్, ఆలిండియా సర్వీసెస్ ఆఫీసర్లు, సీనియర్ లా ఆఫీసర్ల నియామకం, బదిలీలకు సంబం ధించిన విషయాలపై నిర్ణయం తీసుకునే ఏకైక అధికారం కేంద్రం నియమించిన ఎల్జీకి అని కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నొక్కి చెప్పింది. వివిధ కేసులు, జైళ్లకు సంబంధించిన విషయాల్లో ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలా వద్దా అనే విషయాన్ని కూడా ఎల్జీ నిర్ణయిస్తారు.

ఐదేండ్లుగా జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నుకోబడిన ప్రభుత్వం లేదు. ఎల్జీ కార్యాలయం ద్వారా జమ్మూకాశ్మీర్ కేంద్రం ప్రత్యక్ష పాలనలో ఉన్నది. ఆగస్టు 5, 2019న.. మోడీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతం(యూటీ)గా చేయటంతో జమ్మూ కాశ్మీర్ దాని ప్రత్యేక హెూదా, రాష్ట్ర హెూదాను కోల్పోయిన విషయం విదితమే.

కేంద్రం నుంచి వెలువడిన తాజా నోటిఫికేషన్ విపక్ష పార్టీల నుంచి విస్తృత ఆందోళన, తీవ్ర విమర్శలను రేకెత్తించింది. వారు ఈ చర్యను జమ్మూ కాశ్మీర్ ప్రజలను మరింత 'నిరుత్సాహపరచడం'గా అభివర్ణిస్తున్నారు. ఇది జమ్మూ కాశ్మీర్ ప్రజల ప్రజాస్వామ్య స్వరాన్ని బలహీనపరచటమే లక్ష్యంగా ఉన్నదని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) ప్రధాన ప్రతినిధి తన్వీర్ సాదిక్ అన్నారు. ఎన్నికైన ప్రభుత్వానికి బదులుగా ఎన్నికకాని ఎల్జీకి అధికారాలు ఇవ్వటానికి కేంద్రం తీసుకున్న చర్య జమ్మూ కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ భవిష్యత్తును అణగదొక్కే స్పష్టమైన ప్రయత్నమని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు.. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించిన విషయం విదితమే.

అయితే, సుప్రీంకోర్టు తీర్పు అమలు కాకముందే ఎల్జీకి మరిన్ని అధికారాలను కట్టబెడుతూ మోడీ సర్కారు నోటిఫికేషన్‌ను జారీ చేయటం ప్రతిపక్షాలకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ పరిస్థితుల్లో కేంద్రపాలిత ప్రాంతంలో ముఖ్యమంత్రి పాత్ర ఎలా ఉండబోతుందన్నది ఇక్కడ చర్చనీయాంశంగా మారుతున్నది. "ముఖ్యమంత్రి కీర్తింపబడిన సర్పంచ్ లాగా ఉంటాడు. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ మునిసిపల్ కౌన్సిల్ లాగా ఉంటుంది" అని ఒక రిటైర్డ్ ఉన్నతాధికారి చెప్పారు. జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019లోని సెక్షన్ 55 ప్రకారం జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ "మంత్రి మండలి సలహా మేరకు" నిబంధనలను రూపొందించాలి. అయినప్పటికీ, ఎన్నికైన ప్రభుత్వం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిబంధనలను తనకు అనుకూలంగా రూపొందించడం ప్రారంభించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ రాష్ట్రాల అధికారాల్లోకి చొరబడటం పరిపాటిగా మారిపోయిందనీ, ఇప్పుడు జమ్మూకాశ్మీర్ విషయంలోనూ ఇదే తీరును కనబరుస్తున్నదని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ వైస్ ప్రెసిడెంట్ ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ 'శక్తిలేని, రబ్బర్ స్టాంప్ ఎల్జీ కంటే జమ్మూకాశ్మీర్ ప్రజలు అర్హులు. వారు తన ప్యూన్‌ను నియమించమని ఎల్జీని వేడుకుంటారు' అని వివరించారు. మరో మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్ ప్రజల గురించి న్యూఢిల్లీ ఆలోచించే విధానంపై ఈ సవరణలు ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో బీజేపీ ఏ ఎన్నికల్లోనూ గెలిచే పరిస్థితిలో లేదన్న భయాల వల్లే ఈ మార్పులు చోటు చేసుకున్నాయని ఆమె ఆరోపించారు. రేపు జమ్మూకాశ్మీర్ లో ఏ ప్రభుత్వమైనా ఏర్పడితే అది బీజేపీ వల్లే ఏర్పడదు అని ఆమె అన్నారు.

ఉన్నత విద్యలో మహిళలకు మరింత మద్దతు అవసరం

పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో ఆసక్తి కనబరుస్తున్న అతివలు

గ్రామీణ ప్రాంత స్త్రీలకు పలు అడ్డంకులు

న్యూఢిల్లీ : భారత్‌లోని బాలికలు, మహిళలు.. బాలురు, పురుషులకు మించి చదువుల్లో రాణిస్తున్నారు. ఉత్తమ ప్రదర్శనను కనబరుస్తున్నారు. అయితే, సామాజిక, ఆర్థిక, సాంప్రదాయకంగా వస్తున్న కొన్ని పరిస్థితులు వారిని ఉన్నత చదువులకు దూరం చేస్తున్నాయి. వీటన్నిటిని కూడా ఎదుర్కొని ఎందరో మహిళలు పీజీలు, పీహెచ్‌డీలు వంటి ఉన్నత చదువులను చదువుతున్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. అయితే, కొంత మంది మహిళలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలు ఉన్నత విద్యను పొందటంలో అనేక అవాంతరాలను ఎదుర్కొంటున్నారని విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరాలు మారినా.. సాంకేతిక విప్లవం వచ్చినా.. ఇలాంటి మహిళలకు మాత్రం ఇప్పటికీ ఉన్నత విద్య అనేది కష్టంగా మారుతున్నదని చెప్తున్నారు. దేశంలో లక్షలాది మంది మహిళలు తాము ఉన్నత చదువులు చదువుకోవాలని అనుకున్నా.. వారికి మాత్రం తగిన తోడ్పాటు, మద్దతు మాత్రం లభించటంలేదని మేధావులు, విద్యావేత్తలు, నిపుణులు అంటున్నారు.

ఒక దేశ శ్రేయస్సు బాగా చదువుకున్న శ్రామికశక్తిపై ఆధారపడి ఉంటుంది. విజ్ఞానం, నైపుణ్యాలతో కూడిన వ్యక్తులు వినూత్న ఆలోచనలను రూపొందించగలరు.

ఇది మెరుగైన ఉద్యోగ అవకాశాలకు, ఉత్పాదకతను పెంచటానికి, ఆర్థిక వృద్ధికి దారి తీస్తుంది. విద్య ఈ తక్షణ ప్రయోజనాలకు మించి, సాధికారత, సామాజిక మార్పు కోసం శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది. ప్రత్యేకించి మహిళలకు విద్యాబోధన చేయడం వల్ల గణనీయమైన సామాజిక ప్రయోజనాలు లభిస్తాయని విద్యావేత్తలు, నిపుణులు, సామాజికవేత్తలు అంటున్నారు.


ఆర్థిక, సామాజిక, మానవాభివృద్ధిలో ఉన్నత విద్య కీలక పాత్రను గుర్తిస్తూ.. లింగ భేదం లేకుండా పౌరులందరికీ అందుబాటులో ఉండాలి. పురుషులతో పాటు మహిళలూ ఉన్నత విద్యకు నోచుకోవాలి. పోస్ట్‌గ్రాడ్యుయేట్, డాక్టరేట్ వంటి ఉన్నత విద్యను నోచుకోక లక్షలాది మంది మహిళలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని విద్యావేత్తలు అంటున్నారు.

స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) అనేది ఉన్నత విద్యను పొందటానికి సంబంధించిన కొలమానం. ఇది 18-23 సంవత్సరాల వయస్సు గల మొత్తం జనాభాకు ఉన్నత విద్యా సంస్థలలో నమోదు చేయబడిన విద్యార్థుల నిష్పత్తిగా లెక్కించబడుతుంది. ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏఐఎస్‌హెచ్‌ఈ) నివేదిక ప్రకారం.. పురుషుల జీఈఆర్ గణనీయంగా మెరుగుపడింది. ఇది 2012-13లో 22.7 శాతం నుంచి 2021-22లో 28.3 శాతానికి పెరిగింది.

అదే సమయంలో, మహిళా విద్యార్థులకు 20.1 శాతం నుంచి 28.5 శాతానికి వృద్ధిని కనబరిచింది. ఈ ట్రెండ్ 2019-20లో పరాకాష్టకు చేరుకున్నది. గత దశాబ్దంలో పురుషులతో పోలిస్తే మహిళల నమోదులో అధిక పెరుగుదల ఉన్నట్టు పై సంఖ్య చూపుతున్నది. 2012-13లో, పురుషులకు జీఈఆర్ 22.7 శాతంగా, మహిళలకు ఇది 20.1గా ఉన్నది. 2012-13 నుంచి 2021-22 వరకు ఉన్న విశ్లేషణ భారతదేశంలోని వివిధ విద్యా స్థాయిలు, విభాగాలలో మహిళల నమోదులోని నమూనాలను వెల్లడిస్తుంది. 2021-22లో సామాజిక శాస్త్రాలు అత్యధిక మహిళా విద్యార్థులతో (11.93 శాతం), సైన్స్ (9 శాతం), భాషలు (8.45 శాతం), వాణిజ్యం (6.24 శాతం), మేనేజ్‌మెంట్ (5.97 శాతం)తో పీజీ స్థాయిలో అగ్రస్థానంలో ఉన్నాయి. . అయితే, పీహెచ్‌డీ స్థాయిలో అత్యధిక మహిళా విద్యార్థుల ప్రాతినిధ్యంతో సైన్స్(10.68 శాతం) ఉద్భవించింది. తర్వాత ఇంజనీరింగ్, టెక్నాలజీ (8.44 శాతం), సామాజిక శాస్త్రాలు (5.82 శాతం)లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సామాజిక నిబంధనలు, ఇతర సామాజిక-ఆర్థిక కారకాలు ఇప్పటికీ బాలికలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్యను అభ్యసించటాన్ని నిరోధిస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. దీంతో, సామాజిక నిబంధనలను పరిష్కరించటానికి, మార్గనిర్దేశక కార్యక్రమాల వంటి లక్ష్య మద్దతును అందించడానికి నిరంతర ప్రయత్నాలు అవసరమని సామాజికవేత్తలు, కార్యకర్తలు అంటున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని చర్యలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

2012-13 నుంచి 2021-22 వరకు ఉన్న డేటాను పోల్చి చూస్తే.. ఇంజనీరింగ్, టెక్నాలజీ, మెడిసిన్, లా, మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో మహిళా పీహెచ్‌డీ పెరుగుదల కనిపించింది. పురుష-ఆధిపత్య రంగాలలో మహిళలు ఎక్కువ భాగస్వామ్యాన్ని సూచిస్తున్నారు. పీజీ స్థాయిలో, సాంఘిక శాస్త్రాలు, సైన్స్, వాణిజ్య విద్య వంటి రంగాలు కూడా మహిళా విద్యార్థుల నమోదులో పెరుగుదలను చూశాయి. ఈ తీరు భారత్‌లోని మహిళలకు ఉన్నత విద్య, వృత్తి అవకాశాల అభివృద్ధి చెందుతున్న దృగ్విషయాన్ని చూపిస్తున్నదనని విద్యావేత్తలు అంటున్నారు.



ఏదీ అంతిమ విజయం కాదు.. తదుపరి ఆశయం
తదుపరి లక్ష్యం ఎల్లప్పుడు ఉండనే ఉంటాయి - మోలియో



శునకాక్రోశం

మనుషులంగా మనం జీవిస్తున్నది ఒక ఆవరణంలోనే. ఒంటరిగా కాదు. మన చుట్టూ ఓ ప్రాకృతిక, జీవావరణం సజీవంగా ఉంది కాబట్టే నిత్య ప్రాణవాయువుతో కదలాడుతున్నాము. భూమండలంలోని అనంత జీవకోటికీ మనకూ ఏదో ఒక సంబంధం ముడిపడే ఉంటుంది. కానీ మనం మనుషులం ప్రత్యేకమనుకుంటాం. ఇతర జీవులకు మనకూ ఏం సంబంధం లేదనీ, మనుషుల కేంద్రంగానే ఆలోచిస్తుంటాం. ఇది అజ్ఞానమే. మన చుట్టూ వున్న ఆవరణం, జీవకోటి పరిరక్షణ మీదనే మన మనుగడ ఆధారపడి ఉందనే విషయం, తన గురించి తానే ఆలోచించుకునే స్వార్థజీవిగా మారిన మనిషి మరిచిపోయాడు. ఎందుకంటే ఈ వ్యవస్థ మనిషినలా ఒంటరినీ, స్వార్థపరుణ్ణీ చేసింది మరి!

అనాదిగా కుక్క మన సహజీవి. మచ్చిక చేసుకున్న జంతువు. అంతేకాదు, అతి విశ్వాసజీవిగా పేరు తెచ్చుకున్నది కూడా. ఆదిమంలో మన ఆహార వేటలో మనతో పాటుగా సహకరించిన ప్రాణి. అనేక అపాయాల నుండి రక్షణగా నిలిచింది. ఇప్పటికీ ఇంట్లో కాపలాగా కుక్కనే ఉంచుతాము. దొంగ లను పట్టిచ్చే శక్తి యుక్తులూ ఉన్న జీవి అది. ప్రకృతి ఉపద్రవాలను మనుషులకంటే ముందుగా పసికట్ట గల జ్ఞానం దానిది. బుజ్జి కుక్కలను చూస్తే పిల్లల మనసు విప్పారుతుంది. మన ఇండ్లల్లో ప్రేమగా పెంచుకునే, కుక్కలను రకరకాల పేర్లు పెట్టి ముద్దుగా పిలుచుకుంటాము. అట్లాంటి మనమే కనకపు సింహాసనమున శునకము కూర్చుండదగునా! అనీ 'కుక్కా'! అనీ 'కుక్కబుద్ధి' అనీ తిట్టడానికీ వాడుతాం ఎందుకోమరి! కానీ ఎప్పుడయినా ఓ అన్నం ముద్ద దానికి పెడితే, దాని జీవితాంతమూ మనల్ని చూడగానే తోక ఊపుతూ ప్రేమను ప్రకటిస్తుంది. అందుకే విశ్వాస జంతువని పేరు తెచ్చుకుంది. జాలిగా కృతజ్ఞతగా చూసే దాని కళ్లు మనిషి కండ్ల తర్వాత అన్ని భావాల్ని గొప్పగా చూపించగలిగేది కుక్క కండ్లే అని ప్రఖ్యాత రచయిత జాక్ లండన్ అంటారు.

> **మనుషుల ప్రాణాలు పోవటం, అదీ చిన్నపిల్లలపై పడి కుక్కలు కరుస్తున్న దృశ్యాలు మనందరినీ కలిచివేసే సంఘటనలే. ఇన్ని తరాలుగా సహజీవనం చేస్తున్న కుక్కలు ఇంత పిచ్చివిగా ఎందుకు మారుతున్నాయో సమాజమూ ఆలోచించాలి. ఒక ముఖ్యమైన కారణం, వాటికి ఆహారం దొరకడం లేదు. ఆకలితో చెత్త చెదారం తిని వ్యాధుల బారిన పడుతున్నాయి. దీని మూలంగా అవి విచ్చలవిడిగా మనుషుల వెంటపడుతున్నాయి. వీధుల్లో చెత్త పేరుకు పోవడమూ ఒక పెద్ద సమస్యే. దీనికి ప్రభుత్వాలదీ, అధికారులదీ బాధ్యత. వాటికి కావలసిన ఆహారం లేకపోవటంతోనే దాడులకు తెగబడుతున్నాయనేది వాస్తవం.**

మనతోపాటే, మన వీధిలోనే జీవిస్తున్న కుక్కల వలన మనుషులకు ప్రమాదమేర్పడిందని ఈ రోజు ఆందోళన చెందుతున్నాము. వీధి కుక్కల బారినపడి ఈ మధ్య అనేక మంది పిల్లలు మరణించడం భయాందోళనలు కలిగిస్తున్నది. మన దేశంలోనే అతి ఎక్కువ కుక్కలు జీవిస్తున్నాయి. దాదాపు ఏడు కోట్ల సంఖ్య దానిది. పిచ్చి కుక్క కాటుకు గురయితే రేబీస్ వ్యాధి సోకుతుంది. ఇది ప్రాణాలను మింగేస్తుంది. రేబీస్ వ్యాధితో ఎక్కువగా మరణించేదీ మనదేశంలోనే. గత పదేండ్లలో ఒక్క హైదరాబాద్ నగరంలో మూడులక్షల ముప్పయి ఆరువేలకు పైగా మనుషులు కుక్కకాట్లకు గురయ్యారని సర్వేలు చెబుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో వీధి కుక్కల దాడిలో చిన్నపిల్లలు చనిపోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, పత్రికల వార్త కథనాలను సుమోటోగా స్వీకరించింది. చిన్న పిల్లల ప్రాణాలను కాపాడటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని కోర్టు తప్పు పట్టింది.

మనుషుల ప్రాణాలు పోవటం, అదీ చిన్నపిల్లలపై పడి కుక్కలు కరుస్తున్న దృశ్యాలు మనందరినీ కలిచివేసే సంఘటనలే. ఇన్ని తరాలుగా సహజీవనం చేస్తున్న కుక్కలు ఇంత పిచ్చివిగా ఎందుకు మారుతున్నాయో సమాజమూ ఆలోచించాలి. ఒక ముఖ్యమైన కారణం, వాటికి ఆహారం దొరకడం లేదు. ఆకలితో చెత్త చెదారం తిని వ్యాధుల బారిన పడుతున్నాయి. దీని మూలంగా అవి విచ్చలవిడిగా మనుషుల వెంటపడుతున్నాయి. వీధుల్లో చెత్త పేరుకు పోవడమూ ఒక పెద్ద సమస్యే. దీనికి ప్రభుత్వాలదీ, అధికారులదీ బాధ్యత. వాటికి కావలసిన ఆహారం లేకపోవటంతోనే దాడులకు తెగబడుతున్నాయనేది వాస్తవం. వాటికి ఇవ్వాల్సిన వాక్సినేషన్ కూడా చేయటం లేదు. కేవలం స్టెరిలైజేషన్ చేశామని ప్రభుత్వం చెప్పి చేతులు దులుపుకుంటున్నది. అందుకనే ఇప్పుడు ఇదో పెద్ద సమస్యగా తయారయింది. చాలావరకు వీధి కుక్కలు వాటి జోలికి పోయినపుడే వెంటపడతాయి. రాయి విసిరితేనో, బెదిరిస్తేనో, వాటి ఆత్మరక్షణ కోసం మొరిగి వెంటపడతాయి. కేవలం మూడు నుండి నాలుగేండ్ల వరకే జీవించే కుక్కలకు ఆహారం దొరక్కపోవడం, వ్యాధుల బారిన పడటమే అసలు సమస్య. ప్రపంచంలోనే నెదర్లాండ్ ఈ సమస్యను పరిష్కరించుకున్నది. ఎలా అంటే కుక్కల్ని చంపికాదు. ఇండ్లలో పెంచుకునే జాతికుక్కల పైన పన్నులు పెంచి, వీధి కుక్కలను పెంచుకునే వారికి రాయితీ ఇచ్చింది. మన దేశవాళీ కుక్కలు వేటికంటే కూడా తక్కువ కాదు అనే వాస్తవాన్ని గుర్తించాలి. ఈవీధికుక్కల సమస్యను పూణె, ఇండోర్, బెంగళూరు నగరపాలక సంస్థలు సరైన రీతిలో ఎదుర్కొంటున్నాయి. మన ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాలి.

కనుక కుక్కలయినా, కోతులయినా, మనుషుల సమూహాలు చేస్తున్న తప్పిదాల వల్లనే ఆవరణం పాడైపోయి, సహజంగా జీవనం సాగించే జంతువులు, పక్షులు, పర్యావరణమూ మారిపోయి హాని కలిగిస్తున్నాయనే వాస్తవాన్ని గమనించాలి. వీధికుక్కలు మనిషికి శత్రువులు కావు. అవి శత్రువులుగా మారటానికి మనుషులే కారకులు, వ్యవస్థే కారణం, అందుకనే పరిష్కరించుకోవడం మన చేతుల్లోనే ఉంది.

సంపాదకీయం

ఇవిఎంలపై సందేహాలు, ఇసి నిర్వాకాలు



తెలకపల్లి రవి

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటింగు, లెక్కింపులకు సంబంధించి సందేహాలు వున్న అభ్యర్థులకు ఇవిఎంలను పరీక్షించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ఎన్నికల సంఘం(ఇసి) నోటిఫికేషన్ విడుదల చేసింది. సంబంధిత అభ్యర్థులు తాము కోరుకున్న ఏ పోలింగ్ కేంద్రంలోనైనా మాక్‌పోలింగ్,వివిపాట్ స్లిప్పుల లెక్కింపు కోరవచ్చునని ప్రకటన చేసింది. అయితే జూన్ నాలుగున ఫలితాలు వెలువడిన వారం రోజుల్లోగా అభ్యంతరాలు నమోదు చేసిన వారికి మాత్రమే ఆ అవకాశం వుంటుంది. దేశంలో ఎనిమిది మంది అభ్యర్థుల నుంచి అలాంటి అభ్యంతరాలు ఇసికి అందాయి. వాటిలో కాంగ్రెస్, బీజేడీ, వైసీపీ అభ్యర్థుతలతో పాటు బీజేపీవారు కూడా వుండటం విశేషం. విజయనగరంలోని బొబ్బిలి నుంచి వైసీపీ, ఛత్తీస్‌గఢ్‌లోని కాంకర్‌లో హర్యానాలోని కర్నాల్, ఫరీదాబాద్‌ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఈ దరఖాస్తులు చేశారు. ఆసక్తికరంగా మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణలలో లోక్‌సభ స్థానాలపై బీజేపీ అభ్యర్థులు వెరిఫికేషన్ కోరారు. శాసనసభ పోలింగ్‌కు సంబంధించి ఏపీలో రెండు చోట్ల వైసీపీ,ఒరిస్సాలో ఒకచోట బీజేడీ పరిశీలన కోరాయి. ఓటింగుపై సందేహాలు, ఇవిఎంలలోని మైక్రోచిప్‌ల పరీక్షించు కోవడం చేయొచ్చు. ఒక్కో ఇవిఎంను పరీక్షించుకోవడానికి నలభైవేల రూపాయలు డిపాజిట్ కట్టవలసి వుంటుంది. ఈ ఎనిమిది మంది అభ్యర్థులు మొత్తం 43పోలింగ్ స్టేషన్‌లను ఎంపిక చేసుకున్నారు. ఇసి జూన్ 16వ తేదీన ఒక బహిరంగ ప్రకటన విడుదల చేస్తూ వారు ఎక్కడైనా, ఏ ఇవిఎంనైనా పరీక్షించు కోవడానికి అవకాశం కల్పించడానికి సిద్ధంగా వున్నట్టు వెల్లడించింది.

మారే వైఖరులు, మౌలిక సమస్య

ఇవిఎంలపై అభ్యంతరాలను, అనుమానాలను తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు ప్రధాన పోలింగ్‌కంటే ముందుగా ఏప్రిల్ 26న తీర్పునిచ్చింది. ఎలాంటి సందేహాలకు ఆధారం లేదని అభిప్రాయపడింది. అభ్యర్థులు కోరుకుంటే తమ స్థానాలలో పరీక్షకోసం ఇసికి దరఖాస్తు చేసుకోవడమే మార్గమని సుప్రీం పేర్కొంది. ఈ నిబంధనలు(స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్) ఇసినే తయారు చేసింది. ఆర్థికవ్యయంతో ముడిపడి వుంది గనక ఈ దరఖాస్తుదారులు ఎంతమంది ఎన్నిచోట్ల ముందుకు వస్తారో, ఏం తేడాలు వెల్లడవుతాయో లేదో చూడవలసివుంటుంది. అదెలావున్నా ఫలితాల తర్వాత కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ కూడా ఇవిఎంలపై ప్రశ్నలు అనేకం మిగిలేవున్నాయన్నది కాదనలేని వాస్తవం. కేవలం విజేతలు పరాజితులు లేదా టీడీపీ, వైసీపీ లేదా బీజేపీ, కాంగ్రెస్ వంటి పార్టీల వివాదంగా మాత్రమే ఇవిఎంల చర్చను చూడటం పొరబాటవుతుంది. ఇది మొత్తం మన ఎన్నికల వ్యవస్థకూ పారదర్శకతకూ సంబంధించిన విస్తృత సమస్య. కనుక ఈ విషయంలో ఎప్పుడు ఎవరూ ఏ వాదన చేశారనేది ఒకటైతే సమస్య తీవ్రత మాత్రం విస్మరించడానికి లేదు. ఉదాహరణకు బీజేపీ మాజీ ఎంపీ జీవిఎల్ నరసింహారావు 2010లో ఇవిఎంల విశ్వసనీయతపై ఒక పుస్తకమే రాశారు. దానికి అప్పటి ఆపార్టీ అగ్రనాయకుడు ఎల్‌కె అద్వానీ, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుమాటలు రాశారు. ఇవిఎంలు ప్రభుత్వ రంగసంస్థ ఇసిఐఎల్‌లో తయారవుతాయనే ఒకే కారణంతో పూర్తిగా విశ్వసించడం సరికాదని చంద్రబాబు అందులో రాశారు.జర్మనీ,జపాన్ వంటి అభివృద్ధి చెందిన అనేక దేశాలు ఈవీఎంలను పక్కన పెట్టడంపై జీవీఎల్ అందులో వివరమైన చర్చ చేశారు. పూర్తిస్థాయిలో వివిపాట్‌లను జతచేయడమే దీనికి పరిష్కారమని అందులో జీవీఎల్ వివరించారు.

కేసులు, తీర్పులు

ఇటీవల ప్యోర్టరికో ఎన్నికల్లో అవకతవకలపై తీవ్ర ఆరోపణలను ఉదహరిస్తూ అమెరికా సెనేటర్ రాబర్ట్ ఎఫ్.కెనడీ ఇవిఎంలలో ఓటు సరిగా పడిందో లేదో చూసుకోవడానికి తప్పక అవకాశం వుండాలన్నారు. ప్రపంచ సాంకేతిక దిగ్గజం టెస్లా చైర్మన్ ఎలన్‌మస్క్ ఆయన మాటలు పొందుపరుస్తూ ఏ ఎలక్ట్రానిక్ పరికరాన్నయినా హ్యాకింగ్ చేయొచ్చని స్పష్టం చేశారు. ఆ విధంగా ఇవిఎంల కన్నా పేపర్ బ్యాలెట్‌లే మేలని ఆయన అభిప్రాయపడ్డారు. మన దేశంలో అంతకుముందే వున్న చర్చకు ఇది ఆజ్యం పోసింది. మస్క్ వ్యాఖ్యలు వచ్చీ రాకముందే కేంద్ర మాజీ మంత్రి బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ దానిపై తీవ్రంగా ధ్వజమెత్తారు. లోపరహితమైన ఇవిఎంల తయారీలో కావాలంటే మస్క్‌కు సహకారం అందిస్తామని గొప్పలు పోయారు. నైరుతి ముంబాయిలోని ఒక పోలింగ్ స్టేషన్‌లో అధికారి ఫోన్ ఆ విజేత బావమరిది అక్రమంగా వినియోగం పై కేసు వార్త జతచేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇవిఎంల హ్యాకింగ్‌పై వ్యాఖ్య చేశారు. (ఈ స్థానంలో శివసేన(షిండే) వర్గం అభ్యర్థి అయిదు ఓట్ల ఆధిక్యతతో గెలిచారు) పలు పార్టీలు ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి ఇంకా అనేక ఫిర్యాదులు చేస్తూనే వున్నా సరైన స్పందన కొరవడింది. చెప్పాలంటే సుప్రీంకోర్టులోనే వరుసగా ఇలాంటి కేసులు నడుస్తూనే వచ్చాయి. వివిపాట్‌లను జతచేయాలనే ఆదేశం కూడా 2013లో సుబ్రహ్మణ్యస్వామి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిందే. న్యాయంగా స్వేచ్ఛగా ఎన్నికల ప్రక్రియ జరగాలంటే పేపర్ వినియోగంతో పోల్చిచూడటం(పేపర్ ట్రయల్)తప్పనిసరి అని అభిప్రాయపడింది.సాధ్యమైనన్ని ఎక్కువ చోట్ల వివిపాట్ వెరిఫికేషన్ ఏర్పాట్లు జరగాలని 2019లో తీర్పు చెప్పింది. తాను నిర్ణయించిన అయిదు శాతం పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే వివిపాట్‌లను వినియోగించాలన్నది ఎన్నికల సంఘం నిర్ణయం. రాజ్యాంగపరంగా ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుంటుంది గనక ఒక మేరకు మాత్రమే సుప్రీంకోర్టు ఆదేశించడం సాధ్యమవుతుంది. గతంలో ఇచ్చిన వివిధ తీర్పులు విచారణల ఆధారంగా ఇవిఎంలపై తాజా పిటిషన్లను కొట్టి వేస్తున్నట్టు మొన్నటి తీర్పులో చెప్పింది. అంతటితో ఆగక ఇవిఎంలపైనా, ఇసిపైనా పూర్తి నమ్మకం వెలిబుచ్చడంతో మొత్తం వ్యవస్థ లోపరహితమని కితాబునిచ్చిందని కొందరు భావించారు. నిజానికి ఇవిఎంలను గురించి ఎలాన్ మస్క్ ట్వీట్ అందుకో అవకాశమైంది తప్ప రాజకీయంగా రాజ్యాంగపరంగా ఆ సమస్య అలాగే వుంది.

కోట్ల ఓట్ల తేడా ఎందుకు?

స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించ డంలో ఎన్నికల సంఘం రాజ్యాంగ విహిత బాధ్యతలను నెరవేర్చివుంటే ఫలితాలు బీజేపీ, ఎన్డీయేలకు మరింత ప్రతికూలంగా వుండేవని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ తన ఎన్నికల సమీక్షలో వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం చాలావరకూ ఎన్డీయే భాగస్వామి పాత్ర పోషించిందని ఆపార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. బీజేపీ ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి తోడ్పడటమే లక్ష్యంగా ఇసి వ్యవహరించింది. మోడీతో సహా బీజేపీ నేతలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్టు ఆధారాలతో సహా కనిపిస్తున్నా చర్యలు తీసుకోవ డానికి వెనుకాడింది. మోడీకి ఇవ్వాల్సిన తాఖీదును బీజేపీ అధ్యక్షుడిగా నడ్డాకు పంపి సరిపెట్టడమే గాక దాన్ని అన్నిపార్టీలకూ పంపి తన దోషాన్ని పంచే ప్రయత్నం చేసింది. అంతకంటే దారుణం పోలైన ఓట్ల సంఖ్యా వివరాలు వెల్లడించడానికి నిరాకరిస్తూ ఇసి ఎన్నికల వ్యవస్థలో మోసాలు జరిగివుంటాయనే సందేహాలు పెరగడానికి కారణమైంది. దాని రాజ్యాంగ ప్రతిష్టనూ దెబ్బతీసింది. ఎన్నికలు ముగిసిన తర్వాతనైనా ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఇసి చర్యలు తీసుకోలేదు. ఇవిఎంలలో నమోదైన ఓట్లకూ లెక్కింపు జరిగిన ఓట్ల సంఖ్యకూ భారీ తేడా ఎందుకు వచ్చిందనేది తేల్చనేలేదు. దేశ వ్యాపితంగా చూస్తే మొత్తం 5.14 కోట్ల ఓట్ల తేడా కనిపిస్తున్నది. ఓట్ల సంఖ్యలు దఫదఫాలుగా, రకరకాలుగా ఆలస్యంగా చెప్పడం అనూహ్యమైన పరిణామం. అసలు 2019 ఎన్నికల ఓట్ల వివరాలే రెండేళ్ల తర్వాత సవరించడమంటే ఇక వ్యవస్థ విలువేమయ్యేట్టు? అంటే ఇక్కడ రాజ్యాంగ పరంగానూ, రాజకీయ కోణంలోనూ వ్యక్తిగతంగా ఆయా అధికారులు అంటే కమిషనర్ల పరంగానూ కూడా సవాళ్లు కాదన లేనివి. స్వయంగా తాను సూచించిన కొన్ని తరుణోపాయాలపైన కూడా ఇసి పట్టుపట్టకపోవడం మరీ విచిత్రం.పైగా పరిష్కారాలు, చర్యలు సూచించిన కమిషనర్లను పంపించేయడం, ఉదాహరణకు ఏ పోలింగ్ స్టేషన్లో ఓట్లు వాటికవిగా విడివిడిగా లెక్కపెట్టడం గాక అన్నిటినీ కలిపి(మిక్సింగ్) లెక్కపెడితే మంచిదని ఇసినే ఒకప్పుడు సూచన చేసింది.ఇందుకు టోటలైజర్ అనే సాధనం వాడవలసి వుంటుంది. ఇసిఐఎల్ అందులో ఏర్పాటు చేసింది కూడా. మన ఇవిఎంలలో ఆ విధంగా 14 క్లస్టర్ల ఓట్లు కలిపి చూసే అవకాశం వుంటుంది. సంబంధిత అభ్యర్థికి మొత్తం ఓట్లు ఎన్ని వచ్చాయో తెలుసుకోవడానికి ఒక బటన్ నొక్కితే సరిపోతుంది.లా కమిషన్ కూడా ఈ సూచనకు మద్దతునిచ్చింది.



> స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల సంఘం రాజ్యాంగ విహిత బాధ్యతలను నెరవేర్చివుంటే ఫలితాలు బీజేపీ, ఎన్డీయేలకు మరింత ప్రతికూలంగా వుండేవని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ తన ఎన్నికల సమీక్షలో వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం చాలావరకూ ఎన్డీయే భాగస్వామి పాత్ర పోషించిందని ఆపార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. బీజేపీ ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి తోడ్పడటమే లక్ష్యంగా ఇసి వ్యవహరించింది. మోడీతో సహా బీజేపీ నేతలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్టు ఆధారాలతో సహా కనిపిస్తున్నా చర్యలు తీసుకోవడానికి వెనుకాడింది. మోడీకి ఇవ్వాల్సిన తాఖీదును బీజేపీ అధ్యక్షుడిగా నడ్డాకు పంపి సరిపెట్టడమే గాక దాన్ని అన్నిపార్టీలకూ పంపి తన దోషాన్ని పంచే ప్రయత్నం చేసింది.

యూనిట్ల వరస మార్పు

టోటలైజర్‌పై ఇసి 2016లో రాజకీయ పార్టీలతో చర్చలు జరిపితే కాంగ్రెస్‌తో సహా మూడు పార్టీలు ఒప్పుకున్నాయి సీపీఐ(ఎం) దశలవారీగా ప్రవేశపెట్టాలని చెప్పగా సీపీఐ అభిప్రాయం చెప్పలేదు, బీజేపీ వ్యతిరేకించింది. 2017లో మరోసారి ఇసి కేంద్రం అభిప్రాయం అడిగితే మంత్రుల బృందం అధ్యయనానికి అప్పగిస్తే ఏ బూత్‌లో ఎలా ఓటు చేశారో చేయలేదో తెలిస్తే ప్రభుత్వాలకు తీసుకోవలసిన పాలనా చర్యలు ఏమిటో తెలుస్తుందనే వింతవాదన తీసుకొచ్చింది. ఓటింగు తీరు సమాచారం బెదిరింపులకూ దాడులకూ వాడుకుంటారనే వాస్తవ సమస్యను పక్కదోవ పట్టించింది. ఎన్నికల పారదర్శకత కోసం గట్టిగా మాట్లాడి, అర్ధంతరంగా పదవీ విరమణ చేసిన మాజీ కమిషనర్ అశోక్‌లావాసా దీనిపై ఇటీవలే వ్యాసం కూడా రాశారు. టోటలైజర్ వినియోగించే సమయం ఇంకా రాలేదని మొన్నటి ఎన్నికల తర్వాత కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఒక రిమోట్ సాయంతో పనిచేస్తుంది గనక దాన్ని రాజకీయ పార్టీలు నమ్మకపోవచ్చని వాదించారు. ఇవిఎంలపై సందేహాలున్నా పట్టించుకోని ఇసి లేని రాని పద్ధతిపై నమ్మకం వుండకపోవడం గురించి మాట్లాడుతున్నారు.

పారదర్శకత కోసం,ఇవిఎంలో ఓటింగు యూనిట్‌ల సీక్వెన్స్ మార్చాలని సీపీఐ(ఎం) మరో పద్ధతి సూచించింది. ప్రస్తుతం బ్యాలట్ యూనిట్ ముందు, తర్వాత వివిపాట్ ఆ తర్వాత కంట్రోల్ యూనిట్ వుంటున్నాయి. అంటే వివిపాట్ నిర్ధారించిన ఓటు, మొత్తం నమోదయ్యే కంట్రోల్ యూనిట్‌కు వెళ్లే ఓటు ఒకటే అవునో కాదో అర్థం కాదు, 'బండి ముందు గుర్రం వెనక' చందంగా నడుస్తుంది. కనక ముందు బ్యాలట్ తర్వాత కంట్రోల్ ఆ పైన చివరగా వివిప్యాట్ వుంటే మెరుగని రాసింది. ఇందులో ఎలాంటి సాంకేతిక సమస్యలు కూడా లేవు. అయినా ఎన్నికల సంఘం నిరాకరించింది. కనీసం ఇదే పద్ధతిలో వంద శాతం వివిపాట్‌లను తీసుకోవాలనే కనీస సూచనను కూడా సుప్రీంకోర్టు తిరస్కరించడం దురదృష్టకరం. నా దేశంలో ప్రతి ఓటరూ తన ఓటు సద్వినియోగమైందని నిర్ధారించుకునే వీలుండా లన్నదే రాబర్ట్ కెనడీ ట్వీట్ సారాంశం. ఎలాన్ మస్క్ చెప్పింది కూడా అదే. కనీసం పోలింగ్ కేంద్రాల సీసీటీవీలో నమోదైన ఓటర్ల సంఖ్యనూ నమోదైన ఓట్లనైనా పోల్చి చూడాలని కూడా మస్క్ కొత్తగా సూచించారు. ఏది ఏమైనా భారతీయ ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం, అవకతవకలను చక్కదిద్దడం కోసం పోరాటం కొనసాగ వలసిందే. ఎవరు గెలిచారు ఓడారనే దానితో నిమిత్తం లేని రాజ్యాంగ బద్ధమైన అవశ్యకత అది. ఎందుకంటే న్యాయమైన ఎన్నికలే ప్రజాస్వామ్యానికి, ప్రజల తీర్పు సార్థకతకూ ప్రాణం. ■

సాఫ్ట్‌వేర్ నౌకరనుకుంటే...!

గా దినం సీనన్న దుక్ణంల పాల పాకెట్ దేద్దామని వోతాంటే బస్తీల పోరలందరూ ఒక్కతాన జమైంద్రు. ఓ పోరన్ని దేత్తడి కొట్టుడే కొట్టుడు. ఒక పోరడు కాన్‌బైరీ ఇత్తుంటే, ఇంకో పోరడు గలీజ్, గలీజ్ తిట్లు తిట్టవట్టే. ఏమైందిరా గా పోరన్కి అందరు గల్సి దులాయి జేత్తాంద్రని అడుగుతుంటె ఎవరూ గైశేత్తలేరు. గప్పుడు గా గుంపుల కేల్లి మీసాల రాజన్న బయటి కచ్చిండు. ఏమన్నా ఏం జరుగు తుందే గీ బస్తీల. పోరలందరు ఒక్కన్ని గిట్ల గొడుతుంద్రూ. ఏం తప్పులేదు తమ్మి. గానికి ఇంకా తన్నుల్ వడాల్సిందేనని ఏదో జెప్పవోతుంటే గప్పుడే పోలీసోల్లచ్చి అందర్ని పక్కకు జరిపి తన్నులు దిన్న పోరన్ని పట్టుకపోయిన్రు. గప్పుడు అసలు కత జెప్పిండు రాజన్న. గా పోరడు గీ గల్లీలకు నాలుగునెల్ల కిందనే కిరాయికచ్చిండు బాబన్నోల్లింట్లకు. ఏంజేత్తవనడిగితే సాఫ్ట్‌వేర్ అన్జెప్పిండట. గాల్లు గూడ గాపోరని గురించి పట్టించుకోలేదట. పొద్దుగాల లేవంగనే టిక్కుటాకుగా తయారై ఆఫీస్‌కని వోయి ఏ నడిజాం రాతిరికచ్చుడంట. సాఫ్ట్‌వేరనేసరికి బస్తీలందరుగా పోరనికి గల్లీల మస్త్ ఇజ్జతిచ్చింద్రు. మస్త్ పైసల్ కర్సువెడ్తుండే బస్తీల. బాగా సంపాయించే నౌకరని ఏవలకనుమానం రాలే. అసలు గా పోరడు జేసే పని అలగుంది. కాలేజీల పొంటి తిరుక్కుంటా సదువుకునే పోరలకు గంజాయి పాకెట్లు అమ్మే నౌకరి జేత్తాండు. గీ బస్తీల సదువుకునే పోరని కాలేజిల గంజాయా మ్ముతుంటే ఓసారీ కండ్లతోని జూశింద్రు. గప్పుడుగా సాఫ్ట్‌వేర్ జేసే నౌకరి బస్తీల దెల్శిపోయింది. గీ పోరడు మన బస్తీలుంటే అందరం శెడిపోతమని పోరలందరికి బుగులు వుట్టింది. గంతే గీని కత సక్కగ జెయ్యాలని మోఖమీద దొరుకవట్టి దులాయి జేశింద్రు తమ్మి. గీ పట్నంల ఎవ్వర్ని నమ్మాలో ఎవర్ని నమ్మద్దో తెల్తలేదు. ఒక్కటే బస్తీలుంటం, ఎవరేంజెత్తరో ఎవరికి తెల్వదు. అప్పుడప్పుడు ఊళ్లనుంచి సుట్టాలచ్చి గైన దెల్సా, గీనే దెల్సా అని అడుగుతాంటే సమజేగాదు. రాత్రింటికి వోయే సరికి గా పొద్దుగాల అడ్రసడిగిన మనిషి మన పక్కింట్లనే కనవడ్తడు. గట్లుంటది కథ. గా పల్లెటూల్ల శీమ శిటుక్కుమంటే ఊరంత దెల్తది. ఆపతికి సంపతికి ఏమైనా ఊరంతా ఉరికత్తరు.ఔ తమ్మీ... అప్పుడప్పుడనిపిత్తది నాకూ...గీ పట్నం కన్నా పల్లెటూల్లే నయ్యమని.

- ఊరగొండ మల్లేశం

అప్పుడు గుర్తుకు రాలేదా..?

ప్రజాస్వామ్యంలో ఆందోళనలు, పోరాటాలు సర్వసాధారణం. ప్రజలు తమ హక్కుల కోసం గొంతెత్తటం, పాలకులను నిలేయటం దాని ప్రత్యేకత. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఇదే రకమైన ఒరవడి కొనసాగటమే భారతదేశ విశిష్టత. ఇందులో కీలకపాత్ర పోషించేవి ప్రజా సంఘాలు. వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను అవి ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ జనాన్ని జాగృతం చేస్తుంటాయి. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ అలాంటి ప్రజా సంఘాలుంటాయి. అయితే ఇటీవల ఒక గమ్మత్తయిన పరిస్థితి దేశంలో, ముఖ్యంగా మన రాష్ట్రంలో కొనసాగుతోంది. తాము అనుబంధంగా ఉన్న పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జనాలు సచ్చినా, వారిని చావగొట్టినా 'రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించిన' మాదిరిగా గమ్మున ఉన్న కొన్ని సంఘాలు ఇప్పుడు అమాంతంగా నిద్రలేచాయి. గత పదేండ్లలో 'గులాబీ పూల' మత్తులో ఉన్న ఆ పింకీ యూనియన్లు అకస్మాత్తుగా నిద్రపోతున్న సింహాలు లేచినట్టు లేచి తెగ గాండ్రిస్తున్నాయి. రైతుల ఆత్మహత్యలు, ఇంటర్ విద్యార్థుల చావులు, నేరెళ్ల ఘటనలు, పేపర్ లీకేజీలు, నేతన్నల ఆకలి చావులు, కనీస వేతనాల్లేక కార్మికుల అరిగోసలేవీ... ఈ దశాబ్ద కాలంలో ఆ సంఘాలకు పట్టలేదు. ఇప్పుడు సచివాలయ ముట్టడులు, కమిషనరేట్ల ముందు ధర్నాలు, డైరెక్టర్ ఆఫీసుల గేట్లు ఎక్కడాలు చేస్తూ... తామే 'దేశోద్ధారకులం...' అని ఆయా సంఘాల నేతలు ఫోజులు కొడుతుంటే, 'మీ ఓవరాక్షన్ ఆపండ్రా బాబూ...' అంటున్నారు మేధావులు. ఏ సంఘమైనా ప్రజల కోసం ఆందోళనలు, పోరాటాలు చేయాల్సిందే. కానీ ఒకప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా వ్యవహరిస్తే, ఆయా సంఘాలకే కాదు, వాటి నాయకులకు కూడా విశ్వసనీయత ఉండదు మరి...

-బి.వి.యన్.పద్మరాజు

'త్రీడి' కండ్లజోడు అవసరమే!

ఇంత చిన్న తప్పిదానికి అంత పెద్దశిక్షా! అనడం సహజం. కానీ మాజీ మంత్రి కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడాన్ని చిన్న తప్పిదంగా అభివర్ణించడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అయితే ఆ మాట అన్నాడో లేదో కానీ ఆయనకు మాత్రం మీడియాలో పెద్ద ప్రచారమే వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు ఫిల్లర్లు కుంగిపోయి, పగుళ్లు ఏర్పడ్డాయి. ఓవైపు పెచ్చులు రాలుతున్నాయి.మరోవైపు జాలు వస్తున్నది. ఈ క్రమంలో ఎంతోమంది నిపుణులు దాన్ని పరిశీలించి తమ అభిప్రాయాలు చెప్పారు. జాతీయ డ్యామ్ సెఫ్టీ అధికారులు కూడా దీన్ని పెద్ద తప్పిదంగానే పరిగణించారు. దానిపై ఇంకా విచారణ కొనసాగుతున్నది. అనేక పార్టీల నేతలు కూడా ప్రాజెక్టును పరిశీలించి మానవ తప్పిదంగా వర్ణించారు. మీడియాలో కూడా అనేక కథనాలు వెలువడ్డాయి. ప్రపంచంలోని నిపుణులు, మేధావులు కూడా దానికి పరిష్కార మార్గం చూపలేదు. అలాంటి దుస్థితిలో కాళేశ్వరం ఉంటే కేటీఆర్‌కు మాత్రం ఆ కుంగుబాటు చిన్న తప్పిదమనడం సబబేనా? అయన ఎక్కడ పరిశీలించారో, ఎటువైపు చూసి వచ్చారో, దూరం నుంచి చూశారా? దగ్గరనుంచి చూసి వచ్చారో తెలీదు. కానీ వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు కండ్ల ముందే పెళ్లలు రాలిపడుతుంటే, ఫిల్లర్లు భూమిలోకి కుంగిపోతుంటే, ఆ ప్రాజెక్టులో నీటినిల్వలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కానీ కేటీఆర్‌కు మాత్రం అది చిన్న తప్పిదమని కప్పిపుచ్చుకోవడం ఆయ నకే చెల్లింది. భారీ బడ్జెట్‌తో నిర్మించిన 'కల్కి' సినిమాను ప్రేక్షకులు త్రీడిలో చూస్తున్నారు. అదే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటు పెద్దగా కనిపించాలంటే కేటీఆర్ కూడా త్రీడి కండ్లజోడు ధరిస్తే బాగా కనిపిస్తుంది. అది ఎంత పెద్ద తప్పిదమో అప్పుడు అర్థమవుతుంది.

- గుడిగ రఘు



పెళ్లి - నీతి



"నారాయణ నారాయణ!" అంటూ వైకుంఠంలోకి ప్రవేశించాడు నారదుడు. అక్కడి దృశ్యం యధావిధిగానే ఉంది! శ్రీహరి నిద్రలో ఉండగా మహాలక్ష్మి ఆయన పాదములు ఒత్తుతూనే ఉన్నది.

"తల్లీ వందనాలు!" అంటూ లక్ష్మీదేవికి నారదుడు నమస్కరించాడు. లక్ష్మీదేవి నారదుడిని కుశల ప్రశ్నలు వేసింది.

"స్వామివారు, యోగనిద్రలో నుండి ఎప్పుడు మేల్కొంటారు తల్లీ!" అని నారదుడు అడిగాడు. ఇంతలో శ్రీహరి మేల్కొన్నాడు.

"ఏమి నారదా! ఏమి విశేషాలు? అంతా కుశలమేనా? బహుకాలము తర్వాత తీరిక దొరికినది!" అంటూ ప్రశ్నలు వేశాడు శ్రీహరి.

"స్వామీ! ఈ మధ్య తరచూ మీ దర్శనార్థం వైకుంఠానికి వస్తూనే ఉన్నాను. కాని మీకు నిద్రాభంగం కల్గించటం ఇష్టం లేక తిరిగి వెళ్లిపోతున్నాను. మా నాయనమ్మే ఇందుకు సాక్ష్యం!" అన్నాడు నారదుడు.

"అవును నారదా! కొత్తగా అవతారములు దాల్చవలసిన అవసరమేమీ లేదు కదా! అందుకే నిద్ర పోవుచుంటిని!" అన్నాడు శ్రీహరి.

"కల్కి అవతారము మిగిలియున్నది కదా! ఆ అవతారము ఎపుడు దాల్చెదరు స్వామీ?" ఆసక్తిగా అడిగాడు నారదుడు.

"మరికొన్ని లక్షల సం॥లు గడిచిన పిమ్మటనే కల్కి అవతారమును దాల్చవలసి యున్నది! అందలకు చాలాకాలము ఉన్నది కదా! ఆ చర్చ ఇప్పుడెందులకు?. భూలోక విశేషాలు ఏమిటో తెల్పుము?" అన్నాడు శ్రీహరి.

"భూలోకమునందు మొత్తం ఒకే ఒక విశేషము కలదు స్వామి! అదే అనంత్, రాధికల వివాహవేడుక!" అన్నాడు నారదుడు.

"ముఖేష్ అంబానీ కుమారుడైన అనంత్ వివాహ వేడుకేనా నారదా!" అడిగింది లక్ష్మీదేవి.

"అవును తల్లీ! మీ కృపాకటాక్షములు మెండుగా పొందిన అంబానీ ఇంట, జరిగిన వివాహమే అతి పెద్ద విశేషము!" అన్నాడు నారదుడు.

లక్ష్మీదేవి మొహంలో కోపం అయిష్టత కనపడ్డాయి!

"వివాహం అంటే అదే అన్న విధంగా జరిగింది! నభూతో, నభవిష్యత్ కూడా! అలాంటి వివాహం ఏడేడు పద్నాలుగు లోకాల్లో ఇంకా ఈ మధ్యంతరంలోనే జరగలేదంటే అతిశయోక్తి లేదు!" అన్నాడు నారదుడు.

"మా రామావతారంలో జరిగిన పెండ్లికన్నా వైభవంగా జరిగిందా!" అన్నది లక్ష్మీదేవి.

"నిస్సందేహంగా, మీ సీతారాముల వివాహ వైభవం కన్నా అనంత్, రాధిక వివాహ వైభవం చాలా గొప్పది!" అన్నాడు నారదుడు.

"ఏమిటి నాదరా! మరీ గొప్పలు చెబుతున్నావు! శ్రీ వేంకటేశ్వర కల్యాణం కన్నా గొప్ప కల్యాణమా అది!" అన్నది లక్ష్మీదేవి కోపంగా.

"అనుమానం ఏమీ లేదు తల్లీ!" అన్నాడు నారదుడు నింపాదిగా.

"తప్పు నారదా! దేవతల పెళ్లితో ఒక మానవుడి పెళ్లిని పోల్చి గొప్ప చేస్తావా? ఏమి నీ తుంటరి తనం!" అన్నది లక్ష్మీదేవి చిరుకోపంతో.

"తల్లీ! ఇప్పుడు నేను చెప్పిన మాటలు నావి కావు! భూలోక వాసులు అనుకుంటున్నవే! మచ్చుకి ఒకటి, రెండు చెబుతాను, మీ పెళ్లిళ్లకి, అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల నుండి ఎవరైనా వచ్చారా! ఎంతసేపూ అంగ, వంగ, కళింగ అంటూ బుద్ధ రాజ్యాల రాజులే వచ్చారు! కాని అంబానీ పెళ్లికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి పాశ్చాత్య దేశాధినేతలు కూడా వచ్చారు!" అన్నాడు నారదుడు.

"మరొకటి కూడా వివరించుము నారదా!" అన్నాడు శ్రీహరి నవ్వుతూ.

"మీ పెళ్లిళ్లలో చుట్టాలు, బంధువులు నృత్యాలు చేసినట్టు నేనైతే చూడలేదు కాని అంబానీ పెళ్లిలో ఏ మాత్రం డాన్సు రాని రజనీకాంత్ కూడా స్టెప్పులేశాడు! కర్దాషియన్ సిస్టర్స్ కూడా వచ్చారు! డాన్సులు చేశారు." అన్నాడు నారదుడు.

"కర్దాషియన్ సిస్టర్స్ ఎవరు?" ఆసక్తిగా అడిగింది లక్ష్మీదేవి.

"వారు పాశ్చాత్య దేశాలకు రంభ, ఊర్వశి లాంటి వారు!" అన్నాడు నారదుడు.

"నారదా! మొత్తం విశేషాలన్నీ ఒకేసారి వివరింపుము!" అన్నాడు శ్రీహరి.

"వివాహ పత్రికను అందుకున్న లక్షల ఖర్చు పెట్టి చేయించారు. రెండు వేల రకాల వంటలు చేయించారు. బంగారు తాంబులాలు ఇచ్చారు. ముందే చెప్పినట్లు భూలోకమునందలి ప్రముఖులంతా వచ్చారు. వారంతా వధూవరులకు కోట్లాది రూ॥ విలువైన బహుమతులు ఇచ్చారు. అంబానీ వారు కూడా ఆహుతులకు రెండు కోట్ల విలువైన గడియారాలు రిటర్న్‌గిఫ్ట్ ఇచ్చారు! వివాహ వేడుకల్నీ సనాతన ధర్మం ప్రకారమే నిర్వహించారు! చివర్లో ముఖేష్ అంబానీ, నీతూ అంబానీ సనాతన ధర్మం గురించి ఉపన్యసించారు. ఈ వివాహంపై అనుకూల, వ్యతిరేక చర్చలు పత్రికల్లో, సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి! అయితే సోషల్ మీడియాలోనే వ్యతిరేక చర్చలు జరుగుతున్నాయి! అన్ని, పత్రికలు, టీవీ ఛానళ్లలో ఈ పెళ్లిని ఆదర్శంగా, అతిగొప్పగా వర్ణించుతున్నాయి!" అన్నాడు నారదుడు.

"సోషల్ మీడియాలో చర్చను కూడా వివరించు నారదా!" అన్నాడు శ్రీహరి.

"ఇటీవల జియో నెట్‌వర్క్ ఛార్జీలు పెంచటం. ఈ పెళ్లి కోసమేనని చాలామంది మీమ్స్ చేస్తున్నారు! తమ రెక్కల కష్టంతో వధూవరులకు బంగారు జలతారు వస్త్రాలు చేయించుకున్నారని విమర్శిస్తున్నారు!" అన్నాడు నారదుడు.

శ్రీహరి చిరునవ్వు నవ్వాడు.

"మరి కొందరు, అంబానీ సంపాదించిన డబ్బుతో కొడుకు పెళ్లి ఘనంగా చేసుకుంటే ఓర్వలేని వారు కారుకూతలు కూస్తున్నారని, అంబానీ పెళ్లిలో పెట్టిన ఐదు వేల కోట్ల ఖర్చు వల్ల కొన్ని లక్షల మందికి ఉపాధి దొరికి కడుపు నిండా భోజనం చేశారని, వివాహ వేడుకల సందర్భంగా రోజు తొమ్మిది వేల మందికి అన్నదానం చేసిన అంబానీ అభినందనీయుడని, అంబానీ లేకపోతే దేశం ఆగమై పొయ్యేదని సనాతన ధర్మాన్ని తమ పెళ్లి ద్వారా ఆచరించి చూపిన మహాత్ముడని కొనియాడుతున్నారు!" వివరించాడు నారదుడు.

లక్ష్మీదేవి ఆసక్తిగా ఆలకిస్తున్నది. అంతలోనే ఆమెకు సందేహం కలిగింది!

"మరి ప్రధాని నరేంద్రమోడీ పెళ్లికి వెళ్లలేదా!" అడిగింది.

"మోడీ కూడా వెళ్లారు! సుమారు రెండు గంటల సేపు అక్కడ గడిపారు. వధూవరులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి ప్రత్యేక కానుకల పేటిక బహూకరించారు!" అన్నాడు నారదుడు.

"అదెలా సాధ్యం! మొన్న ఎన్నికల్లో కోట్లాది నల్లధనాన్ని మెటాడోర్ వ్యాన్లలో రాహుల్‌గాంధీకి అంబానీ పంపించారని చెప్పిన మోడీ, ఆ పెళ్లికి ఎలా వెళ్లగలరు! వెళ్లెను పో! కానుకల పేటిక ఏల బహూకరించవలె? ఇదేమి చోద్యము? నోటితో మాట్లాడి నొసటితో వెక్కిరించినట్లు ఉన్నది!" అన్నది మహాలక్ష్మి.

"అవును తల్లీ నిజమే!" అన్నాడు నారదుడు.

"నల్లధనాన్ని అక్రమంగా దాచిపెట్టుకోవటమే కాక ఒక రాజకీయపార్టీకి విరాళంగా పంపు తున్నారని, అంబానీని విమర్శించింది సాక్షాత్తూ ప్రధాని హోదాలోనే! ఎన్నికల తర్వాత గెలిచి తానే తిరిగి ప్రధాని అయ్యాడు! ఇప్పటికి నెల రోజుల పైగా గడిచిపోయింది! ఇప్పటి వరకు అంబానీపై ఎలాంటి చర్యలు తీసుకునలేదు! రూ.ఐదువేల కోట్లు ఖర్చు పెట్టి అంగరంగ వైభవంగా పెళ్లి చేస్తున్న వారి ఇంటికి ఈడి అధికారులను పంపకుండా తగుదునమ్మా అంటూ తానే వెళ్లి కానుకలు ఇచ్చి వస్తాడా? ఇదేమి పద్ధతి! పాత నెట్‌వర్క్ ఛార్జీలతోనే ఇరవై వేల కోట్ల రూ॥ లాభాలను పొందినా ఇంకా సరిపోదని దాదాపు యాభైశాతం ఛార్జీలు పెంచారు! భారత ప్రజల ఆస్తియైన స్పెక్ట్రమ్‌ను ఆయాచితంగా వాడు కుంటూ, ప్రజలపై భారాలు మోపుతున్న అంబానీపై విచారణ చేపట్టవలసిన ప్రధాని వెళ్లి పెళ్లి కానుకలు ఇవ్వటమా! హవ్వ ఇంతకన్నా సిగ్గు చేటైన సంగతి ఏమున్నది? ఓట్లేసి తనకు మూడవసారి అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలకు మోడీ ఏం సందేశం ఇస్తున్నారో స్పష్టమవుతూనే ఉన్నది! ఓట్లేసే ఒక్క నిమిషమే ప్రజలు ఆత్మబంధువులు! ఓటేసిన మరుక్షణం ప్రజలు పరాయివారు! అంబానీలు,ఆదానీలు ఆత్మ బంధు వులై పోతారు! అంబానీ ఇంట జరిగిన పెళ్లిలో నేర్చుకోవల్సిన నీతి ఇదే!" అంటూ ముగించింది లక్ష్మీదేవి.

- ఉషాకిరణ్

ఎస్‌ఎల్బీసీ సొరంగాన్ని త్వరగా పూర్తి చేయాలి

- వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలి
- దీనిపై సీఎం మాట్లాడకపోవడం విచారకరం: మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- పనులను సీపీఐ(ఎం) బృందం పరిశీలన



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా శాశ్వత నీటి పరిష్కారానికి ఎస్‌ఎల్‌బీసీ సొరంగమే శరణ్యమని, దీనికి రాబోయే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్‌-ఎల్‌బీసీ సొరంగం పనులను శనివారం సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం పరిశీలించింది. అక్కడ జరుగుతున్న పనులపై జేపీ అసోసియేట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై అక్కడ కొద్దిసేపు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొరంగం పనులను పూర్తి చేస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రజలకు వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. గతంలో కేటాయించిన బడ్జెట్ కంటే ఎక్కువ నిధులను కేటాయించి పూర్తి చేయాలని కోరారు. ఇప్పటి వరకు సుమారు 34.37 కిలోమీటర్లు సొరంగం తవ్వారని, ఇంకా 9.5 కిలోమీటర్లు తవ్వాల్సి ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది మాసాలు కావస్తున్నా జిల్లా మంత్రులు ఈ ప్రాజెక్టు పూర్తికి కావాల్సిన చర్యలు తీసుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటన సందర్భంగా పాలమూరు, రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకం గురించి ప్రస్తావించారు తప్పా ఎస్‌ఎల్‌బీసీ సొరంగం గురించి మాట్లాడలేదన్నారు. నేటికీ 18 సంవత్సరాలు గడిచినా సొరంగం పనులు పూర్తి కాకపోవడం ఆందోళనకరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ కాలంలో తగిన నిధులు కేటాయించకపోవడంతో పనులు నత్తనడకన నడిచాయని చెప్పారు. 2018లో ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావుకు, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డికి పలుమార్లు లేఖలు రాశామని, ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. పలు మార్లు లేఖలు రాసి ఆందోళనలు చేసిన విషయం గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం నిధుల కేటాయింపులో వివక్ష చూపిందన్నారు.

ప్రభుత్వాలు నిర్ణయించిన కాలపరిమితిలో తగిన బడ్జెట్ కేటాయించకపోవడం వల్ల బడ్జెట్ అంచనాలు పెరిగాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో సుమారు రూ.2వేల కోట్లు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం (ఎఎమ్మార్పీ) ప్రాజెక్టుకు రూ.1500 కోట్లిస్తే పూర్తయ్యే స్థితిలో ఉంటే పట్టించుకోలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా నిధులు కేటాయించకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) నాయకులు బొంతల చంద్రారెడ్డి, తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేశం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, కె.నాగిరెడ్డి, సిహెచ్.లక్ష్మీ నారాయణ, వి.వెంకటేశ్వర్లు, కంబాలపల్లి ఆనంద్, వెంకటయ్య, ఎమ్‌డి.సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, ఊట్కూరి నారాయణరెడ్డి, తుమ్మల పద్మ, మల్లం మహేశ్, కొండా అనురాధ, రాగిరెడ్డి మంగారెడ్డి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నన్నూరి వెంకటరమణారెడ్డి, ఎం.భిక్షం, ఎస్.సైదులు తదితరులు ఉన్నారు.



పారకం లేని చెరువులే.. నివాస స్థలాలుగా..

- ఇండ్ల కూల్చివేతను తక్షణమే ఆపాలి
- హైకోర్టుకు సర్కారే సమాధానం చెప్పాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హన్మకొండ నగరంలోని పారకం లేని చెరువుల్లో పేద, మధ్యతరగతి ప్రజలు ఇండ్లు నిర్మించుకొని ఎన్నో ఏండ్లుగా నివసిస్తుండగా, హైకోర్టు ఆదేశాల పేరుతో వారి ఇండ్లను మున్సిపల్ అధికారులు కూల్చివేయడం దారుణమని, తక్షణమే ఆపాలని నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ. నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హన్మకొండలోని నాగేంద్రనగర్, ప్రగతినగర్ కాలనీల్లో ఆయన పర్యటించగా.. కాలనీవాసులు తమ సమస్యలు, బాధలను ఎమ్మెల్సీకి ఏకరవు పెట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. బంధం చెరువు కింద పారకం లేకపోవడంతో 40 ఏండ్ల క్రితం కొందరు నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని అన్నారు. మున్సిపాల్టీ నుంచి ఇంటినెంబర్, నల్లా, విద్యుత్ కనెక్షన్, మిషన్ భగీరథ నల్లాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలంటూ మున్సిపాల్టీ నోటీసులివ్వడమే కాకుండా ఏకంగా ఇండ్లనూ కూల్చుతున్నారని, వాటిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. చెరువు కింద పారకం లేనందున, ఇండ్లు కట్టుకున్న వారికి అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారని, ఈ విషయాన్ని హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వమే వివరించాలని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వమే కూడు, గూడు, గుడ్డ కల్పించాలని గుర్తుచేశారు. ఈ విషయంలో జిల్లా మంత్రికి, ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్నారు. అలాగే, ఇండ్లు నిర్మించుకున్న వారికి పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్ల కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పేదల కోసం ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నదన్నారు. సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం సహరించకపోతే ప్రజలు నిర్వహించే పోరాటంలో తానూ ప్రత్యక్షంగా పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి. ప్రభాకర్‌రెడ్డి, ఎం. చుక్కయ్య, నాయకులు డి. భానునాయక్, కారు ఉపేందర్, మంద మల్లేశం, బొట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు. .

దేశ ఎకానమీ రెండో స్థానంలో నిలిచేలా అడుగులు

దేశ పురోగతిలో ఐఐటీల పాత్ర కీలకం : ఐఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవంలో నీటి అయోగ్ సీఈఓ సుబ్రమణ్యం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వికసిత్ భారత్‌లో భాగంగా 2024 నాటికి దేశ ఎకానమీ ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరుకునేలా అడుగులు పడుతున్నాయని నీటి అయోగ్ సీఈఓ సుబ్రమణ్యం అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఐఐటీ హైదరాబాద్ 13వ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. ఐఐటీలంటే రైట్ ఆఫ్ ఇండియాగా మారిందని, ఇక్కడ చదవే విద్యార్థులు, పరిశోధనా బృందం దేశ పురోగతిలో ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. విజయాలు మనం పొందే సర్టిఫికెట్లలో ఉండదని, మనం సమాజానికి ఇచ్చే సహకారంలో చూపుతుందని అన్నారు. ఎక్కడా లేని విధంగా దేశంలో 45 కోట్ల మంది విద్యార్థులకు 15 లక్షల ఫ్యాకల్టీలు ఉండి ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు. దేశం విద్యాభివృద్ధిలో దూసుకుపోతుందనడానికి ఇది నిదర్శనమన్నారు. ఉద్యోగాలు కోరుకునే విద్యార్థుల నుంచి ఉద్యోగాలు సృష్టించే కేంద్రాలుగా ఐఐటీలు నిలుస్తుండటం మంచి పరిణామమని తెలిపారు.

2008లో స్థాపించిన ఐఐటీ హైదరాబాద్ అతి తక్కువ కాలంలోనే ఐఐటీల ర్యాంకింగ్‌లో పదో స్థానానికి చేరడం అభినందనీ యమ న్నారు. డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ.. దేశంలోనే మొదటిసారిగా ఇక్కడి క్యాంపస్‌లో సెమీ కండక్టర్ ట్రైనింగ్ నిర్వహించామన్నారు. ఇందులో 620 మంది విద్యార్థులు ఎంట్రీలు సాధించారని తెలిపారు. ఇంటర్ స్పోర్ట్స్ మీట్‌లో కూడా విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. ఐఐటీ హైదరాబాద్ 13వ స్నాతకోత్సవంలో భాగంగా విద్యాభ్యాసం పూర్తి చేసిన మామిత ప్రజ్ఞ ప్రెసిడెన్షియల్ ఇండియా మోడల్ అవార్డు అందుకోగా, తన్మై దత్త, భారతి డీఆర్, అనిరుధ్ శ్రీనివాసన్ బంగారు పథకాలను అందుకున్నారు. అలాగే, వివిధ విభాగాల్లో 1100 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు వెండి ఇతర పథకాలు, పట్టాలను అందుకు న్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఐఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవ వేడుకల సంబరాలు అంబరాన్ని అంటేలా సాగాయి.



పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడాలి

- టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలస్తీనాకు సంఘీభావంగా మన దేశం నిలబడాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధినేత ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. శనివారం నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో టీజేఎస్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో "సీజ్ ఫైర్-ఫ్రీ పాలస్తీన్" అనే అంశంపై మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, మూడో ప్రపంచ దేశాల హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. 1948 నుంచి ఇజ్రాయిల్ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ప్రకారం కేంద్రంలోని పాలకులు ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని గుర్తుచేశారు. మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ అధ్యక్షుడు అజీజ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ మారణహోమానికి పాల్పడుతున్నదని విమర్శించారు. నిజాం కాలేజీ లెక్చరర్ డాక్టర్ జానకి రెడ్డి మాట్లాడుతూ.. గత పది నెలలుగా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కి ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నదని తెలిపారు. ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితిలో 300 తీర్మానాలు వచ్చినప్పటికీ ఇజ్రాయిల్ ఉన్మాదంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సారా మాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

- 1500 మంది పోలీసుల భారీ బందోబస్తు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- వదంతులు సృష్టిస్తే చర్యలు : హైదరాబాద్ నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో/ బేగంపేట్

సికింద్రాబాద్ మహంకాళి ఉజ్జయినీ బోనాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం జరిగే ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఉత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఆది, సోమ రెండ్రోజులు జరిగే ఉత్సవాల్లో మంత్రులు, వీఐపీలు, వీవీఐపీలు, ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో 1500 మందితో భారీ భద్రతను కట్టుదిట్టం చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులు సూచించారు. బోనాల నేపథ్యంలో పోలీసులు షీ బృందాలను, యాంటీ చైన్‌స్నాచింగ్ బృందాలను రంగంలోకి దించారు.

సికింద్రాబాద్‌లోని ఆలయంలో 24 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన అధికారులు, వివిధ ప్రాంతాల్లో అదనంగా మరో 400కుపైగా సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఎప్పటికప్పుడూ బంజారాహిల్స్‌లో సీసీసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు మహంకాళి ఠాణాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జాయింట్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తారు. అలాగే పలు ప్రాతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మేరకు అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా మహంకాళీ దేవాలయం పరిసరాలతోపాటు జనరల్ బజార్, సుభాష్ రోడ్ మార్గాలను మూసేస్తారు. ఎంజీ రోడ్, సింధికాలనీ, మినిస్టర్ రోడ్, ప్యాట్నీ తదిర ప్రాంతాల్లో 21, 22 తేదీల్లో ఈ మార్గాలో వాహనాల దారి మళ్లింపు ఉంటుందన్నారు. సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనే వాహనదారుల కోసం ప్రత్యేకంగా 9 ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని, పోలీసులు సూచించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను పార్క్ చేయాలని కోరారు.

వాస్తవ వేతనాల్లో స్తబ్దత



- అసంఘటిత రంగంలో తీవ్ర సంక్షోభం
- పదేండ్లుగా నలిగిపోతున్న కార్మికులు
- ఆర్థిక వ్యవస్థలో మోడీ సర్కారు వైఫల్యమే కారణం
- ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు

న్యూఢిల్లీ : నిజమైన వేతనాలు అత్యంత ముఖ్యమైన ఆర్థిక సూచికలలో ఒకటి. దేశ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వేగంగా పెరుగుతున్నప్పటికీ వాస్తవ వేతనాలలో గణనీయమైన పెరుగుదల లేకుంటే, వృద్ధి నమూనాలో ఏదో స్పష్టమైన లోపం ఉన్నట్టుగా చెప్తారు. లేబర్ బ్యూరో, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) ఇటీవల విడుదల చేసిన డేటాను బట్టి చూస్తే.. ఈ రోజు భారత ఆర్థిక వ్యవస్థలో సరిగ్గా అదే జరుగుతున్నట్టు కనిపిస్తున్నది. మోడీ గత పదేండ్ల పాలనలో వాస్తవ వేతనాల యొక్క వాస్తవిక స్తబ్దతను సూచిస్తున్నాయి. దీంతో అసంఘటిత రంగంలో తీవ్ర సంక్షోభం కనిపిస్తున్నది. ఇందులో పని చేసే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. మోడీ సర్కారు అనాలోచిత విధానాలతో ఆర్థిక వ్యవస్థ వైఫల్యం చెందిన కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. నిజమైన వేతనాలు ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేయబడిన డబ్బు వేతనాలను సూచిస్తాయి. సాధారణ కార్మికుల కోసం ఒక రోజు పని కొనుగోలు శక్తిని కొలుస్తారు. సహజంగానే, అవి వృత్తులు , స్థానాల మధ్య మారుతూ ఉంటాయి.భారతదేశ లేబర్ బ్యూరో దేశవ్యాప్తంగా 66 ప్రాంతాలలో విస్తరించి ఉన్న 600 గ్రామాల స్థిర నమూనా నుంచి రోజువారీ వేతనాలపై నెలవారీ సమాచారాన్ని సేకరిస్తుంది. ఇది గ్రామీణ భారతదేశంలో వేతన రేట్లు(డబ్ల్యూఆర్‌ఆర్‌ఐ) సిరీస్. ఈ సిరీస్ 25 వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తులకు సంబంధించిన వృత్తి-నిర్దిష్ట డబ్బు వేతనాలపై దృష్టి పెడుతుంది.డబ్ల్యూఆర్‌ఆర్‌ఐ డేటా ప్రకారం.. 2014 నుంచి గ్రామీణ ప్రాంతాలలో నిజమైన వేతనాల యొక్క భయంకరమైన స్తబ్దతను సూచిస్తున్నది. ఈ స్తబ్దత నమూనా ఇప్పటికీ కొనసాగుతున్నది. గత పదేండ్లలో వాస్తవ వేతనాల వార్షిక వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో సున్నాకి దగ్గరగా ఉన్నది. వాస్తవ వేతనాల వార్షిక వద్ధి రేట్లు 2014-15 నుంచి 2023-24 వరకు శాతాల్లో చూస్తే.. సాధారణ వ్యవసాయ కార్మికుల్లో మహిళలు 0.8 శాతం, పురుషుల్లో 1.1 శాతంగా ఉన్నాయి. వ్యవసాయేతర కార్మికుల విషయంలో ఇది వరుసగా 0.1 శాతం, 0 శాతం, నిర్మాణ కార్మికులలో వరుసగా 0.2 శాతం, 0.5 శాతం ఉన్నాయి. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ 2021-22 నుంచి 2022-23 మధ్య నిర్వహించిన అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్(ఏఎస్‌యూఎస్‌ఈ) వార్షిక సర్వేలోనూ ఆసక్తికర విషయాలు బయటపడ్డాయని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. అంటే, 2015-16కి ముందు నిజమైన వేతనాలు వేగంగా పెరుగుతున్నాయి. కానీ ఆ తర్వాత వర్చువల్‌గా నిలిచిపోయాయి. 2010-11 నుంచి 2015-16 మధ్య కాలంలో ఒక అద్దె కార్మికుని వార్షిక వేతనాల వృద్ధి రేటు 7 శాతానికి దగ్గరగా ఉన్నది. కానీ 2015-16 నుంచి 2022-23 మధ్య దాదాపు సున్నా కావటం గమనార్హం. 2021-22 నుంచి 2022-23 మధ్య వాస్తవ వేతనాలలో అస్పష్టమైన క్షీణత కారణంగా వృద్ధి రేట్లు కొంత వరకు తగ్గాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలు(పీఎల్‌ఎఫ్‌ఎస్) కూడా 2022-23లో నిజమైన వేతనాల్లో తగ్గుదలని సూచిస్తుండటం గమనార్హం. జనాభాపై జాతీయ కమిషన్ జనాభా అంచనాల ప్రకారం.. మొత్తం జనాభాలో పని చేసే వయస్సు జనాభా (15-59 సంవత్సరాలు) వాటా గత 20 ఏండ్లలో క్రమంగా పెరుగుతున్నది. నిజమైన వేతనాలు నిలిచిపోయినప్పటికీ పేదరికం తగ్గుదలకు ఇది దోహదపడుతుందని అంచనాలు చెప్తున్నాయి.

నిజమైన వేతనాల స్తబ్దత అసంఘటిత రంగంలో తీవ్ర సంక్షోభాన్ని సూచిస్తుంది. వాస్తవ వేతనాల్లో పెద్దగా పెరుగుదల లేకుండా 10 సంవత్సరాల పాటు ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఈ కాలంలో అసంఘటిత రంగం పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ), కోవిడ్-19 సంక్షోభం వంటి మూడు పెద్ద విపత్తులను చూసింది. అసంఘటిత రంగంలో నిజమైన వేతనాల స్తబ్దత భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన వైఫల్యమని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

	2010-11 నుంచి 15-16	2015-16 నుంచి 20-23
తయారీ	3.7	1.6
ట్రేడ్	3.4	0.8
ఇతర సేవలు	5.3	- 0.4
అన్నీ	4.6	0.5
అన్నీ, గ్రామీణం మాత్రమే	6.6	0.1
అన్నీ, అర్బన్ మాత్రమే	3.8	0.8

రూ.7 కోట్ల విలువ గల హెరాయిన్ స్వాధీనం

- రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు సరఫరా
- చిన్న చిన్న ప్యాకెట్స్‌లో డ్రగ్స్ అమ్మకం
- నలుగురు నిందితుల అరెస్టు : వివరాలను వెల్లడించిన సైబరాబాద్ సీపీ మహంతి



నవతెలంగాణ-మియాపూర్

రాజస్థాన్ నుంచి హెరాయిన్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న నలుగురు నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు రూ.7 కోట్ల విలువ చేసే హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ కార్యాలయంలో సీపీ అవినాష్ మహంతి శనివారం మీడియాకు వెల్లడించారు. మాదాపూర్ పోలీసులు, శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు, నార్కోటిక్ బ్యూరో అధికారులు శనివారం ఉదయం శిల్పారామం వద్ద స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు హెరాయిన్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరందరూ రాజస్థాన్‌కి చెందిన వారుగా గుర్తించారు. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాకు చెందిన సంతోష్ ఆచారి అక్కడ ఓ కేసులో అరెస్టై ప్రస్తుతం జోధ్‌పూర్ జైలులో ఉన్నాడు. అయితే అతను జైలుకు వెళ్లే సమయంలో తన వద్ద ఉన్న హెరాయిన్‌ను నేమి చంద్ భాటీ అనే వ్యక్తికి ఇచ్చాడు. అతను ఈ డ్రగ్స్‌ను అమ్మాలని ప్లాన్ చేశాడు. అందులో భాగంగా ఎవరికి అనుమానం రాకుండా కిలో హెరాయిన్‌ను పావు కిలో చొప్పున రాజస్థాన్ నుంచి స్వీట్స్ డబ్బాల్లో ప్యాక్ చేసుకుని రెండు నెలల క్రితం హైదరాబాద్ అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉంటున్న తన సోదరుడు అజయ్ భాటీ వద్దకు వచ్చాడు. వీరిద్దరితో పాటు రాజస్థాన్‌కు చెందిన నర్పత్ సింగ్, చౌటుప్పల్‌లో ఉంటున్న హరీష్ సిర్వీతో కలిసి తమ వద్ద ఉన్న డ్రగ్‌ను హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్లాన్ చేశారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారంతో శిల్పారామం వద్ద స్పెషల్ ఆపరేషన్ నిర్వహించగా.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న నేమిచంద్ భాటీ, అజయ్ భాటీ, నర్పత్ సింగ్, హరీష్ సిర్వీని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పావుకిలో చొప్పున నాలుగు ప్యాకెట్ల హెరాయిన్‌ను, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నేమిచంద్ భాటీకి హెరాయిన్ అందించిన సంతోష్ ఆచారి ప్రస్తుతం జోద్‌పూర్ జైలులో ఉండగా, అతన్ని పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి విచారిస్తామని సీపీ తెలిపారు. నిందితులు హైదరాబాద్‌లో ఎవరికి డ్రగ్స్ విక్రయించాలని చూస్తున్నారో వారిని కూడా కస్టడీలోకి తీసుకుని విచారిస్తామన్నారు. హెరాయిన్‌ను విదేశాల నుంచి ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల ద్వారా డ్రగ్ పెడ్లర్లు దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. పట్టుబడ్డ నర్పత్ సింగ్‌పై గతంలో రాజస్థాన్‌లో ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయని, మిగితా నిందితుల నేర చరిత్రపైనా విచారణ చేస్తున్నట్టు చెప్పారు. డ్రగ్స్, గంజాయి సరఫరాదారులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సీపీ ప్రజలను కోరారు.



మంత్రి సభలో ప్రొటోకాల్ రగడ

- సభను బహిష్కరించిన బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శనివారం మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్న సభలో ప్రొటోకాల్ వివాదం జరిగింది. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సభను బహిష్కరించి వెళ్లిపోయారు. వివరాల్లోకెళ్తే.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనల కోసం జిల్లా ఇన్‌చార్జి, ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించగా.. ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్యగంటి అర్జున్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల కార్యక్రమాన్ని కాంగ్రెస్ సభలా నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారిక సమావేశంలో సభావేదికపై అతిథులను ఎవరైనా అధికారి పిలవాలి కానీ కాంగ్రెస్ కార్యకర్త పిలవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, దీపిక శేఖర్ రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, శివకుమార్, బి.రోహిణి రమేష్, అమిత శ్రీశైలం చారి, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ కాలుష్యంతో పంటలు కలుషితం

- నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి
- శుద్ధి చేసిన నీరూ తిరిగి మూసీలోకే..
- బడ్జెట్ కేటాయించి అమలు చేయాలి : అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి



నవతెలంగాణ-భువనగిరి

మూసీ కాలుష్యం వల్ల భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో లక్ష ఎకరాల్లో పంటలు కలుషితం కావడమేగాక ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. మూసీ కాలుష్య నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో కొండమడుగు నర్సింహ, మేక అశోక్‌రెడ్డి అధ్యక్షతన "మూసీ ప్రక్షాళన, కృష్ణ, గోదావరి జలాల సాధన" అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో సారంపల్లి మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా మూసీ కాలుష్య నివారణ కోసం బడ్జెట్ కేటాయిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో కాలుష్యం రోజురోజుకూ మరింతగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పట్టణ జనాభా పెరగడంతోపాటు పరిశ్రమలు పెద్దఎత్తున నిర్మాణమవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా ఫార్మా, రసాయనిక పరిశ్రమలు, సింథటిక్ బట్టల పరిశ్రమలు, ప్లాస్టిక్ వినియోగం, మానవ విసర్జితం మూసీ కాలుష్యాన్ని పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు రూ.పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించినా.. కాలుష్య నివారణ చర్యలు తీసుకున్న దాఖలాల్లేవన్నారు. భారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తుండటం, మూసీ నది ఆక్రమణ పెరగడంతో కాలుష్యకాసారంగా మారుతోందన్నారు. దీంతో ప్రజలు అనేక చర్మవ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. మూసీ ఆధారితంగా సాగవుతున్న పంటలకు బస్వాపురం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు, ఉదయ సముద్రం నుంచి కృష్ణా జలాలను ప్రత్యామ్నాయంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మూసీలో రోజుకు 1650 మిలియన్ గ్యాలరీ లీటర్స్ కాలుష్య నీరు వస్తుండగా.. 700 మిలియన్ గ్యాలరీ లీటర్స్ నీటిని మాత్రమే శుద్ధి చేస్తున్నారని చెప్పారు. శుద్ధి చేసిన నీరు కూడా తిరిగి కాలుష్య నీటిలోనే కలవడం వల్ల ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. నదిలోని నీటి నుంచి తెల్లటి నురగలు గాలిలో కలవడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. కాలుష్య నివారణకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు.

మూసీ అధ్యయనపరులు పిట్టల శ్రీశైలం మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా మూసీ నది ప్రవహిస్తూ ప్రజల జీవన విధానాలను మారుస్తుందన్నారు. కాలుష్యం వల్ల మనుషులతో పాటు జీవజాలం చివరకు భూసారం దెబ్బతింటోందన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ మాట్లాడుతూ.. మూసీకాలుష్య నివారణ కోసం అనేక పోరాటాలు చేసినా పాలకుల్లో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మూసీ కాలుష్య నివారణకు, కృష్ణా, గోదావరి జలాల సాధన కోసం దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరు మల్లేశం, దాసరి పాండు, సామాజికవేత్త చెన్నయ్య, బట్టు రామచంద్రయ్య, హమీద్, నాయకులు సిర్పంగి స్వామి, దయ్యాల నర్సింహ, మాయకృష్ణ, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేష్, బొలగాని జయరాములు పాల్గొన్నారు.

నగదురహిత సేవలను కొనసాగిస్తాం

- తెలంగాణ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, ఆరోగ్య భద్రత కార్డులపై నగదు రహిత సేవలను కొనసాగిస్తామని తెలంగాణ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ వెల్లడించింది. ఈ మేరకు శనివారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.గోవింద్ హరి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు, పోలీసు సిబ్బందికి ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా నగదు రహిత సేవలకు చెల్లింపులు ఆలస్యమవుతున్నందున శనివారం నుంచి ఈ సేవలను నిలిపివేస్తామని అసోసియేషన్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసోసియేషన్ నాయకులతో చర్చించారు. బకాయిల చెల్లింపులకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఈ సేవలకు క్రమం తప్పకుండా నెలవారీగా చెల్లింపులు జరిగేలా కృషి చేస్తామని వెల్లడించారు. మంత్రి హామీ మేరకు, దీంతో సేవల నిలుపుదల నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్టు అసోసియేషన్ స్పష్టం చేసింది.

ఆర్టీసీ ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు

- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ తార్నాకలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)కు చెందిన ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించారు. శనివారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ వీటిని ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, ఎంఆర్ఐ ఆధునిక వైద్య యంత్రాలతో పాటు ఫిజియోథెరఫీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఫార్మసీని వారు ప్రారంభించారు. అనంతరం మంత్రి ఆస్పత్రి ఆవరణలో కలియతిరిగి రోగులకు అందిస్తున్న సేవల్ని అడిగి తెలుసుకున్నారు. కొందరు రోగుల్ని పరామర్శించారు. అక్కడి సేవలపై వారి అభిప్రాయాలు అడిగారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, వారికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు.

వరద సహాయచర్యలు చేపట్టండి

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజా జీవితానికిఎలాంటి ఆటంకాలు లేకుండా సహాయచర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారుల్ని ఆదేశించారు. శనివారంనాడామె వర్షాలు, గోదావరి వరదలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి గోదావరి వరద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి సమీప గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో అధికారులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాగులు ఉప్పొంగే ప్రాంతాల్లో పోలీసుల నిఘా ఉంచాలనీ, గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికే వర్షాలు, వరద సహాయ చర్యల కోసం కంట్రోల్ రూమ్, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రిగా ఉన్నందున అక్కడి పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తన కార్యాలయానికి తెలపాలని ఆదేశించారు. ఏటూరు నాగారంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు, వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో 135 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ టీంలతోపాటు బోట్లు కూడా అందుబాటులో ఉన్నాయనీ, కలెక్టర్లతో పాటు జిల్లా ఉన్నతాధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు ఏలాంటి ఆపాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

విశ్వనగరంగా హైదరాబాద్

- లండన్ 'ఐకానిక్'లా మూసీ
- మూసీ ప్రక్షాళనే ప్రజా ప్రభుత్వానికి మార్క్
- యువత ఉద్యోగావకాశాల కోసం స్కిల్ యూనివర్సిటీ
- ఔటర్ రింగ్ రోడ్డు, రిజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతం సెమీ అర్బన్‌గా అభివృద్ధి
- హైడ్రా సంస్థతో నగరంలోని సమస్యలకు స్వస్తి
- వికారాబాద్ మొదలు నల్లగొండ వరకు స్వచ్ఛమైన మూసీ నీళ్లు
- గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



రూ.1.50 లక్ష కోట్లతో ప్రణాళికలు సిద్ధం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

మూసీ అంటే ముక్కు మూసుకునే రోజుల నుంచి మూసీ పర్యటనకు ప్రపంచ దేశాల యాత్రికులు క్యూ కంటే రోజులు రాబోతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రమైన లండన్ ఐకానిక్‌గా మూసీని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే, మూసీ పరిసర ప్రాంతాల్లో 24 గంటల పాటు మార్కెటింగ్ జరిగేలా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. వికారాబాద్ నుంచి నల్లగొండ వరకు స్వచ్ఛమైన నీరందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చరిత్రలో నిలిచిపోయేలా మూసీ ప్రక్షాళన ఉండ బోతుందని తెలిపారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో నిర్మించిన ఫ్లైఓవర్‌ను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న జంట నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్ర ఆదాయంలో 65 శాతం జంట నగరాలను విశ్వనగరాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. నగరంలో ఎలాంటి ట్రాఫిక్ అవాంతరాలు, డ్రయినేజీ సమస్యలు, చెరువు, కుంటల కబ్జాల నుంచి రక్షించేందుకు 'హైడ్రా' సంస్థను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నగరం తెలంగాణ నిరుద్యోగులకు మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికీ ఉపాధి కల్పిస్తోందన్నారు. అందుకే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో ఎలాంటి సమస్యల పరిష్కారానికైనా వెంటనే నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు.

ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చినట్టు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌తో హైదరాబాద్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందన్నారు. వట్టినాగులపల్లి, నార్సింగ్, గోపన్‌పల్లి, మంచిరేవుల ప్రాంతాల్లో భూములు ఎకరం రూ. 100 కోట్ల విలువ పలుకుతున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో ఐటీ, ఐఎస్‌బీ రావడంతో ఈ ప్రాంతానికి మంచి డిమాండ్ వచ్చిందన్నారు. ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందినట్టే.. సిటీ నలుమూలలు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్ని 'కోర్ హైదరాబాద్'గా తీసుకుని అర్బన్ డెవలప్‌మెంట్ కింద అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ కింద తీసుకొని.. ఈ ప్రాంతాల్లో ఐటీ కారిడార్, ఫార్మాసిటీ, పరిశ్రమలతో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారు.

మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రపంచ పటంలో నిలువ బోతుందన్నారు. రూ.31వేల కోట్లతో చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. దేశ చరిత్రలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అనేది గొప్ప విషయమన్నారు. రోడ్ల విస్తరణ పనులకు సీఎం నిధులు ఇవ్వాలని కోరారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, జిల్లా కలెక్టర్ శశాంక, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలు

- మేడిగడ్డ కుంగిన ఫలితం
- ఆరు రోజుల్లో 73 టీఎంసీలు సముద్రంలోకి..



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం భారీగా వచ్చి చేరుతున్నది. తెలంగాణతో పాటు మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ ప్రాంతం నుంచి ఎక్కువగా వరద వస్తున్నది. మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్‌లోని పిల్లర్లు గతేడాది అక్టోబర్‌లో కుంగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్టుకు ముప్పు ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) హెచ్చరించింది. ఈ బ్యారేజీ వద్ద నీటిని నిల్వ చేయకూడదని ఎన్డీఎస్ఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని రెండు నెలల క్రితమే అప్రమత్తం చేసింది. బ్యారేజీలో నీటి నిల్వ చేయరాదని ఎన్డీఎస్ఏ చేసిన సూచనల మేరకు 85 గేట్లు ఎత్తి ఉంచారు. దీంతో వచ్చిన వరద నీరు వచ్చినట్టుగా మేడిగడ్డకు దిగువకు తరలిపోతున్నది. ప్రస్తుతానికి ఇక్కడ ఒక్క బొట్టు నీటిని కూడా నిల్వ చేసే పరిస్థితులు లేవు. ఈ బ్యారేజీ దెబ్బతిని ఇప్పటికే దాదాపు తొమ్మిది నెలలైంది. ఈ మధ్య వ్యవధిలో గోదావరిలో చెప్పుకోదగ్గ నీటి ప్రవాహం రాలేదు. గత ఐదు రోజులుగా భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తింది. శుక్రవారం సాయంత్రానికి మేడిగడ్డ వద్ద ప్రవాహ ఉధృతి 3,10,080 క్యూసెక్కులకు చేరుకోగా, శనివారం ఉదయం 3,84,400 క్యూసెక్కులకు పెరిగింది. క్రమంగా శనివారం సాయంత్రానికి వరద కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. మేడిగడ్డకు ఎగువన ఉన్న అన్నారం బ్యారేజీ వద్ద కూడా ప్రవాహం పెరిగింది. 12,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే.. అక్కడ కూడా నీటిని నిల్వ చేయరాదని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించిన సంగతి తెలిసిందే. అందుకే ఈ బ్యారేజీలోనే 66 గేట్లు ఎత్తి ఉంచారు. దీంతో వరద నీరు వచ్చినట్టు వచ్చి కిందికి తరలిపోతున్నది. ఈనెల 15 నుంచి శనివారం వరకు మేడిగడ్డ ప్రవాహం రోజు రోజుకు పెరుగుతూ వస్తున్నది. అత్యధికంగా ఈనెల 18న 53,400 క్యూసెక్కుల వరద వచ్చింది. దాదాపు ఆరు రోజులుగా సుమారు 73 టీఎంసీలు సముద్రంలోకి కలిసిపోయాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సమాచారం ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ. లక్ష కోట్ల వరకు ఖర్చుపెట్టారు. ఇంకా రూ.47.4 వేల కోట్లు అవసరమని భావిస్తున్నారు. డీపీఆర్ ప్రకారం వాస్తవ ఖర్చు రూ.86,788.06 కోట్లు. ఇందులో రూ.55,807.86 కోట్లు బడ్జెటేతర నిధులు వ్యయం చేశారు. మిగతావన్నీ కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా వాణిజ్య బ్యాంకుల నుంచి నిధులను రుణాల రూపేణా సమకూర్చుకున్నారు. లక్ష కోట్లు కాళేశ్వరం నీళ్లల్లో కొట్టుకుపోయాయని నీటిపారుదలరంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ప్రాజెక్టు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, చిత్తశుద్ధి తో నిర్మించలేదనే చెబుతున్నారు. అవినీతి, అక్రమాల నేపథ్యంలోనే మేడిగడ్డ కుంగిపోయిందని అంటున్నారు.

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు వేర్వేరు కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చారు. ఇందులో ప్రధాన పనులు చేసింది మాత్రం మేఘా ఇంజినీరింగ్ సంస్థనే. అలా కాంట్రాక్టులు దక్కించుకున్న బడా సంస్థలు సుమారు 56 చిన్న చిన్న కంపెనీలకు సబ్‌కాంట్రాక్టులు ఇచ్చినట్టు ఇటీవల న్యాయవిచారణ కమిషన్ తేల్చిన విషయమూ విదితమే. పనుల నాణ్యత దెబ్బతిందనే విమర్శలు గతం నుంచే ఉన్నాయి. అలాగే డీపీఆర్, డిజైన్ల స్థాయిలోనే అడ్డగోలు వ్యవహారం నడిచిందనే ఆరోపణలు వచ్చాయి. ఎన్‌డీఎస్ఏ చెప్పిన మేరకు తాత్కాలిక మరమ్మతులు చేసినా పెద్దగా ప్రయోజనం లేదు. దీనికి 73 టీఎంసీలు సముద్రం పాలు కావడమే ఇందుకు నిదర్శనం.

సముద్రంలోకి ఇలా.. (జులై నెలలో)

తేదీ	క్యూసెక్కులు
15	41200
16	41200
17	49500
18	53400
19	341000
20	280000

ఇరిగేషన్ శాఖలో బదిలీలు రద్దు

- వర్షాల నేపథ్యంలో సర్కారు నిర్ణయం
- ఇంజినీర్ల కొరతా కారణమే
- జీవో 193 జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖలో సాధారణ బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం రదు చేసింది. ఇంజినీర్ల బదిలీలకు శనివారం చివరిరోజైన నేపథ్యంలో ఈనిర్ణయం తీసుకుంది. కాగా నీటిపారుదల శాఖను ఇంజినీర్ల కొరత వేధిస్తున్నది. అలాగే తాజాగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టులు, రిజర్వా యర్లు, బ్యారేజీలను ఎప్పటికప్పుడు ఇంజినీర్లు పర్యవేక్షించాల్సిన అవసరం ఉన్నది. గత ప్రభుత్వం నియామకాలు చేపట్టకపోవడంతో పని ఒత్తిడి తీవ్రంగా ఉందనేది ఇంజినీర్ల అభిప్రాయంగా ఉంది. ఈ మేరకు ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ దృష్టికి సమస్యలను తీసుకొచ్చినట్టు తెలిసింది. ఆయన ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నేపథ్యంలోనే సాధారణ బదిలీల నుంచి నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు మినహాయింపును ఇచ్చినట్టు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం జీవో నెంబరు 193ను విడుదల చేశారు. సాధారణ బదిలీలు చేసేందుకు ఈనెల మూడున జీవో నెంబరు 80ని జారీచేసిన విషయం విదితమే. తెలంగాణ ఇంజినీరింగ్ సర్వీసు నిబంధనల ప్రకారం శాఖాపరమైన అవ సరాలు, నిర్వహణ కోసమే ఇంజినీర్ల బదిలీలను రద్దుచేసినట్టు రాహుల్ బొజ్జా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వీధి కుక్కల బెడద..

- పరిష్కారానికి ఐఏఎస్‌లతో కమిటీ
- మధ్యప్రదేశ్‌లో రోజుకు 55 కేసులు
- రేబిస్ ఇంజెక్షన్ కోసం ఆస్పత్రులకు బాధితుల క్యూ

భోపాల్: వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని నియమించింది. కుక్కల బెడద కేవలం వీధులు, నివాస ప్రాంతాల్లోనే కాకుండా, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాల్లోనూ ఎక్కువగా ఉండడంతో సాధారణ పరిపాలనా శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులతో పాటు మొత్తం 15 మంది సభ్యులు ఉన్నారు. ఈ రాష్ట్రంలో ఏడాదికి 21 వేల కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. ఆ రాష్ట్ర ఆస్పత్రులు అందించిన సమాచారం ప్రకారం 2022లో 8,124 కేసులు నమోద య్యాయి. 2023 నాటికి ఆ సంఖ్య రెండు రెట్లు అధికంగా పెరిగి 16,387కి చేరింది. ఒక్క భోపాల్‌లోనే రోజుకు సగటున 55 కేసులు నమోదవుతున్నాయి. గత ఐదేండ్లలో వీధికుక్కల కాటుతో రేబిస్ వ్యాధి సోకి ఐదుగురు మరణించారు. జులై 1న, భోపాల్‌లోని లాల్‌ఘటికి చెందిన కునాల్‌ను ఒక కుక్క దాడి చేయడంతో ఎనిమిది కుట్లు పడ్డాయి. ఐదు రోజుల తర్వాత రవి సాహు అనే బాలుడు తన కుటుంబంతో కలిసి రైసెన్‌లోని ఒక పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన సమయంలో వీధికుక్కల దాడికి గురయ్యాడు. జులై 9న హోషంగాబాద్‌లోని సేతాని ఘాట్‌లో ఓ వ్యక్తిపై వీధికుక్కలు దాడి చేయగా అతని కాలుపై లోతైన గాయాలయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా తయారైంది. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్ షెల్టర్ హోమ్‌లో వీధి కుక్కలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. మరోపక్క రేబిస్ ఇంజెక్షన్ కోసం ప్రతీరోజూ అనేకమంది ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వరుస కుక్కకాటు ఘటనలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయని విపక్షం పేర్కొంది. అయితే జంతు సంరక్షణ సంస్థలు మాత్రం సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఏఎస్‌లతో కమిటీ నిర్ణయాన్ని స్వాగతించాయి. ఉన్నతాధికారులు మంచి నిర్ణయాలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరాయి. ఈ విషయంపై రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి లఖన్ పటేల్ మాట్లాడుతూ.. "సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాకే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రజల ప్రాణాలు రక్షించడం మా బాధ్యత. అందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశాం" అని అన్నారు.

డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్యకు బండారు దత్తాత్రేయ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన కుటుంబాలకు మందులు, దోమతెరలు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేందుకు 16 కిలోమీటర్లు కాలినడకన వెళ్లిన ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్యను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు. 11 గిరిజన కుటుంబాలకు కోసం వేగంగా ప్రవహించే నదిని దాటి, కొండలెక్కి, రాళ్లను నావిగేట్ చేసి ఐదు గంటల యాత్ర చేసిన విషయం తెలుసుకుని విధులపట్ల ఆయన అంకితభావాన్ని కొనియాడారు. గుత్తికోయ గిరిజన కుటుంబాలు అక్కడే ఉండటం ప్రమాదకరమనీ, వారికి వైద్యసదుపాయాలు కల్పించడం కష్టమని అప్పయ్య వివరించారు .

ముసుగేసిన ముసురు

- జలదిగ్బంధంలో ఏజెన్సీ గ్రామాలు
- ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం భద్రాద్రి పర్ణశాల వద్ద గోదావరి ఉధృతి
- 39 అడుగుల వద్ద ప్రవాహం పొంగిపొర్లుతున్న వాగులు
- జూరాలలో 12 గేట్లు ఎత్తివేత కడెంకు భారీగా చేరుతున్న వరద..
- హెచ్చరిక జారీ సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం

మూడ్రోజులుగా వర్షం తెరిపివ్వకుండా కురుస్తోంది. వాతావరణం మొత్తం ముసుగేసింది. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. చెరువులు, చిన్న ప్రాజెక్టులు అలుగుపారుతున్నాయి. శిథిలావస్థలోని ఇండ్లు కూలిపోయాయి. భద్రాద్రి జిల్లాలో గోదావరి అంతకంతకూ పెరుగుతోంది. చర్లలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణకు ఎగువ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టులు నిండుతుండగా.. కొన్నింటి గేట్లు ఎత్తి దిగువకు వదిలారు. జూరాల 12 గేట్లు ఎత్తేశారు. తద్వారా శ్రీశైలం ప్రాజెక్టుకు వరద చేరుతోంది. తాలిపేరు 25 గేట్లు ఎత్తేశారు. కడెం ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో అధికారులు హెచ్చరిక జారీ చేశారు. గోదావరి, ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగా నదులకు వరద ప్రవాహం పెరుగు తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఖమ్మం నగరంలోని మున్నేరు వాగుకు స్వల్పంగా వరద పెరిగింది. సత్తుపల్లిలోని బేతుపల్లి చెరువు, పెనుబల్లిలో లంకసాగర్ ప్రాజెక్టు అలుగు పడుతోంది. వేంసూరు మండలంలోని అడసర్లపాడు- కొండ్రుపాడు మధ్య ఉన్న కట్టలేరు వాగు పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్ట దయానంద్ విజయకుమార్ పరిశీలించి అధికారులకు సూచనలు అందించారు.

చర్లలో అత్యధిక వర్షపాతం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా శనివారం 1022 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చర్లలో 146.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా ములకలపల్లిలో 9.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చర్ల మండల పరిధిలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి 1,34,528 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్త కోసం 25 గేట్లు ఎత్తి 1,31,840 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 74 మీటర్లు కాగా, 73 మీటర్ల వరకు నీరు నిల్వ ఉంచుతున్నారు. చర్లలోని ఈత వాగు, పగిడేరు వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల గోదావరి తీర ప్రాంతంలో ఉన్న గ్రామాలకు రాకపోకల అంతరాయం ఏర్పడింది. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద ఉన్న సీతా వాగుకు గోదావరి నీరు పోటెత్తడంతో సీత నార చీరల ప్రాంతం మునిగిపోయింది. దీంతో సందర్శకులను నిలిపివేశారు.

నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మణుగూరులో వర్షాల వల్ల సింగరేణిలోని బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. శనివారం 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా ఓసీలోకి నీరు చేరడంతో నిలిచిపోయింది. 12 వేల టన్నుల బొగ్గు రవాణా నిలిచిపోయింది.

పెరుగుతున్న గోదావరి

ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న వరద నీరు భారీగా గోదావరిలోకి వచ్చి చేరడంతో ఇప్పటికే 39 అడుగులకు చేరుకుంది. ఉదయం 6 గంటలకు 30 అడుగులు ఉన్న గోదావరి, క్రమక్రమంగా పెరుగుతూ.. సాయంత్రం 6 గంటలకు 39 అడుగులకు చేరుకుంది. భద్రాచలం వద్ద గోదావరి మరింతగా పెరిగి మొదటి ప్రమాద హెచ్చరికకు చేరుకునే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏటపాక, వీఆర్ పురం, కూనవరం, చింతూరు మండలాలు జలదిబ్బందనంలోకి వెళ్లాయి. గోదావరికి తోడు శబరి, సీలేరు నదులు పొంగి ప్రవహిస్తుండటంతో చింతూరు, వీఆర్పురం, కూనవరం మండలాల్లో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. చింతూరు నుంచి ఒడిశాకు వెళ్లే జాతీయ రహదారి వర్షాలకు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో కంట్రోల్ రూమ్‌ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఏర్పాటు చేశారు. ఏజెన్సీ మండలాల్లో అత్యవసర సేవలు నిమిత్తం, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 7995268352, 08743-232444, 79812 19425 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బొగత జలపాతానికి పర్యాటకులకు అనుమతి నిరాకరణ

కాలేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. కాలేశ్వరంలో త్రివేణి సంగమం తీరం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి ఉంది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని తులారాం ప్రాజెక్టు మత్తడి పోస్తోంది. ములుగు, హన్మకొండ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వాజేడు మండలంలోని బొగత జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతించడం లేదు. రామన్నగూడెం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరిగింది. తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీ వద్ద గోదావరి నది నీటి ప్రవాహం 79.50 మీటర్ల మేరకు పెరిగింది. భూపాలపల్లిలో ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వరద చేరి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 7వేల మెట్రిక్ టన్నుల బొగ్గు వెలికితీత స్తంభించిపోయింది.

మూసీ రిజర్వాయర్‌లోకి వరద

నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలంలోని మూసీ రిజర్వాయర్ నీటిమట్టం 639.60అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి 1550 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 639.60 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.4 టీఎంసీలుగా ప్రస్తుతం 2.99 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండటంతో పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నామని డ్యాం అధికారులు డీఈ చంద్రశేఖర్, ఏఈ ఉదయ్ కుమార్ తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొనసాగింది. ఈ దాటికి వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలోని పెద్దవాగు ప్రవాహానికి అందవెల్లి వద్ద నిర్మించిన అప్రోచ్ రోడ్డు కుంగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెంచికల్‌పేట మండలం బొంబాయిగూడ ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తి ఇల్లు కూలిపోయింది. కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 5500 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 7.6టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.2టీఎంసీలకు చేరుకుంది. 690అడుగుల వరకు మాత్రమే నీటిని నిల్వ చేస్తామని, మిగతాది బయటకు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. వరద ప్రభావం ఎక్కువైతే ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తివేసే అవకాశం ఉందని, పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక జారీ చేసినట్టు తెలిపారు. సత్వర సాయం కోసం జిల్లా విపత్తు నివారణ బృందాల(డీడీఆర్ఎఫ్)ను సిద్ధంగా ఉంచినట్టు అధికారులు చెప్పారు. గోదావరి, ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగా నదులకు వరద ప్రవాహం పెరుగుతోంది. జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చాలా చోట్ల లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. శనివారం 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్టు అధికారులు తెలిపారు.

జూరాలకు భారీగా పెరుగుతున్న వరద

ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాముల నుంచి భారీ ఎత్తున వరద రావడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 83 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీటిమట్టం 1045 అడుగులు ఉండగా, వాటర్ లెవెల్ 318.516 నీటి నిల్వ ఉందన్నారు. 12 గేట్లు ఎత్తి దిగువ శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని వదిలారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా 3,473టీఎంసీల నీటిని దిగువకు వదులుతున్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం కురిసింది. గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీలోని భాగ్యనగర్ కాలనీలోని ప్రధాన రహదారి పక్కన చెట్టు కూలిపోయింది. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారుపై చెట్టు పడటంతో కారు దెబ్బతింది. అధికారులు వెంటనే స్పందించి చెట్టు కొమ్మలను తొలగించి, ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు. షాద్‌నగర్ 8వ వార్డులో మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్ పర్యటించి, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన గొల్ల శ్రీశైలం ఇంటి గోడ వర్షానికి పూర్తిగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది.

గ్రేటర్‌లో ముసురు

గ్రేటర్ హైదరాబాద్‌లో ముసురు వర్షం ఆగకుండా కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. శుక్రవారం రాత్రి నుంచే మోస్తరు వర్షం కురవడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌కు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

అగ్నివీర్ పరీక్షలోనూ రిగ్గింగే !

- తక్కువ మార్కులొస్తే పాస్...ఎక్కువొస్తే ఫెయిల్
- కటాఫ్ కంటే తక్కువొచ్చినా ఎంపిక
- పరస్పర విరుద్ధ ప్రకటనలతో గందరగోళం సృష్టించిన ఆర్మీ



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ నియామక పరీక్షల్లో పెద్ద ఎత్తున కుంభకోణాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా సైనిక దళాల్లో నియామకాలకు సంబంధించిన అగ్నిపథ్ పథకంపై కూడా వివాదం చెలరేగుతోంది. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో 2022 సెప్టెంబర్-నవంబర్‌లో జరిగిన అగ్నివీర్‌ల నియామక పరీక్షలో కూడా రిగ్గింగ్ జరిగిందని అభ్యర్థులు ఆరోపించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాలో చోటు సంపాదించిన ఓ అభ్యర్థి కంటే తమకు ఎక్కువ మార్కులే వచ్చాయని, అయినప్పటికీ తాము ఎంపిక కాలేదని వారు తెలిపారు.

ఎంపిక కాని అభ్యర్థుల్లో సాత్నాకు చెందిన అమన్ ద్వివేది ఒకరు. ఆయన 2022 డిసెంబరులో రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ నెల 1న స్పందించింది. జబల్పూర్‌లో అగ్నివీర్ నియామకం సందర్భంగా ఎంపికైన అభ్యర్థులందరి మార్కులను పక్షం రోజుల్లో పిటిషనర్లకు అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అంతకుముందు మార్కులను బహిర్గతం చేసేందుకు సైన్యం నిరాకరించింది. ఈ వ్యవహారంపై 'ది వైర్' హిందీ పోర్టల్ ప్రత్యేక పరిశోధన చేపట్టింది.

కటాఫ్ మార్కుల కంటే తక్కువ వచ్చినా...

జబల్పూర్‌లో 2022 సెప్టెంబరులో ఫిజికల్ టెస్ట్, నవంబర్ 13న రాత పరీక్ష నిర్వహించారు. నవంబర్ 26న ఫలితాలు ప్రకటించారు. వీటిపై అసంతృప్తి వ్యక్తం చేసిన పలువురు అభ్యర్థులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించడంతో పాటు ఆర్‌టీఐ కింద దరఖాస్తు కూడా చేశారు.

ఆర్‌టీఐ కింద అందిన సమాధానం ప్రకారం నితీష్ కుమార్ తివారీకి రెండు పరీక్షల్లో కలిపి 159 మార్కులు వచ్చాయి. ఎంపికైన అభ్యర్థుల జాబితాలో ఆయన పేరు కూడా ఉంది. అయితే ఇక్కడే పలువురు అవాక్కయ్యారు.

ఎందుకంటే మరో అభ్యర్థి దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తుకు వచ్చిన సమాధానం ప్రకారం అభ్యర్థుల ఎంపికకు సైన్యం 169 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించింది. కాగా ఫలితాలు ప్రకటించిన నెల రోజుల తర్వాత వైద్య పరీక్ష నిర్వహించగా నితీష్ అందులో ఫెయిల్ అయ్యారు. దీంతో ఆయన సైన్యంలో చేరలేదు.

అక్కడ అలా...ఇక్కడ ఇలా

వైద్య పరీక్షలో ఫెయిల్ అయిన నెలన్నర రోజుల తర్వాత నితీష్‌కు ఆర్మీ నియామకాల కేంద్రం నుండి ఓ ఆర్‌టీఐ సమాధానం వచ్చింది. 'నితీష్ పాసయ్యాడు కానీ మెరిట్ జాబితాలో స్థానం దక్కలేదు' అన్నది దాని సారాంశం. అయితే సైన్యం విడుదల చేసిన జాబితా (అదే మెరిట్ జాబితా) ప్రకారం ఎంపికైన అభ్యర్థుల్లో ఆయన కూడా ఒకరు. ఆర్మీ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న పరీక్షా ఫలితాలను పరిశీలిస్తే నితీష్‌ను ఇప్పటికీ ఎంపికైన అభ్యర్థిగా చూపుతున్నారు. సైనికాధికారులు ఇలా పరస్పర విరుద్ధంగా ఎలా వ్యవహరించారో అర్థం కావడం లేదు. ఆర్‌టీఐ సమాధానం చూసిన తర్వాత తన అనుమానాలన్నీ నిజమేనని తేలిందని, అగ్నివీర్‌ల ఎంపికలో రిగ్గింగ్ జరిగిందని తేలిపోయిందని విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన గౌతమ్ తెలిపారు. 'నా విద్యార్థుల్లో చాలా మందికి 160-167 మధ్య మార్కులు వచ్చాయి. వీరిలో ఏ ఒక్కరి పేరు ఎంపికైన అభ్యర్థుల జాబితాలో లేదు. కానీ 159 మార్కులు వచ్చిన నితీష్ పేరు జాబితాలో ఎలా ఉంది?' అని ఆయన ప్రశ్నించారు.

తప్పు తెలుసుకొని...

ఆర్‌టీఐ సమాధానం ప్రకారం నితీష్ కంటే ఎక్కువ మార్కులు వచ్చిన సుజిత్ కుమార్ రావత్ (160.5), వికాస్ సింగ్ (163), అభిషేక్ వర్మ (165.5), సచిన్ సింగ్ (166.5), సౌరబ్ సింగ్ (167) ఫెయిలయ్యారు. పరీక్షా ఫలితాలపై కొందరు అభ్యర్థులు న్యాయస్థానంలో పిటిషన్లు వేయడంతో నితీష్ పేరును జాబితా నుండి తొలగించారని గౌతమ్ ఆరోపించారు. నితీష్ పేరును జాబితాలో ఉంచితే తమకు సమస్యలు తప్పవని సైనికాధికారులు గ్రహించారని, అందుకే చివరి నిమిషంలో అతని పేరును తొలగించారని తెలిపారు. కాగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలో స్థానం దక్కని పలువురు అభ్యర్థులు తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ వారికి చుక్కెదురైంది. దీంతో వారు సాయుధ దళాల ట్రిబ్యునల్‌కు వెళ్లారు. అక్కడా నిరాశ ఎదురైంది. చివరికి మళ్లీ హైకోర్టులో పిటిషన్లు వేశారు.



కాళేశ్వరం గేట్లు పాడవడానికి కారణమెవరో సమాధానం చెప్పాలి

కేటీఆర్‌కు మంత్రి ఉత్తమ్ సవాల్

- తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమావేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాళేశ్వరం గేట్లు పాడవడానికి కారణం ఎవరో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , ఎమ్మెల్యే కేటీఆర్‌కు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరంపై అబద్ధాలు చెప్పడానికి కేటీఆర్‌కు బుద్ధి ఉండాలని అన్నారు. శనివారం నాడిక్కడ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మెన్ అధ్యక్షతన తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంతో కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలకు కూడా నీళ్లు రాలేదని, కానీ మొత్తం తెలంగాణకే నీళ్లు అందించామంటూ తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. ఏ పరీక్షలు చేయకుండానే బ్యారేజీలు కట్టారని, ఏ బ్యారేజీలో కూడా 3-4 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని నిల్వ పెట్టలేరని అన్నారు.

తుమ్మిడిహెట్టి దగ్గర తమ ప్రభుత్వం ప్రాజెక్టు కట్టి తీరుతుందని, ప్రస్తుతం ఉన్న కాళేశ్వరం అలాగే ఉంటుందని అన్నారు. గ్రావిటీతో నీళ్లు తీసుకొచ్చేలా ప్రాజెక్టు రూపొందిస్తామని చెప్పారు. నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్లతోనే మరమ్మతులు చేయిస్తున్నామని, ప్రభుత్వం ఈ పనులకు మళ్లీ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టదని తెలిపారు. అన్నారం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున సీపేజీ ఉందని, సుందిళ్లలో కూడా లోపాలు ఉన్నాయని డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిందని అన్నారు. ఐదేండ్లలో సుమారు 65 టీఎంసీలు పంప్ అయ్యాయని, సంవత్సరానికి 13 టీఎంసీలు మాత్రమే అని తెలిపారు. ప్రచారం కోసమే కాళేశ్వరాన్ని వాడుకున్నారని విమర్శించారు. తుమ్మిడి హెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి ఉంటే విద్యుత్ ఖర్చు చాలావరకు తగ్గేదని అన్నారు. ఇప్పుడు ఏడాదికి రూ.10 వేల కోట్లు విద్యుత్ చార్జీలకే పోతుందని పేర్కొన్నారు. వడ్డీలు రూ. 10 వేల కోట్లు, విద్యుత్ ఖర్చు మరో రూ. 10 వేల కోట్లు ఖర్చవుతుందని అన్నారు. కేసీఆర్ హయాంలో కట్టిన ప్రాజెక్టు, వాళ్ల హయాంలోనే కూలిందని విమర్శించారు. ప్రాజెక్టుపై కేసీఆర్ 40 రోజులు మౌనంగా ఉన్నారని, ప్రజాధనాన్ని వృథా చేశారని అన్నారు.

డ్యామ్ సేఫ్టీ సూచనల మేరకే ముందుకు వెళ్తామని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన టెస్టులు, పనులు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై డ్యామ్ సేఫ్టీ అధికారులతో చర్చించామని అన్నారు. చాలా వరకూ డ్యామ్ సేఫ్టీ సూచనలను అమలు చేశామని పేర్కొన్నారు. సోమవారం మరోసారి భేటీ అవుతున్నామని చెప్పారు. మూడు బ్యారేజీల్లోని గేట్లని ఎత్తి నీళ్లు కిందకు వదిలేయాలని లిఖితపూర్వకంగా డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిందని, ఆ పనులు జరుగుతున్నా యని అన్నారు. అబద్ధాలు చెప్పడానికి కూడా ఒక హద్దు ఉండాలని, బీఆర్ఎస్ దోపిడీ విధానాలతోనే లోపాలు జరిగాయని అన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారులకు కెటిఆర్ కంటే ఎక్కువ పరిజ్ఞానం ఉందని భావిస్తున్నామని, నాశనం చేసినా వారే సలహాలు ఇస్తుంటే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కెసిఆర్, కెటిఆర్ ల ఉచిత సలహాలు అవసరం లేదని అన్నారు. సాంకేతిక కమిటీ నిపుణుల సలహాల మేరకే ముందుకు వెళ్తామని అన్నారు. సమావేశంలో జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మెన్ అనిల్ జైన్, ఎన్డీఎస్ఏ ఉన్నతాధికారులతో రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సలహాదారు ఆధిత్యనాథ్ దాస్, ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జ, ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ సి. నాగేశ్వరరావు, కాళేశ్వరం సీఈ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సాధారణ బదిలీలకు మరో పది రోజులు అవకాశం

- ప్రక్రియ పూర్తికానందునే జీవో 85 జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు మరో 10 రోజులు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శనివారం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో నెంబరు 85ను విడుదల చేశారు. వాస్తవానికి ఈనెల ఐదు నుంచి శనివారం వరకు బదిలీలు చేసుకోవచ్చని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. చాలా సర్కారీ శాఖల్లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి కాని నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు జీవోలో పేర్కొన్నారు.

గందరగోళం..కౌన్సెలింగ్ వాయిదా

ప్రజారోగ్య శాఖలో బదిలీల వ్యవహారం రసాభాసాగా మారింది. సీనియారిటీ జాబితాలు ప్రజారోగ్య (పబ్లిక్ హెల్త్) విభాగం తప్పులతడకగా రూపొందించడంతో బదిలీల అంశం గందరగోళంగా మారి చివరికి వాయిదాపడింది. రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్యకళాశాలకు కౌన్సెలింగ్ కోసం తరలివచ్చిన వేలాదిమంది హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు రాత్రి వరకు పడిగాపులు పడ్డారు. చివరికి కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. దీంతో అధికారుల తీరుపై ఆగ్రహం చేస్తూ స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు పెద్దసంఖ్యలో ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. వ్యవసాయశాఖలో బదిలీలను నిలిపేశారు. నాలుగు కేటగిరీల్లో అధికారులను బదిలీలు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ పథకం అమలయ్యేంత వరకు వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, జిల్లా వ్యవసా యాధికారుల బదిలీలను నిలిపివేస్తున్నట్టు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ప్రకటించిన విషయం విదితమే. దీంతో దాదాపు 3400 మంది అధికారులు, సిబ్బందికి రుణమాఫీ పూర్తయిన తర్వాత బదిలీలు చేస్తారు.

అటవీ శాఖలో అక్రమంగా డిప్యూటేషన్లు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. హెచ్ఎండీఏ పరిధిలో ఏడాది కాలానికిగాను పని చేసేందుకు నలుగురు అధికారులను తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అటవీశాఖ ఉన్నతాధికారులు కుమ్మక్కై డిప్యూటేషన్లు ఇచ్చారనే విమర్శలు వస్తున్నాయి. నీరుపారుదల శాఖలో నలుగురు అధికారులకు అక్రమంగా పోస్టింగ్ ఇచ్చినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ శాఖలో తాత్కాలికంగా బదిలీలను నిలిపేశారు. ప్రణాళిక శాఖలోనూ సీనియార్టీ జాబితాల రూపకల్పనలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కౌన్సెలింగ్ పూర్తయినా శనివారం ఉత్తర్వులు జారీచేయలేదు. రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగాయి.

సాధారణ బదిలీల కౌన్సిలింగ్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

- తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాధారణ బదిలీల కౌన్సిలింగ్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

క్లియర్ వేకెన్సీని ప్రకటించి, ఏ క్యాటగిరీలో ఎవరెవరిని బదిలీ చేస్తున్నారనే విషయాన్ని జాబితాలో స్పష్టంగా పేర్కొనాలని కోరారు. సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలనీ, జోన్ల వారీగా సీనియారిటీ ప్రకారం స్పష్టంగా లిస్ట్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలింగ్ తేదీలను కూడా స్పష్టంగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఇప్పటికే మూడు సార్లు ప్రకటించిన లిస్టుల్లో తప్పులున్నాయనీ, డీహెచ్ కార్యాలయం నర్సింగ్ ఆఫీసర్ల లిస్టును సరిగ్గా ప్రకటించడం లేదని విమర్శించారు. శుక్రవారం ఆందోళనతో ఆగిపోయిన కౌన్సిలింగ్‌ను ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపైనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే నెలలో జీవో నెంబర్ 80 విడుదలైన వెంటనే అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా స్టాండింగ్ లిస్ట్‌ను జోన్ల వారీగా చూపిస్తూ, ప్రతి జోన్ నుంచి 40 శాతం తప్పనిసరి బదిలీల వివరాలివ్వాలని కోరారు. 26 నుంచి 30 సంవత్సరాలుగా సేవలం దిస్తున్న 98, 95 అపాయింట్ మెంట్ బ్యాచ్‌కు పదోన్నతుల్లో ముందుగా ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.

ప్రమాదాల నివారణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి

- రూ.78 కోట్లతో 107 జంక్షన్ల అభివృద్ధి
- ఆహ్లాదకర వాతావరణం కోసం సుందరీకరణ పనులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ నగరంలో జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నట్టు జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు. నగరంలో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో 40 నుంచి 60 శాతం వరకు జంక్షన్లలోనే జరుగుతున్నట్టు పలు సర్వేల్లో తేలింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో జంక్షన్ల సుందరీకరణ, వాహనాలను క్రమబద్ధీకరించడంతోపాటు పాదచారుల ప్రమాదాల నివారణ లక్ష్యంగా జీహెచ్ఎంసీ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. జంక్షన్ల అభివృద్ధి, భద్రత కల్పించడం కోసం చర్యలు తీసుకుంటోంది. రూ.78 కోట్లతో 107 జంక్షన్ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించింది.

శివారు ప్రాంతాలపైనా..

జీహెచ్ఎంసీకి ఆనుకొని ఉన్న నగరాలు, పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న జంక్షన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా నగరంతోపాటు శివారు ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా జీహెచ్ఎంసీ ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తోంది. సర్కిల్ పరిధిలో గల ట్రాఫిక్ జంక్షన్లను గుర్తించి, ప్రమాదాలను అరికట్టేందుకు రూ.7814.94 లక్షల అంచనా వ్యయంతో 107 జంక్షన్ల అభివృద్ధికి చర్యలు చేట్టింది. సిగ్నల్ ఏర్పాటు, పాదచారుల ప్రమదాలు జరగకుండా ఫుట్‌పాత్ నిర్మాణాలతోపాటు వాహనదారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు సుందరీకరణ పనులు చేపట్టింది. ఇప్పటి వరకు 31 జంక్షన్లు పూర్తి చేయగా, 13 జంక్షన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరో 17 జంక్షన్లు మంజూరు కావాల్సి ఉంది. 16 జంక్షన్లలో పనులు ప్రారంభం చేయాల్సి ఉంది. 8 టెండర్‌లు ప్రాసెస్‌లో ఉండగా, మరో 8 భూసేకరణ చేయాల్సి ఉంది. ఇక 14 జంక్షన్‌లు ఫిసిబులిటీలో లేవు. సర్కిల్ వారీగా ప్రాధాన్యత గల జంక్షన్లను గుర్తించి అభివృద్ధి చేస్తున్నారు.

బొగ్గు, ఖనిజాలపై వచ్చే ఆదాయం రాష్ట్రాలకే

- మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీకి చర్యలు :

కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బొగ్గు, ఖనిజాల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో, ఆ మొత్తం రాష్ట్ర ప్రభుత్వాలకే చెందుతుందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బేగంపేటలో జరిగిన మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్‌షోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా రంగాల నుంచి తగినంత ఆదాయం వచ్చేది కాదనీ, అందుకు ఒడిశా రాష్ట్రమే ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రానికి ఏటా రూ.40వేల కోట్లు మైనింగ్ ద్వారా సమకూరుతున్నాయని తెలిపారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు విద్య, వైద్యం, స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు క్లీన్ ఎనర్జీని పెంపొందించేందుకు పెద్దఎత్తున చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 373 మైనింగ్ బ్లాక్స్ వేలం పూర్తయినట్టు తెలిపారు.

ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానాలు పంపండి

- బడ్జెట్ ఏర్పాట్లపై సీఎస్ కసరత్తు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని ఆమె అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సెషన్‌లో శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్టు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలిపారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరుగుతుందనీ, నోట్ ఆన్ డిమాండ్ రూపొందించి బడ్జెట్‌ను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. దీనివల్ల శాసన సభ్యులు దానిని పరిశీలించి, చర్చకు సంబంధించిన విషయాలను లేవనెత్తేందుకు తగిన సమయం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, కార్యదర్శులు రఘునందన్‌రావు, జ్యోతి బుద్ధ ప్రకాష్, వీ కరుణ, లోకేష్ కుమార్, ముఖ్య ప్రజాసంబంధాల అధికారి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో తగ్గుదల

జూన్ త్రైమాసికంలో 3.24 శాతం తగ్గుదల



న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన అన్ని రంగాల ఎగుమతులు డీలా పడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 3.24 శాతం పడిపోయి 5.88 బిలియన్ డాలర్ల (రూ.49వేల కోట్లు)కు పరిమితమయ్యాయి. ఎర్ర సముద్ర సంక్షోభం కారణంగా సరుకు రవాణా ఖర్చు పెరగడం, బియ్యం ఎగుమతులపై ఆంక్షలు, విదేశాల్లో మొక్కజొన్నకు ధర తగ్గడం తదితర కారణాల వల్ల ఎగుమతుల్లో తగ్గుదల చోటు చేసుకుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ) కింద ఉన్న మాంసం, పాలు, పౌల్ట్రీ ఉత్పత్తులు, తాజా పండ్లు, కూరగాయల ఎగుమతులు పెరిగాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్రకారం.. గడిచిన తొలి త్రైమాసికంలో బియ్యం ఎగుమతులు స్వల్పంగా 0.46 శాతం తగ్గి 2.82 బిలియన్ డాలర్లు (రూ.23.600 కోట్లు)గా నమోదయ్యాయి.

బాస్మతి బియ్యంకు గ్లోబల్ డిమాండ్ ఉండటంతో 2024-25 ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో 13 శాతం పెరిగి 1.03 బిలియన్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై ఆంక్షల కారణంగా 13 శాతం 1.06 బిలియన్లు (రూ.8874 కోట్లు)గా నమోదయ్యాయి. గత సంవత్సరం, దేశీయ సరఫరాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం తెల్ల, బ్రోకెన్ రైస్ ఎగుమతులపై నిషేధం విధించింది. పార్బాయిల్డ్ రైస్‌పై 20 శాతం రవాణా సుంకాలను విధించింది. గత అక్టోబర్ నుంచి బాస్మతి బియ్యం ఎగుమతులపై కనీస ఎగుమతి ధరను టన్నుకు 950 డాలర్లు (రూ. 80వేలు)గా నిర్ణయించింది.

అంతర్జాతీయ ధరల కారణంగా మొక్కజొన్నతో సహా ఇతర తృణధాన్యాల ఎగుమతులు 76 శాతం తగ్గి 251 మిలియన్లకు పడిపోయాయి. వేరుశెనగ ఎగుమతులు 16 శాతం క్షీణించి 136 మిలియన్లుగా, పప్పు ధాన్యాలు 5 శాతం తగ్గి 143 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆరు నెలల తర్వాత తాము గత సంవత్సరం ఎగుమతులను అధిగమించగలుగుతామని వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రాజేష్ అగర్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇండియన్ ఆయిల్ మరో 'నయీ దిశ స్మైల్'

నవతెలంగాణ - హైదరాబాద్

ఖైదీలు, బాల నేరస్తులలో పరివర్తన ప్రయత్నంలో భాగంగా ఇండియన్ ఆయిల్ 'పరివర్తన్ - ప్రిజన్ టు ప్రైడ్' ఎనిమిదో దశను, 'నయీ దిశ - స్మైల్' ఐదో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ చైర్మెన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య మాట్లాడుతూ.. ఈ దశలో ఇండియన్ ఆయిల్ 22 జైళ్లు, జువైనల్ హోమ్‌లలో వెయ్యి మందికి పైగా వ్యక్తుల జీవితాలను స్పృశించనున్నామని తెలిపారు. ఈ రోల్ అవుట్‌తో ఇండియన్ ఆయిల్ 23 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలలో 15 మహిళా బాల్య కేంద్రాలతో సహా 150 సంస్థలలో 7300 మంది ఖైదీలు, బాల్య జీవితాల్లో స్పోర్ట్స్ కోచింగ్, పరికరాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ. 16,175 కోట్ల లాభాలు



ముంబయి : దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీ లాభాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 35 శాతం వృద్ధితో రూ.16,175 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం పెరగడంతో పాటుగా మొండి బాకీలకు కేటాయింపులు తగ్గడంతో అధిక లాభాలను ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,952 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 26.4 శాతం పెరిగి రూ.29,837 కోట్లకు చేరింది. మొండి బాకీల కోసం కేటాయింపులు 9 శాతం తగ్గి రూ.2,602 కోట్లుగా నమోదయ్యాయి. 2024 జూన్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 9 బేసిస్ పాయింట్లు తగ్గి 1.33 శాతంగా, నికర ఎన్‌పీఏలు 6 బేసిస్ పాయింట్లు తగ్గి 0.39 శాతంగా చోటుచేసుకున్నాయి. ఏడాదికేడాదితో పోల్చితే బ్యాంక్ రుణాల జారీలో 52.6 శాతం వృద్ధి, డిపాజిట్లలో 24.4 శాతం పెరుగుదల నమోదయ్యాయి.

మైక్రోసాఫ్ట్ దెబ్బకు.. ఇండిగోకు భారీ నష్టం

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్‌లో అంతరాయం చౌక ధరల విమానయాన సంస్థ ఇండిగోకు భారీ నష్టాలను మిగిల్చింది. శుక్రవారం ఒక్క రోజే దాదాపు 200 విమాన సేవలను రద్దు చేసింది. మైక్రోసాఫ్ట్ ఔటేజ్ ఎఫెక్ట్ ఒక్క అమెరికాలోనే కాకుండా ప్రపంచ దేశాలన్నింటిపైనా పడింది. ముఖ్యంగా విమానయాన సంస్థలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు దాదాపు రూ.5300 కోట్ల నష్టం వాటిల్లింది. శుక్రవారం ఇండిగో షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి.

ఫోల్డబుల్ ఫోన్లకు పెరుగుతున్న డిమాండ్

సామ్‌సంగ్ బిజినెస్ హెడ్ రోహ్

న్యూఢిల్లీ : భారత్‌లో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ పెరుగుతుందని సామ్‌సంగ్ మొబైల్ ఎక్స్‌పీరియన్స్ బిజినెస్ ప్రెసిడెంట్ టీఎం రోహ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లలో భారత్ ఒక్కటన్నారు. భారతదేశంలో విక్రయిస్తున్న దాదాపు 80శాతం స్మార్ట్‌ఫోన్‌లు రూ.30,000 కంటే తక్కువ ధరను కలిగి ఉన్నాయన్నారు. దేశంలో అత్యంత కీలకంగా గెలాక్సీ ఫోల్డబుల్స్ ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం మార్కెట్ డిమాండ్ పెరుగుతుందని ఆయన అంచనా వేశారు.

యెస్ బ్యాంక్ లాభాల్లో 47 శాతం వృద్ధి

ముంబయి : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ 2024-25 జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో 46.7 శాతం వృద్ధితో 502 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.343 కోట్ల లాభాలు నమోదు చేసింది. ముంబయి కేంద్రంగా పనిచేస్తోన్న ఈ బ్యాంక్ గడిచిన క్యూ1లో నికర వడ్డీ ఆదాయం 12.2 శాతం పెరిగి 2,244 కోట్లకు చేరింది. 2023-24 ఇదే క్యూ1లో రూ.2,000 కోట్ల ఎన్ఐఐ ప్రకటించింది. క్రితం క్యూ1లో బ్యాంక్ మొండి బాకీలకు కేటాయింపులు 41.2 శాతం తగ్గి రూ.212 కోట్లకు పరిమిత మయ్యాయి. ఏడాదికేడాదితో పోల్చితే అడ్వాన్సులు 14.7 శాతం పెరిగి రూ.2.29 లక్షల కోట్లకు చేరాయి. బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు 2 శాతం నుంచి 1.7 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏలు 1 శాతం నుంచి 0.5 శాతానికి దిగివచ్చాయి.

ఇసుజు ఐ-కేర్ మాన్‌సూన్ క్యాంప్

హైదరాబాద్ : ఇసుజు మోటర్స్ ఇండియా దేశవ్యాప్తంగా 'ఇసుజు ఐ-కేర్ మాన్‌సూన్ క్యాంప్'ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. దీన్ని ఇసుజు డి-మాక్స్ పికప్‌లు, ఎస్‌వియుల శ్రేణీ కోసం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్‌లలో జులై 22 -28 నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ కాలంలో వినియోగదారులు తమ వాహనాలకు ప్రత్యేక ఆఫర్‌లు, ప్రయోజనాలను పొందవచ్చని తెలిపింది.

రూ.334 కోట్ల రెవెన్యూ లక్ష్యం

ఇంటలెక్ట్ డిజైన్ వెల్లడి

న్యూఢిల్లీ : వచ్చే 2027 నాటికి 40 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.334 కోట్లు) రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇంటలెక్ట్ డిజైన్ ఎరీనా తెలిపింది. ఇంటలెక్ట్ డిజైన్ ఎరీన ప్రపంచంలోనే మల్టీ ప్రొడక్ట్ ఎంటర్‌ప్రైజెస్ ఫిన్‌టెక్ సంస్థ. తమ కొత్త వ్యాపారం ఐడీటీసీ వేదిక ద్వారా ఇమాచ్ ఏఐని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇది ఓపెన్ ఫైనాన్స్ ప్లాట్‌ఫామ్ అని తెలిపింది.

భారీ నుంచి అతి భారీ వర్షాలు

కొనసాగుతున్న వాయుగుండం | నదులు, వాగులకు పెరుగుతున్న వరద

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతున్నది. ప్రస్తుతం పూరీ తీరానికి వాయువ్యంగా 40 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమైంది. గోపాల్‌పూర్‌కు ఈశాన్యంగా 70 కి.మీ దూరంలో ఉంది. ఒడిశా నుంచి చిలక సరస్సుకు దగ్గరగా ఉన్న ఈ వాయుగుండం గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్టు రాష్ట్ర వాతావరణ శాఖ అంచనా. వాయువ్యంగా కొనసాగుతూ ఒడిశా-ఛత్తీస్‌గఢ్ మధ్య మరో 24 గంటల్లో తీరం దాటనుందని సమాచారం. ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా తీర ప్రాంతాల్లోని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఇలాగే వానలు



కురవనున్నాయి. వాయుగుండం ప్రభావంతో మంచిర్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని శనివారం వాతావరణ శాఖ తెలియజేసింది. ఎగువన పడుతున్న వానలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఇది ప్రస్తుతం 31.5 అడుగులకు చేరింది. మరోవైపు చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66,900 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. గద్వాల జిల్లా జురాల ప్రాజెక్టుకు వరద పెరుగుతున్నది. దీంతో అధికారులు ఐదు గేట్లు ఎత్తారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 70 వేలు, ఔట్ ఫ్లో 32,267 క్యూసెక్కులుగా ఉంది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా 1066 అడుగులకు చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టులోకి శనివారం భారీగా వరద నీరు వచ్చింది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌తోపాటు తెలంగాణలో కురిసిన భారీ వర్షాలకు ఈ జలాశయంలో వరద పోటెత్తింది. మరోవైపు, ప్రాజెక్టు ఎగువ చింతవాగు, రోటీంత వాగులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. దీంతో తాలిపేరులోకి వరద ప్రవాహం భారీగా పెరుగుతోంది. ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి దాదాపు 69 వేల క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. మరోపక్క పగిడివాగు ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరికి పరుగులు పెడుతోంది. భారీ వర్షంతో ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో కీకారణ్య గ్రామాల నుంచి రాకపోకలు నిలిచి పోయాయి. గత మూడ్రోజులుగా రామచంద్రాపురం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. తాలిపేరు ప్రాజెక్టులో వరద పరిస్థితిని స్థానిక సాగునీటి శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు సైతం ప్రాజెక్టును సందర్శించి లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితిని సమీక్షించారు. శనివారం ఆయా ప్రాజెక్టులు, రిజర్వాయర్లకు వరదనీరు చేరుకున్న వివరాలు కిందివిధంగా ఉన్నాయి.

కృష్ణా బేసిన్ రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు

ప్రాజెక్టు	నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీ)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీ)	వస్తున్న వరద (క్యూసెక్కులు)	వదులుతున్న నీరు (క్యూసెక్కులు)
ఆలమట్టి	129.72	101.48	79000	69000
నారాయణపూర్	37.64	34.04	100000	108860
జురాల	9.66	7.80	83000	86679
తుంగభద్ర	105.79	68.77	103787	2923
శ్రీశైలం	215.81	36.56	81160	0
నాగార్జునసాగర్	312.05	122.68	0	9874
పులిచింతల	45.77	0.77	443	50
గోదావరి బేసిన్				
సింగూరు	29.917	13.60	391	391
నిజాంసాగర్	17.800	3.10	0	0
శ్రీరాంసాగర్	90.300	18.29	15100	489
కడెం	7.600	5.33	8606	77
శ్రీపాద ఎల్లంపల్లి	20.170	5.79	5710	331
మేడిగడ్డ	16.170	-	373500	373500
సమ్మక్కసాగర్	6.940	-	482800	482800
సీతమ్మసాగర్	36.570	51.52(ఎం)	593167	593167
భద్రాచలం	లెవెల్	42.16 (ఎం)	408045	408045

రైతుల సమస్యలపై లోక్‌సభలో లేవనెత్తండి

- ఎంపీ ఈటలకు ఎస్కేఎం వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై లోక్‌సభలో లెవనెత్తాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర బృందం ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనకు ఎస్‌కేఎం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్లు తీగల సాగర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్ తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) సీ2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలను గ్యారంటీగా సేకరించాలని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలనీ, భూసేకరణ, పునరావాస చట్టం-2013ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో సమగ్ర రైతురుణ మాఫీ చేయాలని కోరారు. విద్యుత్ ప్రయివేటీకరణను ఆపాలనీ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దన్నారు. అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలన్నారు.

ఆరుగురు ఐఏఎస్‌ల బదిలీ

జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆరుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా, గృహనిర్మాణం, సాధారణ పరిపాలన శాఖ (స్మార్ట్ గవర్నెన్స్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్, సాధారణ పరిపాలన శాఖ (సర్వీసులు) ముఖ్య కార్యదర్శిగా బెనహర్ మహేష్ దత్ ఎక్కా నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఎ.శరత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొర్ర లక్ష్మి, విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శిగా ఎస్.హరీష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. హన్మకొండ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తాను మేడ్చల్ - మల్కాజిగిరి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా బదిలీ చేశారు.



ముగిసిన మాన్‌సూన్ రెగట్టా

సెయిలర్ గోవర్ధన్ ట్రిపుల్ ధమాకా

నవతెలంగాణ-హైదరాబాద్ : 15వ మాన్‌సూన్ రెగట్టా చాంపియన్‌షిప్ విజయవంతంగా ముగిసింది. పోటీల చివరి రోజు వర్షం చినుకుల నడుమ సెయిలర్లు హుస్సేన్‌సాగర్‌లో పోటీపడ్డారు. ఆరంభం నుంచి ఆధిక్యంలో కొనసాగిన తెలంగాణ సెయిలర్ గోవర్ధన్ పుల్లార, కొమరవెల్లి దీక్షితలు బాలుర, బాలికల విభాగంలో పతకాలు సాధించారు. అండర్-16 ఆప్టిమిస్ట్ బాలుర, బాలికల విభాగంలో గోవర్ధన్, దీక్షిత బంగారు పతకాలు దక్కించుకున్నారు. మాన్‌సూన్ రెగట్టా టైటిల్, అత్యంత నిలకడగా రాణించిన సెయిలర్‌గా ఎస్‌హెచ్ బాబు ట్రోఫీ సహా బాలుర విభాగంలో పసిడితో అరుదైన ట్రిపుల్ ధమాకా ఘనత సాధించాడు. బాలుర విభాగంలో ఆకాశ్ (మైసూర్), మహ్మద్ రిజ్వాన్ (తెలంగాణ) రజత, కాంస్య పతకాలు సాధించారు. బాలికల విభాగంలో శ్రేయ కృష్ణ (తమిళనాడు), షగున్ ఝా (మధ్యప్రదేశ్) సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందుకున్నారు.

హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఆ ఇద్దరు!

లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌కు చోటు



న్యూపోర్ట్ (యుఎస్ఏ) : అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఇద్దరు భారత దిగ్గజాలకు చోటు దక్కింది. యుఎస్ఏలోని న్యూపోర్ట్‌లోని ప్రపంచ టెన్నిస్ 'ది హాల్ ఆఫ్ ఫేమ్'లో లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌లు నిలిచారు. ఈ మేరకు హాల్ ఆఫ్ ఫేమ్‌లో తన ఫోటో వద్ద లియాండర్ పేస్ భావోద్వేగానికి లోనయ్యాడు. 1996 అట్లాంట ఒలింపిక్స్‌లో భారత్‌కు కాంస్య పతకం సాధించిన లియాండర్ పేస్.. గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనూ తనదైన ముద్ర వేశాడు. 'మా నాన్న 1972 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించటంతో.. ఆ ఘనత పునరావృతం చేద్దామనే లక్ష్యంతోనే టెన్నిస్ రాకెట్ పట్టాను. అట్లాంట ఒలింపిక్స్‌లో పతకం సాధించిప్పుడు నా తల్లిదండ్రులు అక్కడ ఉన్నారు. నా అభిమానులు, ప్రజలు నాకు గొప్ప మద్దతుగా నిలిచారు' అని లియాండర్ పేస్ అన్నాడు.



జెపీఎల్ జెర్సీ ఆవిష్కరణ

ముఖ్య అతిథులుగా వివేక్, జగన్

నవతెలంగాణ-హైదరాబాద్

కెఎస్‌జి జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జెపీఎల్) జెర్సీల ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి పది జట్లు, ఐదు రోజుల పాటు పోటీపడుతున్న టోర్నమెంట్ జెర్సీ ఆవిష్కరణ శనివారం సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగింది. చెన్నూరు ఎమ్మెల్యే, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జి. వివేక్ వెంకటస్వామి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, లైఫ్‌స్పాన్ స్పోర్ట్స్ చీఫ్ భరణి, కెఎస్‌జి సీఈవో సంజయ్, హెచ్‌సీఏ సభ్యులు సునీల్ అగర్వాల్, ఆగం రావు సహా స్మయిల్‌గార్డ్ ఫౌండర్ శరత్, జూపర్ ఎల్ఈడీ ఫౌండర్ రమేశ్ ముఖ్య అతిథులుగా హాజరై పది జట్ల జెర్సీలను ఆవిష్కరించారు. జెపీఎల్‌లో పోటీపడుతున్న పది జట్ల క్రీడాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 'పాత్రికేయులు నాకు కుటుంబ సభ్యుల వంటివారు. జర్నలిస్టులు క్రికెట్ టోర్నమెంట్‌లో పోటీపడటం అభినందనీయం.

మైదానంలో అడుగుపెడితేనే ఆటగాళ్ల కష్టాలు సైతం తెలుస్తాయి. ఆటగాళ్ల కోణంలో మెరుగైన కథనాలు రాయగలరు' అని వివేక్ వెంకటస్వామి అన్నారు. 'క్రీడా రంగం, క్రీడాకారుల అభివృద్ధికి నిత్యం పరితపించే పాత్రికేయులు క్రీడాకారులుగా మారిపోయి గ్రౌండ్‌లోకి దిగడం సంతోషం. జెపీఎల్‌లో పోటీపడుతున్న అన్ని జట్లకు అభినందనలు. క్రీడా స్ఫూర్తితో జెపీఎల్ టైటిల్ కోసం ఉత్తమ ప్రదర్శన చేయాలని' జగన్‌మోహన్ రావు అన్నారు.

చీఫ్ కోచ్‌గా మార్కెజ్

భారత ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయం



న్యూఢిల్లీ : హైదరాబాద్ ఎఫ్‌సీ మాజీ చీఫ్ కోచ్, గోవా ఎఫ్‌సీ హెడ్ కోచ్ మనోలో మార్కెజ్ భారత ఫుట్‌బాల్‌లో సరికొత్త సవాల్‌కు సిద్ధమయ్యాడు. ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్ నుంచి భారత్ నిష్క్రమించగా.. ఇగర్ స్టిమాక్‌పై భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) వేటు వేసిన సంగతి తెలిసిందే.

2023 నుంచి గోవా ఎఫ్‌సీ హెడ్ కోచ్‌గా పని చేస్తున్న మార్కెజ్.. 2025 వరకు గోవా ఎఫ్‌సీతో పాటు భారత జట్టు చీఫ్ కోచ్ బాధ్యతలు సైతం చూసుకోనున్నాడు. ఈ మేరకు ఏఐఎఫ్ఎఫ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇండియన్ సాకర్ లీగ్ (ఐఎస్ఎల్)లో మార్కెజ్‌కు మంచి పేరుంది. హైదరాబాద్ ఎఫ్‌సీతో కలిసి మూడు సీజన్లు పని చేసిన మార్కెజ్ దక్కన్ టైగర్స్‌కు తొలి టైటిల్ అందించాడు. యువ ఆటగాళ్లను ప్రోత్సహిస్తాడనే పేరున్న మార్కెజ్‌పై భారత ఫుట్‌బాల్ అభిమానులు భారీ అంచనాలతో ఉన్నారు.



కమిటీ కుర్రోళ్ళు రిలీజ్‌కి రెడీ

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు యదు వంశీ దర్శకుడు. పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మాతలు.

గ్రామీణ నేపథ్యంలో ఫ్రెండ్ షిప్, లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను రూపొందించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, లిరికల్ సాంగ్స్‌కు చాలా మంచి స్పందన వచ్చింది. మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఆగస్ట్‌లో వచ్చే ఫ్రెండ్ షిప్ డే వీక్ సందర్భంగా ఈ చిత్రం ఆగస్ట్ 9న విడుదలవుతుంది.

చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ, 'న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయాలనే ఆలోచనతో ఎక్కువ మంది కొత్త వాళ్లతోనే సినిమాను పూర్తి చేశాం. యదు వంశీ మంచి ప్లానింగ్‌తో సినిమాను అనుకున్న సమయంలోనే పూర్తి చేయటం విశేషం. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ అందరికీ నచ్చే సినిమాతో ఆగస్ట్ 9న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా విశేష ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

భూముల దానం నేపథ్యంలో

కంచర్ల



కంచర్ల ఉపేంద్ర బాబు, మీనాక్షి జైస్వాల్

ఎస్ఎస్ఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుత రావు ఒకేసారి ఎనిమిది సినిమాల నిర్మాణం చేపట్టడం తెలిసిందే. ఆయన కుమారుడు ఉపేంద్ర బాబు హీరోగా నటించిన తొలి చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా' మంచి విజయం సాధించింది. కంచర్ల ఉపేంద్ర బాబు హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కంచర్ల'. విశాఖ, అరకులో గల మడగడ వ్యూ పాయింట్ వద్ద జరిపిన చిత్రీకరణతో సినిమా పూర్తయ్యింది. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'మా ఇంటి పేరు 'కంచర్ల' టైటిల్‌తో ఈ సినిమాని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాం. ఈ సినిమాలో కూడా స్థానిక కళాకారులకు అవకాశం ఇచ్చాం. ఇందులో హీరో ఉపేంద్ర, హీరోయిన్లు మీనాక్షి, ప్రణతి అద్భుతంగా నటించారు. పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆర్ఆర్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగా వచ్చాయి. పిల్లల నుంచి పెద్దల వరకు చూసేలా మంచి కంటెంట్‌తో సినిమా నిర్మించాం. డైరెక్టర్ యాద్ కుమార్ ఈ సినిమాతో విమర్శకులకు గట్టిగా సమాధానం చెబుతారు. గుణశేఖర్ ఫోటోగ్రఫీ, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ, మధుబాబు కథ, మాటలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఆగస్టు 15 తరువాత సినిమా విడుదల చేస్తాం' అని తెలిపారు. 'అద్భుతమైన కథతో మా వంశం ఇంటి పేరు 'కంచర్ల' టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం గొప్ప విజయాన్ని అందుకుంటుంది' అని హీరో ఉపేంద్ర చెప్పారు.

హీరోయిన్ మీనాక్షి మాట్లాడుతూ, 'ఇందులో నా పాత్ర అందర్నీ అలరిస్తుంది' అని తెలిపారు. 'నా గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా మంచి సందేశం ఉంటుంది. నిర్మాత అచ్యుత రావు కుటుంబం భూముల దానం నేపథ్యంలో రాసుకున్న కథతో సినిమా తెరకెక్కించాం' అని డైరెక్టర్ యాద్ కుమార్ తెలిపారు.

నవచిత్రం

ఈతరం నరకాసురుడితో పోరాటం



నాని

హీరో నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' చిత్రానికి సంబంధించి ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్సెస్, సాంగ్స్, సినిమా నుండి వచ్చే ప్రతి అప్‌డేట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేస్తున్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా 'నాట్ ఏ టీజర్' అనే న్యూ వీడియోని మేకర్స్ శనివారం విడుదల చేశారు.

'చెడు బలపడినప్పుడు దాన్ని అంతచేసే పవర్ పడుతుందనే ఇంట్రెస్టింగ్ వాయిస్ ఓవర్‌తో వీడియో ప్రారంభమైంది. బలహీనులపై తన ఆధిపత్యాన్ని చూపించే రూత్ లెస్ కాప్‌గా ఎస్‌జె సూర్య పరిచయమయ్యారు. ఈ కథ నుంచి శ్రీకృష్ణుడు (నాని), సత్యభామ (ప్రియాంక మోహన్)తో కలిసి నరకాసురుడు (ఎస్‌జె సూర్య)ను ఎదుర్కోవడానికి వస్తున్నట్లుగా ప్రజెంట్ చేయడం క్యూరియాసిటీని పెంచింది. టేకాఫ్ నుండి చివరి వరకు వీడియో గ్రిప్పింగ్‌గా ఉంది. ఇద్దరు పవర్ ఫుల్ వ్యక్తుల మధ్య ఎపిక్ బ్యాటిల్‌గా ఉండబోతోందని ఈ వీడియో చెప్పకనే చెబుతోంది. ఎస్‌జె సూర్య భయం పుట్టించేలా కనిపించగా, నాని తన టెర్రిఫిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అద్భుతంగా ఉన్నారు. ఇద్దరూ తమ పవర్-ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్‌లతో అదరగొట్టారు. వివేక్ ఆత్రేయ స్టోరీ టెల్లింగ్‌లో యూనిక్ స్టయిల్ ఉన్న జీనియస్. ఈ టీజర్‌లో తన నెరేటివ్ స్టయిల్ ఆకట్టుకుంది. మురళి సినిమాటోగ్రఫీ అత్యద్భుతంగా ఉంది. విజువల్స్ గ్రాండియర్‌గా ఉన్నాయి. జేక్స్ బిజోయ్ తన ఇంటెన్స్ బ్యాగ్ గ్రౌండ్ స్కోర్‌తో విజువల్స్‌ని మరింత ఎలివేట్ చేశారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. ఆగస్ట్ 29న ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది' అని చిత్ర యూనిట్ తెలిపింది.

కమర్షియల్ పురుషోత్తముడు



రాజ్‌తరుణ్, హాసిని సుధీర్

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'పురుషోత్తముడు'. ఈ చిత్రాన్ని శ్రీ శ్రీదేవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై డా.రమేష్ తేజావత్, ప్రకాష్ తేజావత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో హాసిని సుధీర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు.

'ఆకతాయి', 'హమ్ తుమ్' చిత్రాల దర్శకుడు రామ్ భీమన ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రకాష్‌రాజ్, మురళి శర్మ, రమ్య కృష్ణ, బ్రహ్మానందం, ముకేష్ ఖన్నా వంటి స్టార్ కాస్టింగ్‌తో రూపొందిన ఈ సినిమా ఈ నెల 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. శనివారం చిత్ర ట్రైలర్‌ను చిత్ర యూనిట్ సమక్షంలో రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు రామ్ భీమన మాట్లాడుతూ, 'మా ట్రైలర్‌కు అతి తక్కువ టైమ్‌లో మంచి రెస్పాన్స్ వస్తోంది. మా సినిమాలో ప్రకాష్ రాజ్, మురళి శర్మ, రమ్య కృష్ణ, బ్రహ్మానందం వంటి స్టార్ కాస్టింగ్ ఉన్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్, యాక్షన్, మంచి మ్యూజిక్ వంటి అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులందరికీ నచ్చేలా ఈ సినిమా ఈ నెల 26న మీ ముందుకు రాబోతోంది. ఈ సినిమా థియేటర్స్‌లో ఒక పండగ లాంటి వాతావరణం తీసుకొస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

'మా ట్రైలర్ మీకు నచ్చిందనే ఆశిస్తున్నాను. అన్ని వర్గాల ఆడియెన్స్‌కు నచ్చేలా సినిమాను రూపొందించారు మా డైరెక్టర్ రామ్ భీమన. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది' అని నిర్మాతలు అన్నారు.

మా సినిమాకి రిపీట్ ఆడియెన్స్ వస్తున్నారు



క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత రాకేష్ వర్రే నిర్మించిన నూతన చిత్రం 'పేక మేడలు'.

వినోద్ కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది.

తెలుగులో ఈ సినిమాని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని రిలీజ్ చేశారు.

ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమా చూసే విధంగా రూ.100కే టికెట్లు రేట్లు ఉండడం ఈ సినిమాకి ప్లస్ అయ్యిందని అందరూ ప్రశంసించడం విశేషం.

ఈ సినిమాకి వస్తున్న సూపర్ రెస్పాన్స్ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ, 'సినిమా రిలీజ్ అయిన దగ్గర నుంచి 50 కాల్స్ పైన వచ్చాయి. చూసిన ప్రతి ఒక్కరు చాలా బాగుంది, మంచి ఎమోషనల్ సినిమా తీశారు అని ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా ఆడవాళ్ళ నుంచి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా మొదలు పెట్టినప్పటి నుంచి ఎంతో సపోర్ట్ చేసిన మా నిర్మాత రాకేష్‌కి కృతజ్ఞతలు. సినిమాని ఇంత సక్సెస్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు' అని అన్నారు.

'దాదాపు రెండేళ్లు ఈ సినిమా కోసం కష్టపడ్డాం. ఈరోజు ఈ సక్సెస్ చూస్తుంటే ఎమోషనల్‌గా ఉంది. ఈ సినిమా సక్సెస్‌తో నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. ఇంకా ఇలాంటి మంచి సినిమాలు తీయొచ్చు అనిపించింది. చిన్న సినిమాలకు జనాలు రారు అనేది తప్పు. మంచి సినిమా కంటెంట్ ఉన్న సినిమా తీస్తే కచ్చితంగా ప్రజలు థియేటర్లకు వస్తారు. అంతేకాదు మా సినిమాకి రిపీటెడ్ ఆడియెన్స్ వస్తున్నారనే రిపోర్ట్ రావడం చాలా ఆనందంగా ఉంది. మధ్య తరగతి కుటుంబాలు జీవితానికి, జీతానికి మధ్య ఎలాంటి సంఘర్షణ పడతాయో ఈ సినిమాలో చూపించిన తీరు బాగుందని అందరూ అభినందిస్తున్నారు. ముఖ్యంగా స్త్రీ సాధికారత విషయాన్ని బాగా ఎలివేట్ చేశారని ప్రశంసిస్తున్నారు. ఈ ప్రయాణంలో నాకు ఎంతో సపోర్టుగా నిలిచిన అనూష, కేతన్‌కి, ఇలాంటి సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు' అని నిర్మాత రాకేష్ వర్రే తెలిపారు.



ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్

రొటీన్ కథలకు భిన్నంగా.. కొత్తగా రూపొందే చిత్రాలకే ఈతరం ప్రేక్షకులు ఆదరణ చూపిస్తున్నారు. అలాంటి కథలతోనే దర్శక, నిర్మాతలు కూడా సినిమాలుగా తీసుకురావడానికి మొగ్గు చూపుతున్నారు. ఆ కోవలోనే న్యూ కంటెంట్‌తో రిఫ్రెషింగ్ ఫీల్‌తో రూపొందుతున్న చిత్రం 'ప్రణయగోదారి'. పి.ఎల్.విఘ్నేష్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో సాయికుమార్ తన ప్రత్యేక నటన శైలితో కనిపించబోతున్నారు. ఈ సినిమాలో హాస్య నటుడు అలీ కుటుంబానికి చెందిన నటుడు సదన్ హీరోగా నటిస్తున్నారు. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా, సునిల్ రావినూతల ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్ర గ్లింప్స్ చాలా బాగుంది. కంటెంట్ చూస్తుంటే తప్పనిసరిగా అందరికీ నచ్చుతుందనే నమ్మకం కలుగుతుంది. ఈ చిత్రంలో సాయికుమార్ డైలాగ్స్ అన్నీ చాలా ఆసక్తికరంగా, పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. ప్రేక్షకుల ఆదరణతో ఈ సినిమా చాలా మంచి సక్సెస్ అవ్వాలి' అని అన్నారు.

'రాజ్‌కందుకూరి చేతుల మీదుగా గ్లింప్స్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాల వారిని అలరించే అంశాలున్నాయి. ప్రేక్షకులకు డిఫరెంట్ అనుభూతిని కలిగించే కథతో ఈ సినిమా వస్తోంది. టైటిల్‌కి తగ్గట్టుగా నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరణ చేస్తున్నాం. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు చిత్రంలో కనిపిస్తాయి. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు మా చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత పారమళ్ళ లింగయ్య చెప్పారు.

గోసుల అరుణకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ జేఏసీ సభ్యురాలు గోసుల అరుణ యాదవ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తోంది. అరుణ తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నందుకు గాను రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ శనివారం హయత్ నగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం రాష్ట్ర అసోసియేషన్ తరపున రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు బత్తిని అంజి గౌడ్, సీతారాం నాయక్, వెంకట్ రెడ్డి ఎర్ర మహాలక్ష్మి, మాధగోని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు బాంధవుడు సీఎం రేవంత్'



నవతెలంగాణ-హయత్‌నగర్

రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అని బంజారా సేవ సమితి తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మెగావత్ గోవర్ధన్ నాయక్ అన్నారు. ఒకే సారి రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేసిన సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీని బంజారా భవనంలో గోవర్ధన్ నాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోత్ బాలు నాయక్, వర్త్య దాసు నాయక్, పాల్త్య సీతారాం నాయక్, రామాత్ మకట్లాల్ నాయక్, రెంటాల శ్రీరాములు, కొర్ర రవి నాయక్, రామావత్ సంతోష్ కుమార్, సభవత్ బుజ్జి నాయక్, రుదవత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

• సీఐ అశోక్ రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని వనస్థలిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ వారు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా గ్రీన్ ఇండియా, డ్రగ్స్ అండ్ సైబర్ క్రైమ్ అనే అంశాలపై అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. శ్రీ చైతన్య స్కూల్స్ ప్రిన్సిపల్ మంగళ గౌరీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు అంశాలపైన అవగాహన కల్పించినట్టు తెలిపారు. మత్తుపదార్థాల వాడకం వలన జీవితాన్ని కోల్పోతారని హెచ్చరించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నేడు మొబైల్ ఫోన్ల వాడకం ఎక్కువైందన్నారు. అపరిచిత వ్యక్తులు పంపించిన లింకులను ఓపెన్ చేయకుండా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. నేటి బాలలే బావి భారత పౌరులుగా మీరు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్ల వలన నేడు యువత చెడు మార్గంలోకి వెళు తుందని, దానిని అరికట్టాల్సిన బాధ్యత మన అందరీపైన ఉందన్నారు. అనంతరం మంగళ గౌరీ మాట్లాడుతూ విద్యార్థుల యొక్క బాధ్యత, కర్తవ్యాలను తెలియజేస్తూ.. ఇటువంటి సందర్భాలలో వాటిని ఎలా ఎదుర్కోవాలో అందులో విద్యార్థుల పాత్ర ఏమిటో వివరించారు. తర్వాత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులు, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆర్ ఐ వెంకట్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, జితేందర్, డి.మహేష్, ఇంచార్జి రమేష్, ఏఓ మల్లేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పాలనతో రాష్ట్ర అభివృద్ధికి కృషి

• మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజా పాలన పేరుతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మెన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డిలతో కలిసి మంత్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.38 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికారులు అలసత్వం వహించకుండా అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

చల్లా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ, ఉచిత 200 యూనిట్ల కరెంట్, రైతులకు రుణమాఫీ చేసినట్టు వివరించారు. 11 లక్షల రైతుల అకౌంట్లో రూ.6098 కోట్లు రుణమాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రుణమాఫీతో పాటు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థను కల్పించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, సీనియర్ రాష్ట్ర నాయకులు ఎల్మేటి అమరేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, కందుకూరు ఆర్‌డీఓ సూరజ్ కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవి, కమిషనర్ రఘు, నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ వి.ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పి.సుదర్శన్ రెడ్డి, కర్రే కృష్ణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అకాల వర్షానికి పొంగిపొర్లుతున్న డ్రయినేజీలు



• కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

అకాల వర్షానికి వనస్థలిపురం డివిజన్‌లో పలు కాలనీలలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని కార్పొరేటర్ రావుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ అభ్యుదయ కాలనీ కమాన్ వద్ద విజయవాడ హైవే రోడ్డు వేయడంతో సాంప్రదాయ ఫంక్షన్ హాల్ దగ్గర మూడు, నాలుగు ఫీట్ల నీళ్లు నిలవడంతో వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా ఎఫ్‌సిఐ కాలనీ, జాంగిర్ నగర్, వెంకటరమణ కాలనీ, క్రిస్టియన్స్ కాలనీ, గుంటి జంగయ్య కాలనీ తదితర కాలనీల్లో ఈ వర్షానికి డ్రైనేజీలు పొంగి రోడ్లపైన పొంగి పొర్లుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి.. వర్షాకాల దృష్ట్యా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రజ్ఞ, ఏఈ కార్తీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఆర్ ప్లానర్స్ ప్రారంభోత్సవంలో కేఎల్ఆర్, భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

కొత్తపేట లక్ష్మీ నగర్ కాలనీలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో పీడీఆర్ అసోసియేట్స్, పీడీఆర్ ప్లానర్స్ నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పీడీఆర్ ప్లానర్స్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పీడీఆర్ ప్లానర్స్ ద్వారా ఉత్తమ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు సుంకరి మల్లేష్ గౌడ్, నాయకులు బండ మధుసూదన్ రావు, గడ్డం లక్ష్మీనారాయణ, రవితేజ, జగన్నాథం, ధన్ రాజ్ గౌడ్, గోపాల్ రెడ్డి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహాలో విద్యా బోధన ఉండాలి



• ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

నవతెలంగాణ- మలక్‌పేట్ / సంతోష్‌నగర్

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ తరహాలో విద్యా బోధన ఉండాలని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. చంచల్‌గూడలోని డిగ్రీ కళాశాల, మాలక్‌పేట్‌లోని బాలికల జూనియర్ కళాశాలల్లో శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి మంచి ఫలితాలను తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని అధ్యాపకులకు సూచించారు. తరగతి గదిలో వసతులు సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఇంటర్మీడియట్ కమిషనర్ ఐఎఎస్ శృతి ఓజ, జాయింట్ డైరెక్టర్, డీఇఒ, డివైఇఒఎస్, ఎంఐఎం మలక్ పేట్ కార్పొరేటర్, కళాశాల ప్రధాన అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బలాల శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాబాద్ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ భవనం, పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పలు కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.



గురు పౌర్ణమికి స్పెషల్ బస్సులు

హయత్ నగర్-2 డిపో మేనేజర్ శ్రీనివాస రావు

నవతెలంగాణ- హయత్‌నగర్



గురుపౌర్ణమి సందర్భంగా నేడు సికింద్రాబాద్ నుండి సాయి బృందావనం (దేశ్ ముఖి)వరకు 290యూ/463 రూట్లో స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు హయత్ నగర్ -2 డిపో మేనేజర్ యస్.శ్రీనివాస రావు తెలిపారు. భక్తులు ఈ స్పెషల్ బస్సులను వినియోగించుకొని శ్రీ సాయినాథుడిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రీయ వానరసేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌కు చెందిన కోట వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రీయ వానరసేన జాతీయ అధ్యక్షులు నామ్ రామ్ రెడ్డి చేతుల మీదుగా శనివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భూ కబ్జాలకు గురవుతున్న ఆలయ భూముల పరిరక్షణకు, హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. అనంతరం తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

నవతెలంగాణ- నాగోల్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. శనివారం నాగోలు డివిజన్లోని శుభం కన్వెన్షన్ హాల్లో మార్బుల్, గ్రానైట్ వ్యాపారస్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూర్ణిమ ప్రసాద పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, తమ తమ మొబైల్ ఫోన్లలో గుర్తింపు లేని యాప్లను డౌన్లోడ్ చేసుకోకూడదన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి పెడదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తల్లీదండ్రులు కూడా పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ ఎస్హెచ్ఓ సుధీర్ కృష్ణ, ఎస్సై శివ నాగ ప్రసాద్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

నవతెలంగాణ- అబ్దుల్లాపూర్‌మెట్



వ్యవసాయ రంగ సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ఇబ్రహీంపట్నం బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిహెచ్ భాస్కరాచారి అన్నారు. శనివారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. దేశ చరిత్రలోనే రైతు రుణమాఫీ చరిత్ర పుటల్లో లిఖించాల్సిన విషయమని, ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పార్టీ నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దారుణంగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రైతులకు రుణమాఫీ చేసి, వారికి వెన్నెముకగా నిలిచారని అభిప్రాయపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అలాగే అభివృద్ధి ప్రదాత, ప్రజా సంక్షేమ సారథి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నేతృత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సామాన్యులకు
అందుబాటులో యూనివర్సిటీ విద్యా విధానం



• అడ్మిషన్స్ డైరెక్టర్ సచిన్ జైన్

నవతెలంగాణ - చైతన్యపురి

భారతీయ నూతన ఇంజనీరింగ్ విద్యారంగంలో సమూహ మార్పులను అందిపుచ్చుకుని సామాన్యులకు సైతం ఆధునాతన ఇంజనీరింగ్ విద్యను అందించే లక్ష్యంతో లాట్రిన్ టెక్ స్కిల్స్ యూనివర్సిటీ పంజాబ్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని లాట్రిన్ టెక్ స్కిల్స్ యూనివర్సిటీ పంజాబ్ అడ్మిషన్స్ డైరెక్టర్ సచిన్ జైన్ పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలో ఓ కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులకు, విద్యార్థుల తల్లీదండ్రులకు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల ఆధ్వర్యంలో ట్రిన్ టెక్ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన పంజాబ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అడ్మిషన్స్ ఇంచార్జి శ్రీనివాసరావు ఏలూరి అధ్యక్షతన స్కిల్స్ డెవలప్మెంట్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లాట్రిన్ టెక్ సెల్స్ యూనివర్సిటీ వంజాబ్ అకాడమిడ్ డీన్ ధామీలతో కలిసి అడ్మిషన్స్ డైరెక్టర్ సచిన్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో భారతీయ విద్యారంగంలో వస్తున్నటువంటి మార్పులకు అనుగుణంగా యూనివర్సిటీలో విద్యతోపాటు స్కిల్స్ డెవలప్మెంట్ ప్రత్యేక ప్రోగ్రాంను ప్రవేశపెట్టడంతోపాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగేండ్ల కాలంలో విద్య పూర్తయ్యే సమయానికి నూటికి నూరు శాతం ఉద్యోగ భద్రత కల్పించడం యూనివర్సిటీ బాధ్యత అని అన్నారు. విద్యార్థులకు సరైనటువంటి స్కిల్స్ లేకపోవడంతో ఉన్నత చదువులు చదివినప్పటికీ నిరుద్యోగులుగా మిగిలిపోతున్న పరిస్థితులను అధిగమించడానికి లాట్రిన్ టెక్ స్కిల్స్ యూనివర్సిటీ పంజాబ్ నూతన విద్యా విధానానికి నాంది పలికిందన్నారు. అడ్మిషన్స్, కౌన్సిలింగ్ వివరాల కోసం చైతన్యపురి శ్రీచైతన్య టెక్నో స్కూల్స్ భవన కార్యాలయంలో సెల్ 8070617061లో సంప్రదించాలని యూనివర్సిటీ ప్రతినిధులు సూచించారు.

డిక్లరేషన్
అమలు చేయాలని మంత్రికి విజ్ఞప్తి

నవతెలంగాణ-హయత్‌నగర్



రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శనివారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నరేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌ను తెలంగాణలో అమలు చేయాలని మంత్రిని కోరారు. గత ప్రభుత్వం ఒంటెద్దు పోకడ విధానాల వలన బీసీలు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యాన్ని భారీగా నష్టపోయారని గుర్తుచేశారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో నగిరి ప్రవీణ్ కుమార్ పటేల్, ఓయూ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎర్ర శ్రీహరి గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరగాని భిక్షపతి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి బీసీ సంక్షేమ సంఘం పెంట అజయ్ పటేల్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు సాయి కిరణ్, శ్రీనాథ్, నిమ్మల శ్రీనివాస్, కాటం రాజు యాదవ్, ప్రశాంత్, రాజేష్, బీసీ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : కమిషనర్ వాణిరెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరీపై ఉందని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 16వ వార్డులో చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది, కౌన్సిలర్ బుదుమాల యాదగిరితో కలసి వన మహోత్సవంలో భాగంగా కమిషనర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ వాణిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మంగా చేపట్టిన వన మహోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కాలుష్య నియంత్రణకు మొక్కలు ఎంతో అవసరమని, విధిగా ప్రతి ఒక్కరూ తమ తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ. సుదర్శన్, ఏఈ అయేషా, కాలనీ వాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న యువకుడి రిమాండ్



నవతెలంగాణ-బోడుప్పల్

నిషేధిత మాదక ద్రవ్యాలను తరలిస్తున్న యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు అనుమానస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నిషేధిత హెరాయిన్ డ్రగ్స్ 10 గ్రాములు దొరికింది. దీంతో అతడి వివరాలను సేకరించగా దినేష్ బిష్నోయ్ (27) బోడుప్పల్ గాయత్రి నగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎన్డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువకులు మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు. అలా వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయిని వాడినా, సరఫరా చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించా లని కార్పొరేటర్ బన్నాల గీత ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని బీరప్ప గడ్డ ప్రాంతంలో సీసీ రోడ్డు, గుట్టపై ఓపెన్ జిమ్, ప్రతి పార్కులో ఓపెన్ జిమ్, చిన్నపిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. బ్యాంక్ కాలనీ పార్కుకు ప్రహరీ గోడ, గేటును ఏర్పాటు చేయాలని, బీరప్ప గడ్డ ఏడు మోట్ల బావి, చిల్కానగర్ లోని బావిని శుభ్రపరచి చుట్టుపక్కల ప్రాంతాన్ని సుందరీకరణ చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ దశల వారీగా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



- మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తున్నదని మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో పాలకవర్గంతో కలిసి పలు అభివృద్ధి పనుల కోసం తీర్మానం చేశారు. 20 వార్డుల్లో అభివృద్ధి పనులకుగాను రూ.3 కోట్ల70 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, ఇతర పనులకు తీర్మానం చేశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్, వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్‌లోని ఓల్డ్ మల్లాపూర్‌లో జీహెచ్ఎంసీ ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఓల్డ్ మల్లాపూర్‌లోని వివిధ బస్తీల్లో సీసీ రోడ్లు, కౌండిన్య భవన్‌లో పెండింగ్ పనులు, మోడ్రన్ దోబీఘాట్, సంజయ్ పార్కులో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరగా వివిధ పనులకు నిధులు మంజూరు చేస్తానని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని పన్నాల దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఈఈ హరిలాల్, డీఈ రవీందర్, ఏఈ శ్రవంతి, ఇతర విభాగాల అధికారులు, స్థానికులు పైళ్ల ప్రవీణ్, తండా వాసుగౌడ్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

జీఆర్‌రెడ్డి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని జీఆర్‌రెడ్డి నగర్‌లో పద్మసాయి డెంటల్ క్లినిక్ దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్‌రావు నగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపును క్లబ్ చార్టర్ మెంబర్ లయన్ పీజే.రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు పేద ప్రజల కాలనీల్లో ఎక్కువగా చేపడుతున్నామని తెలిపారు. క్యాంపులో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం కళ్ల పరీక్షలు, పద్మాసాయి డెంటల్ క్లినిక్ డాక్టర్ దినేష్ బృందం దంత పరీక్షలు, సన్‌సీడ్ హాస్పిటల్ డాక్టర్ అన్వేష్ బృందం జనరల్ పరీక్షలు, చైతన్య హాస్పిటల్ డాక్టర్లు గైనిక్ పరీక్షలు, హీల్ టచ్ ఫిసియో డాక్టర్లు ఫిసియో థెరపీ పరీక్షలు, సమీక్షా డయాగ్నొస్టిక్ బీపీ, షుగర్ పరీక్షలతో పాటు 'సియన్ క్యాన్సర్ స్క్రీనింగ్ ' మహిళలకు కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. కళ్లకు కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తున్నారు. క్యాంపులో 119 మంది పాల్గొని అన్ని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, కార్యదర్శి చనమోలు వరప్రసాద్, సభ్యులు సురేష్, సునీల్, విజయకుమార్, డాక్టర్ అన్వేష్, కాలనీ కార్యదర్శి జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

చర్లపల్లిలోని పార్కులపై కార్పొరేటర్ సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని వివిధ కాలనీల్లోని పార్కుల నిర్వహణపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూబీడీ మేనేజర్ లోకేష్, సూపర్వైజర్ నరేష్‌తో కార్పొరేటర్ మాట్లాడారు. కాలనీల్లోని వివిధ అసోసియేషన్ వారు మెంటైన్ చేసే పార్కులు ఐదు, జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ మెంటైన్ చేసే పార్కులు రెండు, ట్రీ పార్కులు ఐదు మించి ఉన్నందున్న వాటిని వివిధ కాలనీల్లోని పార్కు అసోసియేషన్ వారితో మెయిన్‌టెన్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడానికి, పార్కుల క్లీనింగ్ కోసం సిబ్బందిని పెంచాలన్నారు. పార్కులల్లో మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. రైతుల కు రుణమాఫీ చేయడానికి హర్షిస్తూ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. అనంత రం పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రూ.28వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పిన సీఎం మాట నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, నాయకులు అంజిరెడ్డి, సీతారాం రెడ్డి, కృష్ణారెడ్డి, ఉమేష్ గౌడ్, పోచయ్య, గడ్డం యాదగిరి, నాచారం, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, కాప్రా, చర్లపల్లి డివిజన్ల అధ్యక్షులు నాగేషు, అంజయ్య, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, సాయి గౌడ్, నాగిళ్ల బాల్ రెడ్డి, ప్రభు, అనిల్, రాజు, మహేష్, కిషోర్, రాజేష్, రాజు,శ్రవణ్, సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. -నవతెలంగాణ, కాప్రా



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి





- జిల్లా కలెక్టర్ గౌతమ్
- ప్రజా పాలన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ
- కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు

నవతెలంగాణ-మేడ్చల్

ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదైన దరఖాస్తులను పరిశీలించారు. ప్రజా పాలనలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అధికారులు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డేటా విభాగంలో ఎప్పటికప్పుడు ఎంట్రీ చేయాలని సూచించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు అందిస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి (గ్యాస్) పథకం విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో పొరపాట్లను సరి చేసుకునేందుకు ప్రజాపాలన సేవా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల (బాలికల) సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలో పిల్లలకు ఉపాధ్యాయులు చదువు ఎలా చెపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. నోట్ బుక్స్, టెక్స్ బుక్స్ పిల్లలకు అందయ అని అడిగారు. పిల్లలకు మధ్యాహ్నం భోజనం నాణ్యతతో అందిస్తున్నార అని ఆరాతీశారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత మన బాధ్యతగా పిల్లలను చదివించాలన్నారు. పిల్లలు మంచిగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని పిల్లలకు, తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దిలీప్ కుమార్, తహశీల్దార్ శైలజ, డీఈవో విజయ కుమారి, ఎంఈవో వసంత కుమారి, ఎంపీడీవో వసంత లక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐను సందర్శించిన కలెక్టర్

- స్కిల్ డెవలప్‌మెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐని శనివారం జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఐటీఐలోని కోపా, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మోటార్ మెకానిక్, టర్నర్, వెల్డర్ ట్రేడ్‌ల్లో ట్రెనింగ్, ఐటీఐలో చేపట్టిన పలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు పూర్వపు ప్రిన్సిపాల్ డి.శైలజ వివరించారు. వివిధ ట్రేడ్లలోని ట్రైనీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోని ఉపాధి అవకాశాల గురించి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో అప్రెంటిస్ షిప్ కన్వీనర్‌గా మేడ్చల్ ఐటీఐ వ్యవహరిస్తుందని, ప్రతి ఏడాది 1800మందికి పైగా ట్రైనీలు అప్రెంటిస్ షిప్ పూర్తి చేసుకుంటున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ప్రావీణ్య స్కిల్ డెవలప్‌మెంట్ వారు నిర్వహించిన స్కిల్స్ కాంపిటేషన్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను కలెక్టర్ ప్రశంసించారు. ఐటీఐలో నూతనంగా ప్రారంభిస్తున్న సేవింగ్ టెక్నాలజీ (టైలరింగ్), ఫుడ్ టెక్నాలజీ ట్రేడ్ పట్ల కలెక్టర్ ఆసక్తి వ్యక్తం చేశారు. మహిళ సాధికారతకు మేడ్చల్ ఐటీఐ కృషిని కలెక్టర్ అభినందించారు. ఐటీఐలోని ఫ్రూట్, వెజిటేబుల్ ప్రాసెసింగ్ యూనిట్ల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఔత్సాహిక మహిళలకు ఈ ఇంకుబేటర్ సమర్థత ఇస్తుందని ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమా నాయక్, పూర్వపు ప్రిన్సిపాల్ డి.శైలజ, ఎమ్మార్వో శైలజ, ఎంప్లాయిమెంట్ అధికారి నిర్మల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో అక్షరాభ్యాసం



నవతెలంగాణ-కాప్రా

అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా నాచారం డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, మేడ్చల్ జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి హాజరై అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండున్నరేండ్ల చిన్నారుల నుంచి ఐదేండ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రీస్కూల్ ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి, మేడ్చల్ డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, అల్వాల్ సీడీపీవో స్వాతి, సూపర్వైజర్ వెంకటరమణ, స్కూల్ టీచర్స్, స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, ముత్యంరెడ్డి, సంజన్న చంద్రశేఖర్, ఆదిలక్ష్మి, రాజబాబు, అంగన్వాడీ టీచర్స్ బీ. స్వాతి, మాధవి, రమ, శశికళ, పూలమ్మ ఆశా వర్కర్స్, తదితరులున్నారు.

శ్రీ లక్ష్మీ కళామందిర్ థియోటర్‌లో తనిఖీ



నవతెలంగాణ-కాప్రా

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశానుసారం అల్వాల్ సర్కిల్లోని శ్రీలక్ష్మీ కళామందిర్ థియేటర్‌ను అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు శనివారం తనిఖీ చేశారు. ప్రేక్షకులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని థియేటర్ యాజమాన్యానికి సూచించారు. పార్కింగ్ బోర్డు ఏర్పాటు, ఫుడ్ స్టాల్స్, ఫైర్ సేఫ్టీ, బిల్డింగ్ పర్మిషన్, ప్రాపర్టీ టాక్స్, ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సాంబయ్య, ఏఎంసీ నరసింహారెడ్డి, సూపరింటెండెంట్ స్వామి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్, టీపీఓ రాజేందర్ గౌడ్, ఎస్.ఎస్. ప్రభాకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన స్కూలు బస్సు

- విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-జవహర్ నగర్

స్కూల్ పిల్లలతో వెళ్తున్న బస్సుకు తృటిలో ప్రమాదం తప్పిన ఘటన జవహర్ నగర్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ సమీపంలో స్వామి నారాయణ గురుకుల పాఠశాలకు చెందిన బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించబోయి చెట్టును ఢీకొట్టగా విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులను సమీపంలోని హాస్పిటల్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించగా ప్రమాదమేమీ లేదని తెలిపారు. దీంతో స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన బొల్లి భాగ్యమ్మకు మంజూరైన రూ.27వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వారి నివాసంలో లబ్దిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా 17వ వార్డు యువ నాయకుడు సందీప్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి,ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందీప్ గౌడ్,మహేష్ యాదవ్, నాగేష్ ,పృథ్వీ పాల్గొన్నారు.

వాగులో గల్లంతైన యువకుడు మృతి



నవతెలంగాణ-మేడ్చల్

వాగులో చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు గల్లంతై మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పూడూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గ్రామ పరిధిలోని వాగులో చేపలు పట్టడానికి వెళ్లిన ఎర్రోళ్ల సంతోష్ (29) గల్లంతైన విషయం తెలిసిందే. కాగా శనివారం ఉదయం 8.30గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన మత్స్యకారులు తెప్పల సహాయంతో గాలింపు చేపట్టి ఎర్రోళ్ల సంతోష్ మృతదేహాన్ని వెలికి తీశారు. సమాచారం అందుకున్న ఎస్సై లావణ్య గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : శామీర్‌పేట సీఐ

నవ తెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

ఎవరైనా మద్యం అక్రమ రవాణా చేసినా, బెల్టు షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శామీర్ పేట సీఐ శ్రీనాథ్ హెచ్చరించారు. శనివారం ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ మాధవయ్య ఆధ్వర్యంలో శామీర్‌పేట ఎస్సైలు, పోలీస్ సిబ్బంది కలిసి పలు చోట్ల సోదాలు నిర్వహించారు. 2024 జులై20వరకు 63 ఎక్సైజ్ కేసులు నమోదు కాగా 690 లీటర్ల మద్యం పట్టుకున్నట్టు సీఐ తెలిపారు.

ప్రణాళిక బద్ధంగా డివిజన్ అభివృద్ధి

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌ను ప్రణాళిక బద్ధంగా, దశల వారీగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. శనివారం డివిజన్‌లోని ఇంద్రానగర్(కల్యాణ పురి) కాలనీలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయిస్తూ దశలవారీగా సీవరేజ్ లైన్‌లు, మంచినీటి పైప్ లైన్‌లు, సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీలను, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, కాలనీ అధ్యక్షులు ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, రామచంద్ర రెడ్డి, సంజీవ, బాలయ్య, రఫీ, ఆంజనేయులు, చిన్న, సూరి, సన్నీ, శ్రీకాంత్, తదితరులున్నారు.

'సఫాయి అప్నావో.. బీమారి భగావో'



నవతెలంగాణ-బోడుప్పల్

పరిశుభ్రమైన, వ్యాధి రహిత వాతావరణాన్ని కలిగి ఉండటానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో "సఫాయి అప్నావో, బిమారీ భగావో' కార్యక్రమాన్ని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) ఫేజ్-2లో భాగంగా వర్షాకాలంలో మెరుగైన పారిశుధ్యం, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మన ఇంటితో పాటు మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. తద్వారా సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ఉంటాయన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలపై పకడ్బందీ చర్యలు చేపట్టాలని, డ్రయినేజీ, నాలాలతో పాటు చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మురళి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, రమణరెడ్డి, కైసర్, వెంకన్న, అనిల్, విఠల్, దుర్గయ్య, యూసఫ్ అలీ, రామకృష్ణ రావు, పారిజాత, శ్యామ్ రావు , వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

- మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ - జవహర్ నగర్

అకాల వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నివసిం చే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించా రు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కార్పొరేషన్ ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు మాన్సూన్ బృందాలను అప్రమత్తం చేశారని, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు వర్షంలో బయటకు వెళ్లరాదని సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

ఉప్పల్‌లో భారీ వర్షం.. రోడ్లు గుంతలమయం





- తీవ్ర ఇబ్బంద్దులో వాహనదారులు
- పాలకులు పట్టించుకోరు.. అధికారులు స్పందించారు

నవ తెలంగాణ -ఉప్పల్

ఉప్పల్‌లో వాహనదారులకు తిప్పలు తప్పవు అనే చందంగా తయారయ్యింది. నగరంలో కురుసిన వర్షానికి



ఉప్పల్ ప్రధాన రహదారి రోడ్లు మొత్తం గుంతలుగా ఏర్పడి, వాహనదారులకు నడ్డి విరిగేలా, పెద్ద, పెద్ద గుంతలుగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రోడ్లన్నీ గుంతలుగా మారినా పాలకులు పట్టించుకోవడం లేదని, అధికారుల స్పందిస్త లేరని ప్రజలు వాపోతున్నారు. ఉప్పల్ ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, తీవ్ర ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల సతమతమవుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారారే తప్ప ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారయింది. ఎలివేటెడ్ కారిడార్ పేరుతో పనులు జాప్యం జరుగుతున్నా ప్రభుత్వాల స్పందించకపోవడంతో ఉప్పల్‌లో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



ఏపీ రాష్ట్ర హౌసింగ్, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి యాదవ్‌ని తెలంగాణ రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్, సమాజ్ వాది పార్టీ రాష్ట్ర నాయకులు బొట్టా మధు యాదవ్ సన్మానించారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

పచ్చి కూరగాయలతో తినుబండారాల పోటీ



నవతెలంగాణ-కల్చరల్

బర్గర్‌లు పిజ్జాలకు అలవాటు పడుతున్న నేటి బాల బాలికలు యువతకు వాటి కన్నా పచ్చి కూరగాయలలో ఉన్న పోషక విలువలు పై అవగాహన కల్పించే ఉద్దేశంతో లిటిల్ గ్రామర్ హై స్కూల్ యాజమాన్యం పిల్లలకు రా ఫుడ్ కాంపిటీషన్ నిర్వహించారు. సుమారు వంద మంది పైగా అన్ని తరగతు లు పిల్లలు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు.పాఠ్య పుస్తకాలలో చదువుతో పాటు సజనాత్మకతను పెంపు చేసేందుకు తరచూ ఇట్టి భిన్న పోటీలు నిర్వహిస్తున్నమని ప్రిన్సిపాల్స్ గంధం చంద్ర శేఖర్, అనురాధ తెలిపారు.

చెట్లు నాటితేనే భావితరాలకు భరోసా



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- ఎస్.పి.ఆర్.గ్లోబల్ పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పచ్చని చెట్లు నాటడమంటే భావితరాలకు మంచి భరోసా ఇవ్వడమేనని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని చిత్తారమ్మ దేవినగర్‌లో గల ఎస్.పి.ఆర్ గ్లోబల్ హైస్కూల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పాఠశాల స్కూల్ చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ, చెట్లను పెంచడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం భాద్యతగా తీసుకోవాలని వాటి సంరక్షణ కూడా అంతే బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు రషీద్ బేగ్, లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

- కార్మికులుగా గుర్తించాలి
- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి
- రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రేవతి కళ్యాణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి రేవతి కళ్యాణి, కోశాధికారి సీహెచ్ జయప్రద పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది 15 రోజులు ఆశా వర్కర్లు ధర్నా చేస్తే ఆనాటి హెల్త్ డైరెక్టర్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి కొన్ని నిర్దిష్టమైన హామీలిచ్చారని గుర్తు చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామనీ, ఈ కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని తెలిపారు. ఈ కమిటీ ఆశాల డిమాండ్స్ అన్నింటినీ పరిగణలోకి తీసుకుంటుందనీ, యూనియన్ ప్రతినిధులతో ముఖాముఖి చర్చలు కూడా జరుపుతుందనీ, అన్ని అంశాలు అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఆశా వర్కర్ల సమస్యలపై నివేదికను అందజేస్తామని తెలిపినట్టు చెప్పారు. వీటితోపాటు పెండింగ్ పీఆర్సీ ఏరియర్స్, కరోనా రిస్క్ అలవెన్స్ ఇచ్చే విధంగా చూస్తామనీ, సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామనీ, ఇతర పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తామని హామీనిచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన ఆరోగ్యశాఖ కమిషనర్ ఆఫీస్ ఎదుట జరిగిన ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామనీ, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామనీ, రిజిస్టర్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని నిర్దిష్టమైన హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ అంశాల్లో ఒక్క సమ్మెకాలం వేతనాలు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందనీ, ఇతర సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు ఆరోగ్య శాఖామంత్రి, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులకు అనేక విజ్ఞప్తులు చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆందోళనా-పోరాటాలు నిర్వహించినా సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్ఓకు మెమొరాండం సైతం ఇచ్చినట్టు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఆషాడ మాస బోనాల ఉత్సవాలకు సంబంధించిన చెక్కులను శనివారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణలతో పాటు శ్రీవారి ఆలయ చైర్మెన్ వేణు యాదవ్, ఈవో కృష్ణమాచార్యులుతో కలిసి నియోజకవర్గంలోని 106 అమ్మవార్ల దేవాలయాల కమిటీల నిర్వాహకులకు రూ.29,48,000 చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు ఐకమత్యంతో జరుపుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ మాట్లాడుతూ బోనాల ఉత్సవాలకు అమ్మవార్ల ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు రేగూరి ప్రవీణ్ గుప్తా, గుజ్జుల పాపిరెడ్డి, పి.సమ్మయ్య యాదవ్, ఈ.వెంకటేష్, బండ అనిత మహేందర్, డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్, నాయకులు కూరపాటి కరుణాకర్ రాజు, ఎస్.కృష్ణమూర్తి గుప్తా, కే.నరేందర్ రెడ్డి, వి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జలమయమైన రోడ్డు..
ఇబ్బందులు పడుతున్న వాహన దారులు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రోడ్డు నిర్మాణం సమయంలో వరద నీరు రోడ్డు పై నిలవకుండా ప్రణాళికతో రోడ్డు వేస్తే ప్రజలు ఇబ్బంది పడేవారు కాదని అధికారులపై స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. కూకట్‌పల్లి మైత్రినగర్ నుంచి జగద్గిరి గుట్ట వెళ్ళే మార్గంలో హై టెన్షన్ రోడ్డు పాపారాయుడు నగర్ రోడ్డు, గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా జలమయ్యాయి. రోడ్డు కనపడకుండా ఎక్కడ గుంతలు ఉన్నాయో.. ఎక్కడ రాళ్ళున్నాయో అర్థం కాక వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు మాట్లాడుతూ.. రోడ్డు వేసే ప్రతిసారి ప్రజాప్రతినిధులు నాణ్యతా లోపం లేకుండా రోడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్లకు చెప్పినప్పటికీ, పక్కా ప్రణాళికలు లేకుండా రోడ్డు వేసి ప్రజల్ని సమస్యలకు గురి చేస్తున్నారని అన్నారు. వరద నీరు పారడంతో.. రోడ్డు పూర్తిగా గుంతలు పడిపోయి పాడైపోయింది. దాంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. గత ఏడాది నుంచి ఈ సమస్య అలాగే ఉందని వాహన దారులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలోనే, రోడ్డుపై నీరు నిలవకుండా పక్కా ప్రణాళికతో రోడ్డు నిర్మాణం చేపట్టి ఉంటే ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదని, ఇదంతా అధికారుల అలసత్వం వల్లనే ప్రజలు సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని స్థానికులు తెలిపారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలి



- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరేందర్ గౌడ్

నవతెలంగాణ-బంజారా హిల్స్

బంజారా హిల్స్‌లోని తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, బీసీ ప్రతినిధుల బృందం మంత్రిని ఆయన నివాసంలో కలిసి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలని కోరారు. గత ప్రభుత్వం ఒంటెద్దు పోకడల విధానాల వలన బీసీలు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యాన్ని భారీగా నష్టపోయారని మంత్రికి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మ్యానిఫెస్టోలో బీసీల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ అభీష్టం మేరకు.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగనణ జరిపించి బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్స్ సివిల్స్ కన్స్ట్రక్షన్‌లో, మెంటేనేన్స్‌లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో దేశం గర్వించదగ్గ సీనియర్ బీసీ నాయకులు కర్నాటక ముఖ్యమంత్రి సిద్దారమయ్య చేతులమీదుగా విడుదల చేసి కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేనికలిసి పలు వినతులు, ఆహ్వానాలు అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులను చేపడతామన్నారు.

శ్రీ పోచమ్మ తల్లి బోనాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం..

కూకట్‌పల్లి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారికి నిర్వహించే బోనాలు మరియు ఫలహార బండి ఊరే ఊరేగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని ఆహ్వానిస్తూ... శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు టింకు గౌడ్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అభిలాష్, శ్రవణ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

- ఎమ్మెల్యేలు కృష్ణారావు, అరికెపుడి గాంధీలను కలసిన సీఐటీయూ



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి,శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులకు శనివారం ఆశా వర్కర్లు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సీఐటీయూ మహిళా సమాఖ్య లీడర్‌లను గుర్తించాలని మహిళ సమాఖ్య లీడర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఆఫీసులకు, పొదుపు సంఘాలకు 20సం॥లుగా పని చేస్తున్న మహిళా సమాఖ్య లీడర్‌లకు ఎలాంటి వేతనం లేకుండా వెట్టిచాకిరి చేపించుకుంటున్నరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి, మహిళా సమాఖ్య లీడర్‌లను గుర్తించి వారికి గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలు వేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య లీడర్లు, గణిత, సంతోషి, సరస్వతి, లావణ్య, స్వరూప, మధులత, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై లైంగికదాడులు అరికట్టాలంటే కుల సంఘాలన్నీ ఐక్యతతో ఉండాలి



- ప్రొఫెసర్ కాశీం

నవతెలంగాణ-ముషీరాబాద్

ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను నిలువరించాలంటే కుల సంఘాలన్నీ ఐక్యతతో ఉండి పోరాడాలని ప్రొఫెసర్ కాశీం అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంతర్గత వైరుధ్యాలతో విడిపోయిన బహుజన కులాలను ఐక్యం చేయడమే బహుజన వాదం అనే పేరుతో కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట మృతవీరులకు సంస్మరణ సభ జరిగింది. బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షుడు పల్లెల్ల వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్ కాశీం, రిటైర్డ్ ఐఆర్‌టి అప్పికట్ల భరత్ భూషణ్, ఎస్సీ, ఎస్టీ మేధావుల ఫోరం జాతీయ నాయకుడు డాక్టర్.ఆరెపల్లి రాజేందర్, జి.శంకర్, మహేష్ రాజు, ప్రొఫెసర్ సతా నేయులు, బహుజన సాహిత్య అకాడమీ చైర్మెన్ నల్లా రాధాక్రిష్ణ, ఎమ్మార్పిఎస్ రాష్ట్ర నాయకుడు గండి క్రిష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కమ్మవారు 1985 జూలై17వ తేదీన కారంచేడు మాదిగలపై దాడిచేసి 8 మందిని చంపారన్నారు. 1991 ఆగస్టు 6న కాంగ్రెస్ పార్టీ అధికారంలో రెడ్లు, చుండూరులో 10 మంది మాల, మాదిగలను చంపారని గుర్తు చేశారు. 2021 జూన్ 12వ తేదీన కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో లక్ష్మీపేటలో 8 మంది మాలలను తూర్పు కాపులు చంపారని తెలిపారు. అదే విధంగా తెరాస అధికారంలో మధుకర్‌ను పుట్టా మధు హత్య చేశారన్నారు. అది మరవక ముందే నేరెళ్ళ గ్రామము ఇసుక దొంగ తనని అడ్డుకున్నందున తెరాస ప్రభుత్వం ఇద్దరు మాదిగ యువకులను పాశవికంగా పోలీసులతో దాడి చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. 74 సంవత్సరంలో ఇప్పటికి ఇంకా ఎస్సీ, ఎస్టీల పై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కానీ కుల సంఘాలు కొన్ని పార్టీల కొమ్ముకాస్తూ మన ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు. ఇప్పటికైనా మనమధ్య ఉన్న చిన్న చిన్న వైరుధ్యాలను తొలగించుకొని ఐక్యతతో ఉండి ఈ హత్యలు, అత్యాచారాలు వ్యక్తులపై నిలువరించాలన్నారు.

రాష్ట్ర సాధనలో ప్రయివేటు పాఠశాలల పాత్ర కీలకం



- ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు, ఉద్యమకారులు శివరాత్రి యాదగిరి
- జేఏసీ చైర్మెన్ కోదండరాంకు సమస్యలు వివరించిన ఉద్యమకారులు, ప్రయివేట్ పాఠశాలల ప్రతినిధులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రయివేట్ పాఠశాలల పాత్ర ఎంతో కీలకంగా ఉందని ట్రస్మా రాష్ట్ర నిర్వాహక అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట జేఏసీ చైర్మెన్ శివరాత్రి యాదగిరి అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో జేఏసీ చైర్మెన్, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోదండరాంను కలిసి ప్రయివేట్ పాఠశాలలు, ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎన్నో ఎదుర్కొని, ప్రస్తుతం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని శివరాత్రి యాదగిరితోపాటు పలువురు ఉద్యమకారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల సమస్యలతో పాటు ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని సాధ్యమైనంత వరకు ఉద్యమకారులకు న్యాయం జరిగే విధంగా తన వంతు కృషి చేస్తానని వారికి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేటివ్ అధ్యక్షులు పల్లె వినయ్ కుమార్, ట్రస్మా రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బాలరాజు, మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కోశాధికారి పరుశురాం గౌడ్, బాచుపల్లి మండల్ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, దుండిగల్ గండి మైసమ్మ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ కోశాధికారి అంబదాస్ ఉద్యమకారులు ఎండి.గౌసుద్దీన్, రవీందర్ గుప్తా, గుమ్మడి మధుసూదన్ రావు, పాల్గొన్నారు.

బోయినపల్లి మార్కెట్ యార్డు చైర్మెన్ పదవిపై ఉత్కంఠ..!



నవతెలంగాణ-బాలానగర్

నగరవాసులకు కాయగూరలు అందిస్తున్న బాలానగర్ మండలంలోని బోయినపల్లి మార్కెట్ యార్డు చైర్మెన్ పదవిపై ఉత్కంఠ నెలకొంది. తెలంగాణ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు కాయగూరలు తెచ్చి నేరుగా విక్రయించే సౌలభ్యం ఉన్న ఈ మార్కెట్ యార్డు చైర్మెన్ పదవి ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో ఆశావాహులు ఆ పదవిని దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పదవి కోసం మైనంపల్లి హనుమంత రావు అనుచరుడైన ఆనంద్ బాబుతోపాటు కాంగ్రెస్ నేత డి.యాదగిరి, బల్వంతరెడ్డి, కూకట్ పల్లి నుండి పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగేందర్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం... సీఎం రేవంత్ రెడ్డి గతంలో మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందడంలో కీలకంగా పనిచేసిన యుగేందర్ రెడ్డికే చైర్మెన్ పదవి దక్కే అవకాశాలు అధికంగా ఉన్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. రేవంత్ రెడ్డితో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగిన యుగేందర్ రెడ్డికి లైన్ క్లియర్ అయినట్లు సమాచారం.. 26 ఎకరాల్లో ఉన్న మార్కెట్ యార్డ్ కు మొట్టమొదటి చైర్మెన్‌గా ముఠా గోపాల్, తర్వాత బిఆర్ఎస్ నేత నరేందర్ గౌడ్ చైర్మెన్‌గా పని చేశారు. తదనంతరం సిహెచ్ శ్రీనివాస్, రాగిడి రాధిక మార్కెట్ చైర్మన్‌గా వ్యవహరించారు. మొత్తం ఐదుగురు నేతలు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించగా.. అందులో నలుగురు కంటోన్మెంట్ ప్రాంతం నుంచి కాగా, కేవలం ఒక్కరే కూకట్ పల్లికి చెందినవారు ఉన్నారు. ఇద్దరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా మిగతా ముగ్గురు బీసీ సామాజిక వర్గం నేతలు చైర్మన్ గా సేవలందించారు. మొదట్లో చైర్మన్ పదవికాలం మూడు సంవత్సరాలుగా ఉండగా తర్వాత దాన్ని రెండు సంవత్సరాలకు కుదించారు. ఇప్పటివరకు నాలుగుసార్లు కంటోన్మెంట్ ప్రాంతం వారికి ఇవ్వగా.. ఈసారి ఖచ్చితంగా కూకట్ పల్లి నేతకే చైర్మన్ పదవి ఇవ్వాలని కార్యకర్తలు గట్టి పట్టుదలతో ఉన్నారు. పదేళ్ల అధికారానికి దూరం కావడంతో యుగేందర్ రెడ్డి వంటి సీనియర్ నేతలు కార్యకర్తల్లో మనోస్థైర్యాన్ని నింపి, పార్టీని కాపాడారని పలువురు నాయకులు తెలిపారు. మార్కెట్ చైర్మెన్ పదవిని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన సీనియర్ నేతల్లో ఎవరికి ఇచ్చినా సమంజసంగా ఉంటుందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

రెడ్డి జాగృతి విస్తృతస్థాయి సమావేశం



- రెండోసారి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన రెడ్డి జాగృతి విస్తృత స్థాయి సమావేశంలో, రెడ్డిలలోని పేద రెడ్ల అభివృద్ధి, పలు అంశాలపై చర్చించారు. అదేవిధంగా రెడ్డి జాగృతి రాష్ట్ర స్థాయి, జిల్లాల అధ్యక్షులను, వివిధ కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టేముగారి మాధవ రెడ్డి, కొట్టం మధుసూదన్ రెడ్డి సమక్షంలో.. తెలంగాణ రాష్ట్ర రెడ్డి జాగృతి అధ్యక్షులు ఎడ్ల ఉప్పల్ రెడ్డి ఆధ్వర్యంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షునిగా, రెండవసారి చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డిని నియమించారు. ఆయన చేసిన సేవలను గుర్తించి రెండవసారి అధ్యక్షునిగా ఎన్నుకుని నియామక పత్రాన్ని నిర్వాహకు అందజేసామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. మరోసారి రెడ్డి జాగృతి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రెడ్డీల సంక్షేమం, అభివృద్ధి కోసం నా శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో రెండోసారి పదవి బాధ్యతలు అప్పగించినందుకు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెడ్డిలలో వుండే ప్రతీ పేద రెడ్ల కోసం అహర్నిశలు పాటుపడతానని పేర్కొన్నారు.

బీజేపీ కార్యవర్గ సభ్యుల సమావేశం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

భారతీయ జనతా పార్టీ, రంగారెడ్డి జిల్లా (అర్బన్) కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి అధ్యక్షతన క్రిస్టల్ గార్డెన్, చందానగర్‌లో ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు ఆయనను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ తీర్మానం, మహిళా తీర్మానం, పునాది పడని ఇందిరమ్మ ఇండ్లు, జీహెచ్ఎంసీ సమస్యలపై రేషన్ కార్డుల సమస్యలపై పలు తీర్మానాలు బలపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవి కుమార్ యాదవ్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, నరేష్, నరేందర్ రెడ్డి, కన్వీనర్ రాఘవేంద్ర రావు, కో కన్వీనర్ మణిభూషణ్, బీజేపీ సెక్రటరీ చెన్నమనేని స్రవంతి, నవత తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (కేబినెట్ ర్యాంక్) బాధ్యతలు స్వీకరించిన కేశవరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ఈ నెల 28న అంబర్‌పేట మహంకాళి బోనాల జాతర వేడుకలకు రావాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డికి అంబర్‌పేట మహంకాళి ఆలయ కమిటీ ఆహ్వాన పత్రికను అందజేసింది. చీఫ్ అడ్వైజర్, కె దుర్గ ప్రసాద్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, అధ్యక్షులు శంకర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు గడ్డం లక్ష్మణ్ గౌడ్, రంగంపల్లి రాజు, మల్లికార్జున్ గౌడ్, గడ్డం శ్రీధర్, చెంగలి సుధాకర్, కిషోర్ కుమార్కిషోర్ కుమార్, పంజాల వెంకటేష్ గౌడ్, సునీల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ, అంబర్‌పేట్

గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనలకు అందేలా చూడాలని రవీందర్ నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ నాయక్ అన్నారు. తెలంగాణ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా డాక్టర్ తెజావత్ బెల్లయ్య నాయక్‌కు బాధ్యత చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా బంజారా వెల్ఫేర్ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన బంజారా జాతి అభివృద్ధి కోసం అనేక రకాలు పోరాటం చేసిన గిరిజన ముద్దు బిడ్డ తేజవాత్ బెల్లయ్య నాయక్ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీను, రాజేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వ్యాప్తంగా వర్షం



- ఎడతెరిపి లేకుండా జల్లు
- వాహనదారులకు ఇబ్బందులు
- పలు చోట్ల ట్రాఫిక్ జామ్
- రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో శనివారం సాయంత్రం నుంచి ముసురు కంటిన్యూ అవుతోంది. ఆగకుండా కురుస్తున్న వర్షంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఉదయం ఆఫీసులకు సాయంత్రం ఇండ్లకు వచ్చే సమయాల్లో నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లోనూ శనివారం సాయంత్రం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

ఆయా ప్రాంతాల్లో వర్షం ఇలా..

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎడతెరపిలేకుండా వాన కురుస్తున్నది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, ఉప్పల్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, ఎస్‌ఆర్ నగర్, ఈసీఐఎల్ తార్నాకలో ఉదయం నుంచి వర్షం కురుస్తున్నది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

గ్రేటర్ అంతటా వర్షం..

గ్రేటర్ హైదరాబాద్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచే మోస్తరు వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పిల్లలు పాఠశాలలకు, ఉద్యోగస్తులు కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పలు కంపెనీలు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం ప్రకటించాయి. మరోవైపు జీహెచ్ఎంసీ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా వాటర్ లాంగిగ్ లేకుండా చూసుకుంటున్నారు. ఉప్పల్ సర్కిల్‌లోని వరంగల్ హైవేపై ఆదిత్య హాస్పిటల్ వద్ద నీటి మాన్‌సూన్ బృందం క్లియర్ చేసింది. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, ముషిరాబాద్, అంబర్‌పేట, సికింద్రాబాద్, మెహిదీపట్నంలో తేలికపాటి వర్షం కురిసింది. మాసబ్ ట్యాంక్, నాంపల్లి, గోషమహాల్, బేగంపేట, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కంటోన్మెంట్‌లోనూ వాన పడుతోంది.

హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్..

హైదరాబాద్‌కు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సాయంత్రం ఉద్యోగులు అందరూ ఒకేసారి బయల్దేరకుండా, ముందు, వెనుక, బయల్దేరితే ట్రాఫిక్ కష్టాలు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాల నేపథ్యంలో నగరంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ సజావుగా జరగాలనీ, దీనిపై ఆయా అధికారులు దృష్టి సారించి పర్యవేక్షించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)గా రాధికాగుప్తా



రాధికాగుప్తా

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)గా రాధికాగుప్త నియమితుల య్యారు. ఆ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. వీరు ఇప్పటి వరకు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేశారు. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పని చేసిన అభిషేక్ అగస్త్య గత నెల 24వ తేదీన ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి లోకల్ బాడీ అదనపు బాధ్యతలు చూస్తున్నారు.

ప్రతి కంపెనీకీ ప్రధాన మూలం హెచ్‌ఆర్ రంగం



- స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి కంపెనీకి ప్రధాన మూలం హెచ్‌ఆర్ వ్యవస్థ అనీ, నిరంతరం వారు పని ఒత్తిడితో బిజీ జీవితం గడుపుతారని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు. అవార్డుల కార్యక్రమాలు హెచ్‌ఆర్‌లలో మరింత ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంటుందనీ, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలనీ, వారిలో ఉన్నతికి సహకరించినప్పుడే ఏ కంపెనీ అయినా మరింత ముందుకు సాగుతుందని అభిప్రాయపడ్డారు. హెచ్‌ఆర్ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఐకాన్ (ఇంటర్నేషనల్ నాలెడ్జ్ అండ్ ఆపర్చునిటీస్ నెట్‌వర్క్) నిర్వహించిన 'ఐ లవ్ హెచ్‌ఆర్ అవార్డ్స్ కాన్క్లేవ్ అండ్ ఎక్స్‌పోలో ప్రతిష్టాత్మక అవార్డులు అందజేశారు. శనివారం హైటెక్ సిటీలోని ఇస్తా కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మానవ వనరుల రంగంలో ప్రతిభగల వారిని జయేష్ రంజన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐకాన్ వ్యవస్థాపకుడు అండ్ ప్రెసిడెంట్ క్రిష్ చింతలూరి మాట్లాడుతూ తమ సంస్థ లక్ష్యం 'ఐ లవ్ హెచ్‌ఆర్‌లో, నేర్చుకోవడం, సహకారం, ఆవిష్కరణల కోసం డైనమిక్ ప్లాట్‌ఫారమ్‌ను అందించడం ద్వారా హెచ్‌ఆర్ నిపుణులు, సంస్థలకు సాధికారత కల్పించడం అన్నారు. మేం హెచ్‌ఆర్ ఎక్సలెన్స్‌ను జరుపుకునే, ఉత్తమ అభ్యాసాలను ప్రోత్సహించే, నిరంతర ప్రొఫెషనల్‌కి మద్దతు ఇచ్చే కమ్యూనిటీని ప్రోత్సహించడానికి అంకితభావంతో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బిజినెస్ మోహిత్ ఫ్రూట్‌వాలా, వర్క్‌రూట్ అండ్ డీటీబీ వెంకట్ బూరా, సీఈఓ, ప్రిన్సిపుల్ హెచ్‌ఆర్‌బీ పాల్ ఎడ్వర్డ్ జి.అసిస్టెంట్ డైరెక్టర్ అండ్, అసిస్టెంట్ ఇంటర్న్‌షిప్ అడ్వైజర్, బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్, హైదరాబాద్ డివిజన్, ఉన్నత విద్యాశాఖ, విద్యా మంత్రిత్వశాఖ, పీఆర్‌కే నాగరాజు, వ్యవస్థాపకుడు అండ్ సీఈఓ, పీఎస్‌ఆర్ అసోసియేట్స్ ప్రయివేటు లిమిటెడ్, సిద్ధార్థ్, సీఈఓ, బ్రెయిన్‌కోడ్ పాల్గొన్నారు.

పని భారం ఎక్కువ.. వేతనాలు తక్కువ

- ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శివబాబు, కార్యదర్శి రాములు

నవతెలంగాణ - జవహర్‌నగర్

పని భారం ఎక్కువ వేతనాలు తక్కువ అని తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శివ బాబు, ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. శనివారం జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులైన వాటర్ మెన్, ఎలక్ట్రీషియన్, స్వీపర్, కామాటి, సానిటేషన్ సూపర్వైజర్, అటెండర్స్ తదితరులు నాలుగో తరగతి ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. జీవో నెంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా రూ.19500 వేతనం ఇవ్వాలని, ఎంత సీనియారిటీ ఉన్నా అందరికీ ఒకే రకమైన జీతం ఇస్తున్నారని వాపోయారు. దినదిన అభివృద్ధి చెందుతున్న జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని భారం మరింత పెరిగిందని తద్వారా బస్తీ అవసరాలకు తగ్గట్టు కార్మికులు లేరని ఎక్కువ మంది కార్మికులు పనిచేసే పని భారాన్ని తామే మోస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 400 పైచిలుకు ఉండాల్సిన కార్మికులు కేవలం 123 మందిని మాత్రమే పని చేస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. పని భారం ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు పెరిగిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తమ బాధలను అర్థం చేసుకోవాలన్నారు.

పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసుల దాడి

- దమ్మాయిగూడకు చెందిన 11 మంది అరెస్ట్

నవతెలంగాణ-జవహర్ నగర్

గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్వోటి పోలీసులు, జవహర్ నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని ద్వారకాపురి నందు పేకాట ఆడుతున్న పండాల యాదగిరి, వెంకటరామిరెడ్డి, నరసింహ, కమ్మ సురేష్, రవీంద్ర, ఉదయగిరి మస్తాన్, దాసరి చెన్నకేశవ, ఎడవల్లి నరసింహ, శ్రీనివాస్, చిట్టి బొమ్మ సాంబశివరావు, ఆర్. నరసింహలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.1.50 లక్షల నగదు, 11 సెల్ ఫోన్‌లు సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారు

- 2 లక్షల ఉద్యోగాలు ఏక కాలంలో ఇస్తామన్నారు
- ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి : కేంద్రమంతి కిషన్ రెడ్డి

నవతెలంగాణ ముషీరాబాద్



రేవంత్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని, రెండు లక్షల ఉద్యోగాలు ఏక కాలంలో ఇస్తామని చెప్పిన మాట ఏమైందని, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిరుద్యోగ మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నిరుద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. లక్షలాదిమంది యువకులు చదువు వదిలేసి తెలంగాణ కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రమొస్తే ఉద్యోగాలు వస్తాయని పోరాటాలు, ఆత్మ బలిదానాలు చేశారని చెప్పారు. కేసీఆర్ కుటుంబం యువతకు వెన్నుపోటు పొడిచిందన్నారు. అదేదారిలో రేవంత్ వెళ్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చారని మండిపడ్డారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అసలు రూపం బయటపడిందన్నారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలు దొందు దొందే అన్నారు. ఈ మహా ధర్నా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, నాయకులు రాంచందర్ రావు, రాణిరుద్రమ, విజయలక్ష్మి తదితర యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న సాహితీ పురస్కారం ప్రదానం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

శాంతా-వసంతా ట్రస్టు 2024సంవత్సరానికి గాను సాహితీ పురస్కారాలను శనివారం ప్రకటించింది. ప్రముఖ రచయిత, కాలమిస్ట్ ఎంఎస్ ప్రసాద్‌కు డాక్టర్ వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం, ప్రముఖ అన్నమయ్య సాహితీ పరిశోధకులు గంధం బసవ శంకరరావుకు కోడూరు వేంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారానికి ఎంపిక చేసినట్టు ట్రస్టు కార్యదర్శి టి. నవీన్ వెల్లడించారు. ఆబిడ్స్ తిలక్రోడ్డులో గల తెలంగాణ సారస్వత పరిషత్తు హాలులో ఆగస్టు 3న సాయంత్రం 6గంటలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పురస్కార గ్రహీతలను సత్కరించనునున్నట్లు ఆయన పేర్కొన్నారు.

21న సీపీఐ(ఎం) జన చైతన్య పాదయాత్ర



- సీపీఐ(ఎం) గోషామహల్ కన్వీనర్ పి.నాగేశ్వర్

నవతెలంగాణ - ధూల్‌పేట్

మూసీ పరీవాహక అభివద్ధి పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి గోషామహల్, బేగంబజార్ డివిజన్లలోని మూసీ పరిసర బస్తీల్లో ఈ నెల 21 న ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే సీపీఐ(ఎం) జన చైతన్య పాద యాత్రను విజయవంతం చేయాలని పార్టీ గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం విలేకరులతో ఆయన. మాట్లాడుతూ... సామాజిక ఆర్థిక సర్వే పేరుతో ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలో 28 వేల ఇండ్లను గుర్తించినట్టు అధికారికలెక్కలు చెప్తున్నాయన్నారు. ఇది ఏమైనా అభివద్ధి అనేది పేదల ఆదాయం పెంచేదిగా ఉండాలే కాని, రూపాయ రూపాయ కూడబెట్టి కొనుక్కున్న ఇండ్లను, జాగాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటా నంటే సహించేదిలేదన్నారు. పేదలను చైతన్యపరిచే పోరాట రూపకల్పనకు సీపీఐ(ఎం) కషిచేయనున్నదని దానిలో బాగంగా పార్టీ రాష్ట్ర నాయకులు ఎం డి అబ్బాస్, హైదరబాద్ సౌత్ జిల్లా నాయకులు విఠల్, ఎం.బాలు, సత్తార్ ,శశికళ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ పాదయాత్ర లో ప్రజలు ,ప్రజాసంఘాల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ కమిటి సభ్యులు కే.జంగయ్య, ఎం.డి. అయూబ్, పి.కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించని హొటల్ సీజ్



నవతెలంగాణ-హైదరాబాద్

నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని తుంకుంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక హొటల్ నిర్వాహకులను హెచ్చరించారు. శనివారం తూంకుంట పురపాలక సంఘం కేంద్రంలో రాజీవ్ రహదారిపై ఉన్న కృష్ణ హొటల్లో బిర్యానిలో బొద్దింక వచ్చిందని తూంకుంట పురపాలక సంఘానికి బి శ్రీనివాస్ రెడ్డి అనే వినియోగ దారుడు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా మున్సిపల్ శానిట రీ ఇన్‌స్పెక్టర్ రేణుక శానిటేషన్ విభాగం వారితో కలిసి తనిఖీ చేశారు. హొటల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా పాటించట్లేదని గుర్తించారు. వెంటనే హొటల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా శానిటరి ఇన్‌స్పెక్టర్ రేణుక మాట్లాడుతూ హొటల్ లో నాణ్యత ప్రమాణాలు పాటించట్లేదని గుర్తించిన ఆహార పదార్థాలను సీజ్ కూడా చేశామని చెప్పారు. రానున్న రోజులలో మున్సిపల్ పరిధిలోని హొటల్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు శ్రీమతి ప్రసన్న, మౌనిక, బిల్ కలెక్టర్ మన్నె కిష్టయ్య, జవాన్లు నరేష్, ప్రవీణ్ రెడ్డి, జగన్నాథం , సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక బోనాలు



- ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగని ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ కరస్పాండెంట్ పులి గారి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్లో బోనాల పండుగ పురస్కరించుకొని విద్యార్థులచే పోతరాజులు డప్పు చప్పుళ్ళు అమ్మవారి వేషధరణలో బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థులకు బోనాల పండుగ సంబంధించి విశేషాలను తెలుసుకునే విధంగా వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ. తెలంగాణలో ప్రతి వీధిలో బోనాల పండుగ అత్యంత ఘనంగా నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు మన పండగల విశిష్టత తెలియజేయాలని ప్రతి పండుగనూ పాఠశాలలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మన ప్రాచీన సాంస్కతి ప్రతి ఒక్క విద్యార్థికీ తెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి



- ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్
- ఘనంగా ఐవీఎఫ్ 11 వ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ - ముషీరాబాద్

ఆర్యవైశ్యుల అభివద్ధికి నిరంతరం కషి చేస్తామని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు.ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 11 వ వార్షికోత్సవ వేడుకలు ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధిగస్తులకు రక్తదానం చేసిన వివిధ జిల్లాల నుంచి వచ్చిన 100 మందిని ఘనంగా డాక్టర్ ఎస్ బాలు ఆధ్వర్యంలో సన్మానించరు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్య వైశ్యుల అభివద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ. దేశ వ్యాప్తంగా ఉన్న వైశ్యులను ఏకం చేయడమే ఐవీఎఫ్ ప్రధాన లక్ష్యం అని రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ లను పేద ఆర్య వైశ్యుల అందేలా కషి చేస్తానని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు మాట తప్పడం జరగదు అని అన్నారు. వారి అభివద్ధికి నిరంతరం కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంజి రాజమౌళి గుప్త, కటకం శ్రీనివాస్ సరస్వతి టెంపుల్ వర్గల్ చైర్మెన్ చంద్ర శేఖర్ సిద్ధాంతి , ఐవీఎఫ్ రాష్ట్ర నాయకులు పబ్బా చంద్రశేఖర్ , కొడిపాక నారాయణ ముత్యాల సత్య కటా రవి మహిళ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, మంజుల, శ్రీకాంత్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

23న బాలానంద సంఘం ఆరో దశాబ్ది వేడుకలు..

నవతెలంగాణ-కల్చరల్

23 వ తేదీన రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై జాంబాగ్ బాలానంద సంఘం ఆరో దశాబ్ది వేడుకలు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు మద్దిపట్ల వెంకట భాస్కర్ పత్రికా విలేకరులకు తెలిపారు. ఉదయం బాల బాలికలకు శాస్త్రీయ మిళిత నత్యాలు ఏక పత్రాభినయం,నాటక పోటీలు నిర్వహిస్తారు. తదుపరి బాలానంద సభ్యులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. సాయంత్రం సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొని మద్దిపట్ల వెంకట రావు స్మారక పురస్కారం ప్రముఖ సినీ నటుడు అశోక్ కుమార్‌కు బహుకరిస్తారు.. కిన్నెర సంస్థ స్థాపకులు మద్దాలి రఘురాం బాల సాహిత్య రచయిత చొక్కాపు రమణ అతిథులుగా పాల్గొంటారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

నవతెలంగాణ-వనస్థలిపురం



ఎల్బీనగర్ రింగ్ రోడ్డులో రోడ్డు నిర్మాణం చేపట్టగా ఇప్పుడు కురుస్తున్న వర్షానికి మొత్తం రోడ్డు నీటి కుంటలాగా ఏర్పడింది. వాహన దారులు నానా ఇబ్బంది పడుతున్నారని, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి ఇరువైపుల బ్రిడ్జి మధ్యలో ఉన్న రోడ్డుని సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేస్తున్నారు.

డ్రగ్స్ మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం

- భావితరాలకు బాటలు వేద్దాం
- గోపాల్ పురం సీఐ శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి మార్గంలో, మంచి అలవాట్లతో భావితరాలకు బాటిల్ వేద్దాం అని గోపాల్ పురం సీఐ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రమాదకరమైన డ్రగ్సు పదార్థాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. 'డ్రగ్స్‌ను నిర్మూలి ద్దాం - సమాజాన్ని మేలుకొలుపుదాం' అనే అంశంపై ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో రెజిమెంటల్ బజార్ సెట్ బన్వర్ లాల్ ప్రభుత్వ హైస్కూల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి, కుటుంబ సభ్యులకు దూరమై మత్తులోనే తన జీవితాన్ని గడుపుతున్న అభాగ్యులు ఉన్నారన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసై బంగారు లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మంచి మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఇంట్లో తల్లి దండ్రులు వారి పిల్లలు స్కూలుకు గాని కాలేజీ గాని వెళ్ళినప్పుడు వాళ్ల ప్రవర్తన మీద దష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆహ్వాన సంఘం సలహాదారులు ఎస్ శివకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ తన జీవితంలో ఉన్నతమైన స్థితికి వెళ్లడానికి గోల్ ఉండాలన్నారు. ఆ గోల్‌ను రీచ్ కావడానికి మంచి మార్గంలో పయనించాలని సూచించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు చాక్లెట్ల రూపంలో గానీ ఏ రూపంలో పదార్థాలు ఇచ్చిన తీసుకోవద్దు అని సూచించారు. స్కూల్ హెచ్ఎం రమణ మాట్లాడుతూ డ్రగ్స్ కోసం, దొంగతనాలు చేయడం దోపిడీలు చేయడం, ఎలాంటి పనులకైనా సిద్ధపడేటట్టుగా అది మనిషిని తయారు చేస్తుందన్నారు. ప్రజానాట్య మండలి నగర సహాయ కార్యదర్శి పి సునీత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న, ప్రజానాట్యమండలి నగర ఉపాధ్యక్షులు ఎండీ వసీం వద్దిన్, స్కూల్ టీచర్స్ సరళ దేవి, చంద్రకళ, యశోద, రానా కుమారి, పాల్గొన్నారు.

అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు



- వాటర్ లాగింగ్ పాయింట్లను క్లియర్ చేసిన మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ప్రజలకు ఇబ్బంది కల్గకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. నగర వ్యాప్తంగా శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మాన్సూన్ ఎమర్జెన్సీ బందాలు, స్టాటిక్ బందాలు రోడ్లపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ఆయా అధికారుల పర్యవేక్షణ నిరంతరంగా కొనసాగుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఆయా విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో నగర ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. వర్షాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలావుండగా మాన్సూన్ సీజన్‌లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ ల వద్ద నిలిచిన నీరును తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వాటికి తోడు హైడ్ర ద్వారా 30, సీఆర్ఎంపీ ద్వారా 29 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం క్షేత్ర పరిధిలో బాధ్యతాయుతంగా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు.

టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు అపాయింటెమెంట్ తేదీని ప్రకటించండి

- ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ కె. హనుమంతు ముదిరాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ కె. హనుమంతు ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ఇచ్చిన చారిత్రాత్మక హామీలను అమలు చేస్తూ సీఎం తెలంగాణ ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికుల ఆత్మగౌరవం అయినటువంటి ఆర్టీసీ ప్రభుత్వ విలీనం అపాయింటెడ్ డేట్‌ను అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించి ఆర్టీసీ కార్మికులకు కానుకగా అందించి, ఆర్టీసీ కార్మికుల జీవితాలలో వెలుగులు నింపాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావాలని, రేవంత్ రెడ్డి సీఎం కావాలని ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులందరు బలంగా కోరుకున్నారని, ఆ కల నెరవేరడంతో ఆర్టీసీ కుటుంబాలు సైతం పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారని ఆయన గుర్తు చేశాడు. 90 శాతం పూర్తి అయ్యి, అడుగు దూరంలోనున్న ఆర్టీసీ ప్రభుత్వ విలీనం అపాయింటెడ్ డేట్ కోసం యావత్తు తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ప్రతి రోజు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. అదేవిధంగా యూనియన్ లను అనుమతించాలని, 2013 కు సంబంధించిన బాండ్ డబ్బులు డ్రైవర్లకు మాత్రమే చెల్లించి ఆర్టీసీలో పనిచేస్తున్న మిగతా వారికి చెల్లించకపోవడంతో అసహనానికి గురవుతున్నారని అన్నారు. వెంటనే అలస్యం చేయకుండా అసెంబ్లీ సమావేశాలలో విలీనం అపాయింటెడ్ డేట్‌ను ఎన్నికల ఎజెండాలో ఇచ్చిన హామీ మేరకు ప్రకటిస్తే సీఎం ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి వంచించి మోసం చేసిందని పేర్కొన్నారు. అందువలన ఆర్టీసీ ఉద్యోగులందరూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా మద్దతు ఇచ్చి గెలుపులో భాగం పంచుకున్నారని తెలిపారు.

మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం..

- కోర్టు మానిటరింగ్ అధికారులు, సిబ్బందితో కమిషనర్ వీడియో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలు, చిన్నారుల భద్రతకు అధికప్రాధాన్యత ఇస్తామని, వారిపట్ల ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శనివారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు మానిటరింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సమన్లు, వారెంట్ల జారీ సిబ్బందితో సీపీ సుధీర్ బాబు వీడియో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ నేరస్థులు తప్పించుకోవడానికి వీలు లేని విధంగా విచారణా కొనసాగాలన్నారు. ముఖ్యంగా నేరం చేసిన వారికి శిక్షపడితేనే భయం ఏర్పడుతుందన్నారు. కోర్టు మానిటరింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సమన్లు, వారెంట్ల జారీ సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. త్వరితగతిన కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని, నేరస్తులకు గరిష్ఠశిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పహాడీ షరీఫ్‌లో వివాహిత హత్యకేసుతో పాటు ఘట్‌కేసర్ పరిధిలో నాలుగున్నరేండ్ల చిన్నారి అపహరణ కేసులతోపాటు వివిధ కేసుల ఛేదింపుతో పాటు వారికి శిక్షపడేలా సాక్ష్యాలను కోర్టులో సమర్పించిన అధికారులను, సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీ.సీ.ఆర్.బీ ఏసీపీ రమేష్, ఏ.సీపీ లక్ష్మీకాంత రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం



- పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని మహారాజా గార్డెన్‌లో బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక కార్పొరేటర్ గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై బీజేపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనలో ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేసే పాలన చేస్తుందని విమర్శించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందన దివాకర్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ కన్వీనర్ శేఖర్ యాదవ్‌డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేతతో పాటు బీజేపీవిజయవంతం చేశారు.

కథక్ అంజి బాబుకు గౌరవ డాక్టరేట్

నవతెలంగాణ-కల్చరల్



ప్రముఖ కథక్ నాట్య గురు, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు ఎర్రంశెట్టి అంజుబాబుకు అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. గత ఐదు దశాబ్దాలుగా కథక్ నాట్యంలో చేస్తున్న విశేష సేవలను గుర్తించి అమెరికా మేరీల్యాండ్‌లోని సౌత్ వెస్టన్ అమెరికన్ యూనివర్సిటీ 2023వ సంవత్సరానికి భారతదేశం నుంచి అంజుబాబును ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం ఆ యూనివర్సిటీ ట్రస్టీ డాక్టర్ ఎల్విస్ విలియం నుంచి ఉత్తర్వులు అందినట్లు అంజుబాబు తెలిపారు. ఈ నెల 24న ఢిల్లీలో జరగనున్న ప్రత్యేక కాన్వకేషన్‌లో ఆయనకు గౌరవ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయనున్నారు. గత ఏడాది ముంబైలో బిగ్ బి అమితాబ్ బచ్చన్‌కు ప్రదానం చేశారు. ఉత్తరాది శాస్త్రీయ కథక్ నాట్యాన్ని దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రాచుర్యం కల్పించిన తొలి నాట్యగురువుగా అంజు బాబు ప్రసిద్ధి పొందారు. గత 37 ఏండ్లుగా ప్రతి యేటా అంతర్జాతీయ నత్య దినోత్సవం రోజున హైదరాబాద్‌లో జాతీయ స్థాయి కళాకారులతో నత్యోత్సవాలు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన శిష్యులు వివిధ దేశాల్లో స్థిరపడి ప్రదర్శనలు ఇస్తున్నారు. అమెరికా, లండన్, మలేషియా, సింగపూర్ తదితర దేశాల్లో కథక్ శిక్షణా శిబిరాలు నిర్వహించి, ప్రశంసలు అందుకున్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎర్రగడ్డ డివిజన్‌లో 34 మందికి ఒక్కొక్కరికి ఒక లక్ష 116 రూపాయల చొప్పున, రూ. 34,03,944 విలువైన షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, అమీర్‌పేట సీనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, డివిజన్ ప్రెసిడెంట్ సంజీవ్, జనరల్ సెక్రటరీ సయ్యద్ షరీఫ్, షైక్ జావీద్, సయ్యద్ రసూల్, ముహీబ్ ఖాన్, దాసి శ్రీకాంత్, తరుణ్, అనిల్, బాలు, నరేష్, రాజు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో నేలకొరిగిన చెట్టు



నవతెలంగాణ-బంజారా హిల్స్

గాలి వానల వల్ల జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్ నగర్ అపోలో హాస్పిటల్ వద్ద చెట్టు కుప్పకూలడంతో ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన జిహెచ్ఎంసి డీఆర్ఎఫ్ అధికారులు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కూలిన చెట్టుని అక్కడ నుండి తొలిగించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూశారు.

నేడే లష్కర్ బోనాలు

- 1500 మందితో భారీ బందోబస్తు
- పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- రంగంలోకి ప్రత్యేక బలగాలు, షీ బృందాలు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- వదంతులు సృష్టిస్తే చర్యలు తప్పవు
- నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో...బేగంపేట్

ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభంకానున్న సికింద్రాబాద్ మహంకాళి ఉజ్జాయినీ బోనాల సందర్భంగా పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. లష్కర్ బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జాయినీ అమ్మవారి ఆలయానికి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఆది, సోమ రెండు రోజులు జరిగే ఉత్సవాల్లో మంత్రులు, వీఐపీలు, వీవీఐపీలు, ప్రముఖులు రానున్న నేపథ్యంలో 1500 మందితో భారీ భద్రతను కట్టుదిట్టం చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులతోపాటు, అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన పోలీస్ అధికారులు పలు సూచనలు, సలహాలు అందించిన విషయం తెలిసిందే. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహంకాళి బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల వద్దకు మహిళలు అధిక సంఖ్యలో తరలి వస్తారు. వారి భద్రత కోసం ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు షీ బృందాలను, యాంటీ చైన్‌స్నాచింగ్ బృందాలను రంగంలోకి దించారు.

సీసీకెమెరాలతో ప్రత్యేక నిఘా

కరుడుగట్టిన నేరస్తులు, రౌడీషీటర్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సికింద్రాబాద్‌లోని ఆలయంలో 24 సీసీకెమెరాలను ఏర్పాటు చేసిన అధికారులు, వివిధ ప్రాంతాల్లో అదనంగా మరో 400లకుపైగా సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి పుటేజీలను ఎప్పటికప్పుడు బంజారాహిల్స్‌లో సీసీసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు మాహాకాళి ఠాణాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జాయింట్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తారు. పాతబస్తీ, నాంపల్లి, సికింద్రాబాద్, మాదాపూర్, హైటెక్ సిటీతోపాటు, కూకట్ పల్లి, ఎల్బీనగర్, గచ్చిబౌలి, శంషాబాద్ విమానాశ్రయం, కాచిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లు, సినిమా థియేటర్లు, దేవాలయాలు, షాపింగ్‌మాల్స్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. అనుమానితులపై నిఘా పెంచారు. పలు ప్రాతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు మహిళా పోలీసులను, హెూంగార్డులు, క్లూస్ టీంలు, టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్ సిబ్బందిని రంగంలోకి దించారు. వారితోపాటు స్పెషల్‌బ్రాంచి, కౌంటర్ ఇంటెలిజెన్స్ నిఘాను అధికం చేశారు. పెట్రోలింగ్, గస్తీ తిరిగే సిబ్బందిని అప్రమత్తం చేశారు.

పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు

ఆదివారం సికింద్రాబాద్ మహంకాళీ బోనాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జంటనగరాల్లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా మహంకాళీ దేవాలయం పరిసరాలతోపాటు జనరల్ బజార్, సుభాష్ రోడ్ మార్గాలను మూసేస్తారు. ఎంజీ రోడ్, సింధికాలనీ, మినిస్టర్ రోడ్, ప్యాట్నీ తదిర ప్రాంతాల్లో 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు ఈ మార్గాలో కార్లు, ద్విచక్రవాహనాలతోపాటు ప్రయివేటు, ఆర్టీసీ బస్సులను దారి మళ్లింపు ఉంటుందన్నారు. సాధారణ వాహన దారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనే వాహనదారులు కోసం ప్రత్యేకంగా 9 ప్రాంతాలల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని, పోలీసులు సూచించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను పార్క్ చేయాలని కోరారు.

క్యూలైన్‌లో భక్తులు జాగ్రత్త

- దొంగలు చొరబడే అవకాశం ఉంది
- నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

మహంకాళీ బోనాల సందర్భంగా నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశామని, ఎలాంటి వదంతులను నమ్మొద్దని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని, అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. క్యూలైన్‌లో వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకోవాలని భక్తులకు సూచించారు. మహిళలు ఒంటిపై భారీగా బంగారు ఆభరణాలు ధరించకపోవడమే మంచిదన్నారు. రద్దీప్రాంతాల్లో, క్యూలైన్‌లో భక్తుల మాధిరిగానే దొంగలు చొరబడే అవకాశముందని, అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆలయాల సమీపాల్లో, కాలనీల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వదంతులు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చారించారు. నింబధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నేడు మహంకాళీ బోనాలు

- ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ ఆమ్రపాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్‌లో నేడు ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట ఏర్పాట్లను పరిశీలించారు. ఉజ్జయిని మహంకాళి ఆలయంతో పాటు పలు దేవాలయాలకు సంబంధించిన మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. శానిటేషన్ మొబైల్ టాయిలెట్స్ తదితర అంశాలపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు ఫీల్డ్ లో అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-ఓయూ

లష్కర్ బోనాల జాతరకు రావాలని జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ దంపతులకు ఆహ్వానం అందింది. శనివారం తార్నాకలోని ఆమె నివాసంలో మహంకాళి ఆలయ అర్చకులు కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

కబ్జా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ డివిజన్ సారధి సొసైటీలో రోడ్డు కబ్జా చేసి నిర్మాణం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో స్థలాన్ని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు సర్వే చేయించారు. ప్రభుత్వ రహదారిలో నిర్మించిన కట్టడాలని వెంటనే తొలగించాలని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



లష్కర్ బోనాల ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

నవతెలంగాణ-బేగంపేట్

లష్కర్‌లో ఆదివారం జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపా దాసమున్షి, సనత్ నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ, ఈవో మనోహర్ రెడ్డి, చీర సుచిత్ర శ్రీకాంత్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శ నం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల చర్య లు చేపట్టాలని దేవదాయ శాఖ అధికారులు, పోలీసులను మంత్రి ఆదేశించారు. బోనాలు తీసుకొచ్చే మహిళల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు.



తలపై బోనంతో అమెరికన్ కాన్సులేట్

అమెరికన్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తలపై బోనంతో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోనాన్ని తలపై పెట్టుకుని దేవాలయంలోకి తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తెలంగాణా ఇంచార్జ్ దీపాదాస్ మున్షి కూడా బోనంతో దేవాలయానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు విశాల్ సూదం. మహేష్, శ్రీకాంతాచారి, మురళిగౌడ్, ఉషా, సవిత, నారాయణ్, రమేష్, కృష్ణ తదిరులు పాల్గొన్నారు.



తెలుగు శాఖ నిత్య చైతన్య, సాహిత్య చరిత్ర నిక్షిప్తం హర్షణీయం

- తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆచార్య ఆర్. లింబాద్రి



నవతెలంగాణ-ఓయూ

తెలుగు శాఖ నిత్య చైతన్య, సాహిత్య చరిత్ర నిక్షిప్తం హర్షణీయమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆచార్య ఆర్. లింబాద్రి అన్నారు. తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'గురుతరం' (తెలుగుశాఖ ఆచార్యుల సాహిత్య సేవ) శీర్షికన సాహిత్య వ్యాస సంకలనం శనివారం ఆర్ట్స్ కళాశాల రూమ్ నంబర్ 57లో నిర్వహించారు. తమ బోధనలతో తెలుగు శాఖ విద్యార్థులను తీర్చిదిద్దుతూనే సాహిత్య సష్టి చేసిన 61 మంది అపూర్వ, ప్రస్తుత ఆచార్యుల సాహిత్య వ్యాసాల సంకలనమిదన్నారు. ఈ గ్రంథ లోకార్పణ కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ అధ్యక్షత వహించారు.

తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆచార్య ఆర్. లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ . తెలుగుశాఖ నిత్య చైతన్యంతో క్రియాశీలకంగా ఉంటూ సాహిత్య చరిత్రను నిక్షిప్తం చేస్తున్నాదని, ఈ శాఖ కృషి రాయప్రోలు, ఖండవల్లి నుండి నిరంతరం కొనసాగుతున్నదని తెలిపారు. ఈ క్రమంలో 'గురుతరం' పేరుతో ఇక్కడ పనిచేసిన, పనిచేస్తున్న ఆచార్యుల సాహిత్యాన్ని 668 పుటలతో బహద్గ్రంథంగా తీసుకురావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. విశిష్ట అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సైదా తలాత్ సుల్తానా మాట్లాడుతూ. తెలుగుశాఖ ఆచార్యుల సాహిత్య కషికి ఈ గ్రంథం నిదర్శనమన్నారు. ఆచార్య సూర్యాధనంజయ్ తెలుగుశాఖ విద్యార్థులుగా ఉండి ఇదే శాఖలో విద్యాబోధన చేసే అవకాశం కలగడం, గురువుల మార్గంలో సాహితీ సజన చేయడం వారి సమక్షంలో ఈ 'గురుతరం' గ్రంథం ఆవిష్కరిం చుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆచార్య సి. కాశీం మాట్లాడుతూ నిరంతరం అధ్యయనం, నిరంతర సాహితీ సజనకు తెలుగుశాఖ కేంద్రమన్నారు. సభాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ ప్రసంగిస్తూ ఆచార్య రాయప్రోలు, ఖండవల్లి, దివాకర్ల, అమరేశం రాజేశ్వర శర్మ, సి. నారాయణ రెడ్డి, .ఎన్. గోపి, ఎస్వీ. రామారావు, కసిరెడ్డి వెంకట్ రెడ్డి సాహిత్య వారసత్వంలో తెలుగుశాఖ ప్రయాణం చేస్తున్నదన్నారు. గ్రంథ సమన్వితమైన అరవై ఒక్క ఆచార్యుల సాహిత్య వ్యాసాల సారాన్ని సహాయాచార్యులు డా.ఎస్. రఘు సభకు పరిచయం చేశారు. గౌరవ అతిథి దుండె మల్లేశం మాట్లాడుతూ. ప్రజా సేవకే కాదు సాహిత్య గ్రంథాలను లోకానికి పంచడానికి రచయితలకు సహాయకారిగా ధ్రువ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని, ఈ గురుతరం గ్రంథ నిర్మాణంలో తమ సంస్థకు చోటు కల్పించడం పట్ల శాఖాధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేశారు.తెలుగుశాఖ అపూర్వాచార్యులు ఎస్వీ రామారావు, సురేంద్ర కుమార్, కసిరెడ్డి వెంకట్ రెడ్డి, సుమతీ నరేంద్ర, కుసుమారెడ్డి, ఎస్వీ. సత్య నారాయణ, మసన చెన్నప్ప, ఎం. అండమ్మ, వెలుదండ నిత్యానంద రావు, గోనా నాయక్ , పి. వారిజారాణి, ఎస్.ఆర్ వెంకటేశం హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ ఆర్ట్స్ కళాశాల, నిజాం కళాశాల, కోఠి మహిళా విశ్వ విద్యాలయం నుంచి ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు అధికసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి తెలుగుశాఖ సహాయాచార్యులు డా.ఏలె విజయలక్ష్మి స్వాగతం పలుకగా ధ్రువ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, అధ్యాపకులు బోళ్ల ప్రవీణ్ ముగింపు వాక్యాలు పలికారు.

'ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు'



నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహణ కోసం అందరూ సహకరించాలని మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ పిలుపునిచ్చారు. శనివారం బాపూజీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, బిస్కట్లు తో పాటు అరిగే రామస్వామి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన బెంచ్‌లను వితరణ చేశారు. అనంతరం పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గతంలో తామందరం ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. వారి హయాంలో విద్యార్థులను తీర్చిదిద్దితే దేశానికి సేవ చేయటానికి ఉపయోగపడతారని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు వెచ్చించి ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. అలా కాకుండా ప్రతి ఒక్కరూ వారి పిల్లలను తమ బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉత్తమ విద్యను అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో సలహాలు సూచనలు తీసుకోవడం అందుకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలకు ఎలాంటి అవసరం ఉన్న తనను సంప్రదించాలని కోరారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తాను సైతం కషి చేస్తానన్నారు. అజీత్ కళ్యాణ్, రామారావు, శ్రీకాంత్, వర ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ ఆశీర్వాదం, షడ్రిక్, శోభారాణి, పద్మావతి, హరినాథ్, సరిత తదితరులు పాల్గొన్నారు. ఆయనతో పాటు కాలనీ సంక్షేమ సంఘం సభ్యుడు రాజేందర్ గుప్త, లయన్ నారాయణ హాజరయ్యారు.

ప్రపంచీకరణతో పెరిగిన సాంకేతిక నిపుణుల అవసరం



- జమ్మూకాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొ.రవీంద్రనాథ్

నవతెలంగాణ-ఓయూ

ప్రస్తుత ప్రపంచంలో ప్రపంచీకరణ ప్రభావంతో సాంకేతిక నిపుణుల అవసరం పెరిగిపోయిందని జమ్మూకాశ్మీర్ కాస్మిర్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొ.రవీంద్రనాథ్ అన్నారు. ఓయూ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు పట్టాల ప్రదాన కార్యక్రమం శనివారం కళశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2020-2024 విద్యాసంవత్సరంలో బీటెక్ పూర్తి చేసిన వారికి పట్టాలతో పాటు ప్రతిభ చూపిన 4 టాపర్స్ బి. స్నేహిత రెడ్డి , రెండు బంగారు పతకాలతో పాటుగా బి.కీర్తన ,యం.ముఖేష్ లకి బంగారు పతకాలు అందజేశారు. ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత సాయిలు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ వీసీ, ఎన్ ఐ టి శ్రీనగర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ హాజరై విద్యార్థులకు బంగారు పతకాలు, అవార్డులు, స్కాలర్‌షిప్‌లు, ర్యాంకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ. టెక్నాలజీ విద్యార్థులకు అనేక అవకాశాలు, భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విద్యార్థులు సమాజంలో ఉన్న సమస్యలపై కూడా దృష్టి సారించాలని కోరారు. గ్లోబలైజేషన్ ప్రభావంతో విద్యార్థులకు అందుతున్న అవకాశాల గురించి చెప్పారు. ఓయూ టెక్నాలజీ కళాశాల నుంచి పట్టభద్రులైన విద్యార్థులకు దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా ఒక గుర్తింపు ఉందని, దానిని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థిపై ఉంటుందన్నారు. ఈ వేడుకలలో గత విద్యా సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన నలుగురికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మొత్తం 116 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. మరో నలుగురు విద్యార్థులకు తొలిసారిగా బీటెక్ ఆనర్స్‌లో డిగ్రీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సభ్యుడు అలూమిని అధ్యక్షుడు రాజ మహేందర్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొ. రమేశ్ కుమార్ , ఫ్యాకల్టీ ఆఫ్ పార్మసీ డీన్ ప్రొఫెసర్ వీవీ బసవరావు, ప్రొఫెసర్ హయవదన కళశాల ప్రొపెసర్స్ ,పూర్వ విద్యార్థులు ,విద్యార్థులు ,ఉద్యోగులు పాల్గొన్నారు.

అమెరికా వీసా అనుమతులపై అవగాహన..



నవతెలంగాణ - బంజారా హిల్స్

అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్తున్న విద్యార్థులకు వీసా అనుమతులపై తాజ్ కష్ణలో అవగాహన కార్యక్రమంలో భాగంగా బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. వెబ్‌స్టార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వెబ్ స్టీర్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ సామ్రాట్ రాయ్ చౌదరి,ఇన్యుని డైరెక్టర్ జేమ్స్ విగేస్, రాజు దట్లలు పాల్గొని ప్రసంగించారు. ఉన్నత విద్య కోసం ఇతర దేశాలకు వెళుతున్న విద్యార్థులు మొదటి ప్రాధా న్యతగా అమెరికాను మాత్రమే ఎంచుకుంటున్నారని చెప్పారు. కాగా వివిధ కారణాలతో వీసా అనుమతులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు. అవగాహన లోపంతోనే వీసాలు కోల్పోయి విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వీసాల కోసం ఏజెంట్లను ఆశ్రయిస్తున్న వారు కనీస పరిజ్ఞానంతో హాజరు కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని చెప్పారు. ఏ యూనివర్సిటీ కి వెళ్తున్నారు ఆ యూనివర్సిటీ వివరాలు అక్కడి ప్రొఫెసర్ల వివరాలు పూర్తిగా తెలుసుకొని వీసా కోసం వెళితే తప్ప కుండా వీసా పొందవచ్చునని చెప్పారు. అమెరికాలోని మూడు ప్రాంతాలలో యూనివర్సిటీ సేవలందిస్తుందని చెప్పారు. వందకు పైగా కోర్సులను ఆఫర్ చేస్తున్నామని చెప్పారు. తమ యూనివర్సిటీలో విద్య అభ్యసించేందుకు వస్తున్న విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వీసాలు తీసుకునేందుకు సహకరిస్తున్నామన్నారు. అమెరికా చేరుకున్న తర్వాత విద్యార్థులు ఏ విధంగా ప్రవర్తించాలి, చదువుతూ ఉద్యోగం ఎలా పొందాలి అనే అంశాలను పూర్తిగా వివరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కంట్రీ మేనేజర్ పద్మిని గిలాని, ఆపరేషన్ మేనేజర్ రూపేష్ సోల్లర్లు పాల్గొన్నారు.



తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నిర్మల జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సీబీఎఫ్‌సీ మెంబర్ అక్కల సుధాకర్


నవతెలంగాణ-సిటీబ్యూరో



శ్రీశైలం దేవస్థానంలో నిర్వహించిన కూచిపూడి కార్యక్రమంలో పాల్గొన్న తిలక్ నగర్ చెందిన గోనే కార్తీక్ వంశీక దంపతుల కుమార్తె నారాయణి.

నవతెలంగాణ-అంబర్‌పేట్

ఘనంగా ముగిసిన వాణిజ్య 2024



నవతెలంగాణ-ఓయూ

ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో సెమినార్ హాల్లో రెండు రోజుల నుండి జరుగుతున్న వాణిజ్య 2024 కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ముగింపు సందర్భంగా రాష్ట్రంలోని యూనివర్సిటీ అండ్ పీజీ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో చురుకుగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓయు ఓఎస్డీ ప్రొ.రెడ్యా నాయక్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించి, సజనాత్మక ఆలోచనలకు వేదికగా ఉంటాయి అన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కామర్స్ విభాగం హెడ్ వాణిజ్య సదస్సు చైర్మెన్ సీనియర్ ప్రొఫెసర్ దాసరి చిన్నప్ప మాట్లాడుతూ. ండు రోజుల వాణిజ్య సదస్సులో కామర్స్ విద్యార్థులు కామర్స్ క్విజ్ , జస్ట్ ఎ మినిట్ , కె స్టడీస్ , పోస్టర్స్ ప్రదర్శనతో పాటుగా , 15 అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఉత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికేట్స్ అందజేశామన్నారు. ఈ పోటీల్లో ఎక్కువ బహుమతులు గెలుపొందిన ఓయూ కామర్స్ విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్స్ ట్రోఫి ప్రధానం చేసినట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కామర్స్ 18 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని ,పో.చెన్నప్ప చెప్పారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్స్ ఇస్తామంటూ ముందుకు వచ్చిన వారికి, వాణిజ్య విజయవంతం చేసిన వారికి ఆయన కతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కామర్స్ డీన్ ప్రొఫెసర్ ఎం. గంగాధర్ కామర్స్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొఫెసర్ కె కృష్ణచైతన్య, కన్వీనర్ ఇంద్రకంటి శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, విభాగం అధ్యపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తాజాగా ఉండాలంటే..

కాఫీ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. ఉదయం లేవగానే ఓ కప్పు కాఫీ తాగందే ఏ పనీ ముందుకు సాగదు చాలా మందికి. బ్లాక్ కాఫీ, ఫిల్టర్ కాఫీ ఇలా ఇందులో చాలా వెరైటీలే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చాలా మంది నెల సరుకుల్లో ఎక్కువగానే కాఫీ పౌడర్ తెచ్చుకుంటారు. అది కొన్ని రోజులు బానే ఉంటుంది. తర్వాత గట్టి పడుతుంది. అలా గట్టిగా, ముద్దలాగా అవ్వకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి.



తేమ లేకుండా..

కాఫీ పౌడర్ ఎక్కువ రోజులు ఫ్రెష్‌గా ఉండాలంటే వాటిని తేమ ఉన్న ప్రదేశంలో ఉంచకూడదు. పొడిగా ఉన్న ప్రదేశంలోనే పెట్టండి. దీని వల్ల కాఫీ గడ్డ కడుతుంది.

గాలి చొరబడని కంటైనర్..

కాఫీ పొడిని గాజు సీసాలో స్టోర్ చేయండి. మూత గట్టిగా ఉండేలా చూసుకోండి. లేదంటే కాఫీ పొడి ముద్దలా తయారవుతుంది. కాబట్టి, గాలి చొరబడని కంటెయినర్‌లో పెట్టండి. ■

ఆమె సినిమా 'స్పిరిట్'



రెడీ... లైట్స్... కెమెరా.. యాక్షన్.. అంటూ సాగే సినిమా లోకం ఓ ప్రత్యేకం. అలాంటి రంగంలో చదువూ సంధ్యా లేని ఓ మహిళ అద్భుతాన్ని సృష్టించారు. కూలీ పనులు చేస్తూ.. చిన్నపాటి హోటల్ నడుపుతూ ఏకంగా రూ.80 లక్షలు పెట్టి సినిమానే తీశారు. ఆమె పేరు చెన్నెబోయిన వెంకట నర్సమ్మ. ప్రకాశం కొనకనమిట్ల మండలం పెదరికట్ల గ్రామం. సినిమా అంటే చిన్నప్పటినుంచి విపరీతమైన ఇష్టం. ఆ ఇష్టమే కొడుకు చేత ఓ సినిమాను తీయించేలా చేసింది. సంకల్ప బలం ఉంటే ఎంత కష్టమైనా ఇట్టే సాధించొచ్చు అని రుజువు చేసిన ఆమె పరిచయం నేటి మానవిలో...

వెంకట నర్సమ్మ, చెన్నెబోయిన వెంకటేశ్వరరావు దంపతులది ఓ చిన్న రైతు కుటుంబం. ఉండేది చుట్టుంటి పాకలో.. నేటికీ వంట కట్టెలపొయ్యి మీదే. వారి కొడుకు వెంకట రవీంద్రనాథ్. దంపతులు ఇద్దరూ తమ పొలంలో పనులు చేసుకుంటూ ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులకు సైతం వెళ్తుంటారు. కొడుకు రవి చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తున్నాడు. బాల్యం నుంచే సినిమాలపై ఓ ప్రత్యేకమైన ఇష్టమున్న వెంకట నర్సమ్మ ఎప్పటికైనా ఓ సినిమా తీయాలనుకున్నారు. తరచూ ఆ మాట అంటూ ఉంటే భర్త, కొడుకు నవ్వి ఊరుకునేవారు. ఆమె మాటలను సరదాగా తీసుకునేవారు.

బలమైన కోరికతో...

'సినిమా అంటే మాటలు కాదు, ధనం మూటలు కావాలి' అనుకునే వారు ఆ తండ్రీకొడుకులు. ఆ విషయం తనకూ తెలుసని, డబ్బు ఎలాగైనా సమకూరుస్తానని అనేది వెంకట నర్సమ్మ. పదేండ్ల కిందట కొడుకుతో సినిమా తీయాలనే కోరిక గురించి గట్టిగా చెప్పింది. అంతేనా రూ.500 చేతిలో పెట్టి హైదరాబాద్ పంపింది. రవి ఇక్కడ చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ, ఖాళీ సమయాల్లో స్టూడియోలకు వెళ్లి అనేక మంది దర్శకులు, నిర్మాతలను కలిశాడు. ఎప్పటికప్పుడు తల్లికి ఆ విషయాలన్నీ వివరిస్తూ ఉండేవాడు. సినిమా పరిశ్రమలో వివిధ రంగాల్లో పనిచేసి, కొంత ప్రావీణ్యం సంపాదించాడు. చివరకు తన తల్లి కోరినట్టుగానే సినిమా తీస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చాడు.

20 ఏండ్లుగా హుండీ

వెంకట నర్సమ్మ కుటుంబం వ్యవసాయ పనులు చేసుకుంటూనే 70 జీవాలు (గొర్రెలు, మేకలు), 30 వరకూ గేదెలు పెంచుతూ, వాటి ద్వారా ఆదాయం పొందేది. వారికి మూడెకరాల పొలం కూడా ఉండేది. వచ్చే సంపాదనలో కొంత భాగాన్ని వెంకట నర్సమ్మ హుండీలో జమ చేస్తుండేవారు. ఒకసారి ఆ సొమ్ము బయటికి తీసి లెక్కిస్తే మొత్తం రూ.3 లక్షలు అయింది. ఆ మొత్తాన్ని కొడుక్కు పంపించి, సినిమాకు తొలి పెట్టుబడి సిద్ధం అన్నారు వెంకట నర్సమ్మ.

కొడుకుని ప్రోత్సహించారు

సినిమా తీసేందుకు ఎలాగైనా మిగిలిన డబ్బు కూడా సమకూర్చాలనే తపనతో చెరకురసం బండి కూడా నడిపారు ఆమె. ఆ తర్వాత టిఫిన్ బండి పెట్టారు. కొండగట్టు వద్ద రాగి సంగటి హోటల్ ఏర్పాటు చేశారు. ఇలా వచ్చిన సంపాదనలో కొంత భాగాన్ని పోగేశారు. హోటల్, పొలం, జీవాల ద్వారా వచ్చిన ఆదాయం మొత్తంతో రూ.50 లక్షలు కూడా బెట్టారు. ఈ డబ్బుతో సినిమా తీయాల్సిందిగా కొడుకుని ప్రోత్సహించారు. రవి ఈలోగా ఓ సినిమా స్క్రిప్టు తయారు చేశాడు. నటీనటులను ఎంచుకున్నాడు. రెండేండ్ల కిందటే షూటింగ్ ప్రారంభించాడు. అయితే అప్పటి వరకు ఆమె సమకూర్చిన డబ్బులు సరిపోలేదు. దీంతో ఉన్న మూడెకరాల పొలాన్ని అమ్మేశారు. ఆ మొత్తం కూడా చాలకపోవటంతో ఆమె తన పుస్తెలమ్మి సినిమాను తీశారు. మొత్తానికి ఆ సినిమాకు నిర్మాతగా ఆమె పేరు పోస్టరు మీదికి ఎక్కింది.



ఆ దురాచారం పోవాలని...

మాతంగుల జీవితాలు చాలా దుర్భరం. వారి చేత అశ్లీల ప్రదర్శనలు ఇవ్వటమే కాదు, వారిని లైంగికంగా వేధించటం, దౌర్జన్యాలు చేయడం మంచిదికాదు. మాతంగులపై జరిగే దురాచారాలు పోవాలి. వారు కూడా మంచిగా జీవించాలనే ఇతివృత్తంతో ఈ సినిమా తీశాం. వారి పిల్లలు ఇలాంటి వృత్తిలోకి రాకుండా ఉండాలనేది మా సంకల్పం. మా సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా.

- చెన్నుబోయిన వెంకటనర్సమ్మ, నిర్మాత

సినిమా 'స్పిరిట్'

తెలంగాణాలో దేవదాసీ వ్యవస్థలాగానే కోస్తాంధ్రలో ఒకప్పుడు మాతంగులు ఉండేవారు. ఇప్పుడూ ఉత్సవాలు, జాతర్లు, ఎల్లమ్మ తిరునాళ్ల వంటి సమయాల్లో వారిని డ్యాన్స్ చేయటానికి తీసుకొస్తుంటారు. పెత్తందారులు వారిని తమ కోర్కెలు తీర్చే సాధనంగా చూసేవారు. వారు చెప్పినట్లుగా వినకపోతే కొట్టడం, హింసించటం చేస్తుంటారు. పరిసర ప్రాంతాల్లో జరిగే ఉత్సవాల్లో ఇలాంటి సంఘటనలను వెంకటనర్సమ్మ దంపతులు స్వయంగా చూశారు. వారితో అనేకసార్లు మాట్లాడారు. అప్పుడు వెంకట నర్సమ్మ మనసులో నాటుకున్న భావమే 'స్పిరిట్' సినిమాగా రూపుదిద్దుకుంది.

చిన్నప్పటి నుంచే ...

వెంకట నర్సమ్మ తన బాల్యంలో అనేక సినిమాలు చూసేవారు. తన చుట్టుపక్కల వారితో చూసిన సినిమా గురించి చెబుతూ ఉండేవారు. చిన్నప్పుడు 'బ్రహ్మంగారి చరిత్ర', 'పొట్టేలు పున్నమ్మ' సినిమాలు తనను బాగా కదిలించాయని ఆమె చెబుతారు. పెండ్లి తర్వాత భార్యాభర్తలు ఇద్దరూ కలిసి 'పుట్టింటికి రా చెల్లి' సినిమా చూశారు. అది కూడా తనకు బాగా జ్ఞాపకం అని చెబుతారామె. మహిళా పాత్రలు బలంగా, ప్రభావశీలంగా ఉంటే ఆమెకు ఇష్టం. చదువు లేకపోయినా, సినిమా పరిజ్ఞానం ఎప్పటికప్పుడు పెంచుకున్నారు. ఎప్పటికన్నా సినిమా తీయాలి అనుకొని ఎంతో కష్టపడి డబ్బు సమకూర్చి కొడుకు ద్వారా సినిమా కోరికను నెరవేర్చుకున్నారు.

తారాగణం

8త్ వండర్ సినిమా బ్యానర్‌పై నిర్మితమైన ఈ 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమా త్వరలో విడుదల కానుంది. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను, రమ్య, ప్రియ, పింకీ, జూనియర్ రాజశేఖర్, ప్రేమకథా చిత్రం సైదులు, జబర్దస్త్ నాగ్‌తేజ్, చిట్టిబాబు తదితరులు ఇందులో నటించారు. నిర్మాత చెన్నెబోయిన వెంకట నర్సమ్మ కాగా, దర్శకత్వం ఆమె కుమారుడు వెంకట రవీంద్రనాథ్.

- యడవల్లి శ్రీనివాసరావు

సంపూర్ణ ఆరోగ్యం కోసం...

మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలంటే కేవలం శారీరకంగానే కాదు.. మానసికంగానూ దృఢంగా తయారు కావాలి.

నిత్యం ఇంటి పని, వంటపనితో పాటు బయట ఆఫీసు పనితో మహిళలు బిజీబిజీ ఉంటున్నారు. కానీ ఎంత బిజీగా ఉన్నా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏదో ఒక హెర్బల్ టీతో రోజును ప్రారంభించాలి. బ్రేక్‌ఫాస్ట్‌లో తాజా పండ్లు తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది.. పుచ్చకాయ, కర్బూజ, సీతాఫలం, దానిమ్మ, కొబ్బరి నీరు లాంటివి తీసుకోవడం మంచిది. తాజా



పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, బీన్స్, పెరుగు, మొలకెత్తిన గింజలు.. వంటి ప్రొటీన్లు ఎక్కువగా లభించే పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. రాత్రి పడుకోవటానికి రెండు గంటల ముందు డిన్నర్ పూర్తి చేయడం మంచిది.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి..

బయట దొరికే స్నాక్స్, జంక్‌ఫుడ్, సాఫ్ట్ డ్రింక్స్‌కు సాధ్యమైనంత దూరంగా ఉండడం మంచిది. ఈ ఆహారం మీ రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. అనేక తీవ్రమైన వ్యాధులకు కారణమవుతున్నాయి.

వ్యాయామం చేయండి..

దృఢంగా తయారు కావడానికి వ్యాయామం ఎంతగానో సహకరిస్తుంది. దీనివల్ల శరీరంలోని కణజాలాలకు ఆక్సిజన్, పోషకాలు బాగా సరఫరా అవుతాయి. తద్వారా గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగవుతుంది. అలాగే కండరాలు దృఢంగా తయారవడంతో పాటు శరీరానికి శక్తి అందుతుంది. శరీరంలోని అదనపు క్యాలరీలు కరిగి బరువును అదుపులో ఉంచుకోవచ్చు. ■

సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైతే రూ.లక్ష ఆర్థిక సాయం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని గుర్తుచేశారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని స్పష్టంచేశారు. తమపార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని చెప్పారు. గడచిన పదేండ్లలో నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందనీ, ప్రశ్నాపత్రాలు లీకయ్యాయనీ, పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. ఏండ్ల తరబడి ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారనీ, అలాంటి నిరుద్యోగుల బాధలు తమకు తెలుసని చెప్పారు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లను జారీ చేశామనీ, యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)లో మార్పులు చేసి, పునర్వ్యవస్థీకరించామని వివరించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించామనీ, డీఎస్సీ రాతపరీక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు. పోటీ పరీక్షలను వాయిదా వేయడం మంచిది కాదన్నారు. అయినప్పటికీ నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్-2 రాతపరీక్షలను వాయిదా వేశామన్నారు. పకడ్బందీ ప్రణాళికతో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా మార్చిలోగా అన్ని శాఖల్లో ఖాళీల వివరాలను తెప్పించుకుంటామనీ, జూన్ రెండులోగా నోటిఫికేషన్లను వేసి డిసెంబర్ తొమ్మిదిలోగా నియామక ప్రక్రియను పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడం కోసమే ప్రభుత్వం తరపున సాయం చేస్తున్నామనీ, మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు అక్కడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రం పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికైతే తెలంగాణకే మంచి జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతాయి. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో మాత్రం ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమల్లో ఉన్న పనివేళలు (ఉదయం 8.45 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు) కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని ఆయన ఆదేశించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు యధావిధిగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4.15 వరకు కొనసాగుతాయి.

తెలంగాణలో ఎవరిపైనా వివక్ష ఉండదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఏ ప్రాంతం వారిపైనా వివక్ష ఉండబోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న 'కమ్మ గ్లోబల్ సమ్మిట్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులాలకతీతంగా నగరంలో నివసించే ప్రజలందరి నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు వారికి సమానావకాశాలను కల్పిస్తామన్నారు.ఎన్టీఆర్ లైబ్రరీలో అభ్యసించిన చదువే తనను ఉన్నత స్థానంలో నిలబెట్టిందని గుర్తుచేశారు. ఆయన రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. తమకు భేషజాలు లేవనీ, తాము అన్ని కులాలను గౌరవిస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం హక్కనీ, దాన్ని నియంత్రించాలనుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో గత పాలకులు చూశారని గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోందని చెప్పారు.కుల, మతాలకతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని అందరూ ప్రోత్సహించాలని సూచించారు. వివాదంలో ఉన్న ఐదెకరాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరించడంతో పాటు భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చటంలో కమ్మ సామాజిక వర్గం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగంపై కాంగ్రెస్ దాడి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ఆయన గవర్నర్ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతపై సీఎం రేవంత్ రెడ్డి నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారనీ, కేసులు పెడుతున్నారని తెలిపారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామనీ, జాబ్‌కార్డు ప్రకటిస్తామని చెప్పారని ఇప్పటి వరకూ ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. గ్రూప్ 1, 2, 3 పోస్టులు పెంచుతామన్న ఆ హామీని పట్టించుకోవటం లేదని వివరించారు. పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకుపోయినట్టు చెప్పారు. రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను కూడా వివరించామన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ హననం జరుగుతోందని తెలిపారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్నారు. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తున్నామనీ, స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు. మేడిగడ్డ కొట్టుకుపోయిందనీ, కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగపాలయ్యాయంటూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలని విమర్శించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తామనీ, ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని చెప్పారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు వందల కోట్లు లాభం వస్తుందన్న సీఎం మాటలను గుర్తు చేశారు. ఇప్పుడు నాలుగు నెలలు వాయిదా వేశారు కదా? రూ. నాలుగొందల కోట్లు వస్తున్నాయా? అందులో సీఎం వాటా ఎంత? అని ప్రశ్నించారు.

నీట్ యూజీ ఫలితాలు విడుదల

పరీక్షా కేంద్రాల వారీగా ఎన్టీఏ వెబ్‌సైట్‌లో వెల్లడి



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం నీట్ యూజీ 2024 ఫలితాలను తన వెబ్‌సైట్‌లో ప్రచురించింది. నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాలు చోటుచేసుకోవడంపై తీవ్ర దుమారం రేగడం, ఈక్రమంలోనే గ్రేస్ మార్కులు పొందిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మళ్లీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ విచారణలో భాగంగా పరీక్షా కేంద్రాల వారీగా ఫలితాలు వెల్లడించాలని సుప్రీంలో పిటిషన్లు సైతం దాఖలయ్యాయి. దీంతో సుప్రీం పరీక్షా కేంద్రాల వారీగా ఫలితాలు వెల్లడించాలని ఎన్టీఏకు ఆదేశించింది. ప్రతి సెంటర్, ప్రతి నగరానికి చెందిన ఫలితాలను తెలపాలని పేర్కొంది. ఆ ఆదేశాల మేరకే శనివారం నీట్ యూజీ ఫలితాలను వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఈ ఫలితాలను జులై 20 మధ్యాహ్నం 12 గంటల లోపు రిలీజ్ చేయాలని సుప్రీం గడువు విధించింది. అయితే అభ్యర్థుల గుర్తింపును మాత్రం గోప్యంగా ఉంచాలని సూచించింది. నీట్-యూజీలో అక్రమాలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి డీవై చంద్రచూడ్ నేతత్వంలోని జస్టిస్ పీబీ పార్డివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పూర్తిస్థాయిలో పరీక్షల పవిత్రత దెబ్బతిన్నదని ఒక బలమైన నిర్ధారణకు వస్తేనే మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశిస్తామని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

25న రాష్ట్ర మంత్రివర్గ భేటీ

బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయనున్న క్యాబినెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 25న భేటీ కానుంది. ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని కమిటీ హాల్-1లో జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. పూర్తి స్థాయి బడ్జెట్‌కు ఆమోదముద్ర వేసే ఏకైక ఎజెండాతో ఈ భేటీ కొనసాగనుందని అధికారిక వర్గాలు తెలిపాయి.

'సమ్మక్క' ప్రధాన పూజారి మరణం : మంత్రి సీతక్క సంతాపం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క దేవత ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య అకాల మరణం పట్ల మంత్రి దనసరి అనసూయ సీతక్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య మరణం సమ్మక్క భక్తులకు తీరని లోటన్నారు. వన దేవత సమ్మక్కకు ఇంతకాలం పూజలు చేసిన మల్లెల ముత్తయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట కాలంలో ఆయన కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని చెప్పారు.

మహిళతో సీఐ అసభ్య ప్రవర్తన

సస్పెండ్ చేసిన సీపీ

నవతెలంగాణ-బేగంపేట్

ఏదైనా ఆపద వస్తే ఆదుకోవాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తాం.. కానీ ఆ పోలీసే ఆపద కలిగిస్తే.. అలాంటి ఘటనే హైదరాబాద్‌లో జరిగింది. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన సనత్‌నగర్ సీఐపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాల్లోకెళ్తే.. సనత్‌నగర్‌లో నివాసముండే ఓ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ విషయమై ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. ఫిర్యాదు చేసిన అనంతరం మహిళా ఫోన్ నంబర్ తీసుకున్న ఇన్‌స్పెక్టర్ పురేం దర్రెడ్డి ఆమెతో చాటింగ్ చేయడం మొదలుపెట్టాడు. అందంగా ఉన్నావని.. చెప్పిన ప్లేస్‌కు వస్తావా అని అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించాడు. తాను అలాంటి దాన్ని కాదని బాధితురాలు చెప్పినా ఇన్‌స్పెక్టర్ వినిపించుకోలేదు. దాంతో విసిగిపోయిన బాధిత మహిళ సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసి ఇన్‌స్పెక్టర్ పంపిన మేసేజ్‌లను చూపించి తన గోడు వెళ్లబోసుకుంది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన సీపీ సదరు ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యకు మంగళమే

(మొదటిపేజీ తరువాయి)

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడో తరగతి వరకు విద్యాబోధన చేస్తే ప్రభుత్వ పాఠశాల విద్యకు మంగళం పాడినట్టేనని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేజీ తరగతులు లేనందున బాలబాలికలను అంగన్‌వాడీ కేంద్రాలకు కాకుండా ప్రయివేటు బడులకు తల్లిదండ్రులు తమ విద్యార్థులను పంపిస్తున్నారని తెలిపారు. దానివల్ల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కేజీ తరగతులను ప్రారంభించాలంటూ ఎమ్మెల్సీగా ఎన్నికైనప్పటి నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నానని గుర్తు చేశారు. విద్యను ప్రయివేటుపరం చేసేందుకే ఎన్ఈపీ-2020ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. విధానపత్రంలోనే కేజీ తరగతులు, ఒకటి, రెండు తరగతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారని తెలిపారు. అందుకనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం వాటిలో మూడో తరగతి వరకు బోధన ఇస్తున్నట్టు కనిపిస్తున్నదని పేర్కొన్నారు. కేంద్రం మాయలో రాష్ట్ర ప్రభుత్వం పడకుండా తెలంగాణ పరిస్థితులకనుగుణంగా పాఠశాల విద్యను రీఆర్గనైజ్ చేయాలని సూచించారు. కేజీ నుంచి ఐదో తరగతి వరకు వంద నుంచి 150 మంది విద్యార్థులుండేలా చూడాలనీ, ప్రతి పాఠశాలలో ఏడుగురు టీచర్లు, హెడ్మాస్టర్, పది గదులుండేలా అభివృద్ధి చేయాలని కోరారు. అప్పుడే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపిస్తారని వివరించారు. తెలంగాణ మోడల్ ఉండాలిగానీ, పరాయి మోడల్ కావొద్దని కోరారు.

ప్రాథమిక పాఠశాల భవిత ప్రశ్నార్థకం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదమున్నది. ఇప్పటికే వాటిలో ఎక్కువ మంది విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంకోవైపు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ (ప్రీప్రైమరీ) తరగతులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఏటా తగ్గుతున్నాయి. తాజాగా మూడో తరగతి వరకు అంగన్‌వాడీల్లోనే విద్యాబోధన ఉంటుందన్న ప్రభుత్వ నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలకు తీవ్ర నష్టం కలిగే అవకాశమున్నది. ప్రస్తుత విద్యాసంవత్సరం లో బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 70,116 మంది విద్యార్థులు చేరారు. అంగన్‌వాడీల్లో మూడో తరగతి వరకు బోధన ప్రారంభిస్తే ప్రాథమిక పాఠశాలల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. ప్రస్తుతం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల్లో బోధన అందుతున్నది. ఒకవేళ ప్రభుత్వ నిర్ణయం అమలైతే ఆ పాఠశాలలు ఉంటాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక పాఠశాలల స్వరూపం ఎలా మారుతుందో చూడాల్సి ఉంటుంది.

అంగన్‌వాడీలకు విద్యాశాఖతో సంబంధం లేదు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) పథకం కింద అంగన్‌వాడీలు పనిచేస్తాయి. అవి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉంటాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యాశాఖతో సంబంధం ఉండదు. ఈ నేపథ్యంలో మూడో తరగతి విద్యాబోధన ఎలా అమలవుతుందన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నది. ఇంకోవైపు బోధన కోసం ఉపాధ్యాయులను విద్యాశాఖకు సంబంధం లేని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు ఎలా పంపుతారనే దానిపై స్పష్టత రావాల్సి ఉన్నది. ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపు, బదిలీలు, పదోన్నతులు ఇలా అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. వాటిని ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందో, ఎలాంటి ప్రతిపాదనలతో మార్గదర్శకాలను విడుదల చేస్తుందో చూడాలి. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020) అమల్లో భాగంగానే దీన్ని అమలు చేస్తున్నట్టుగా పలువురు విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. 10+2+3గా ఉన్న విద్యావిధానాన్ని 5+3+3+4గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు రేవంత్ ప్రభుత్వం ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తున్నది.

ప్రభుత్వ పాఠశాల పాఠశాలల మూసివేతకే దోహదం : టీఎస్‌యూటీఎఫ్

అంగన్‌వాడీలను ప్లేస్కూళ్లుగా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదని, దాన్ని విరమించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించటం లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. మూడో తరగతి వరకు అంగన్‌వాడీలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించదగినదని తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికి, సబ్జెక్టుకొక టీచరు, ప్రధానోపాధ్యాయులు, తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా చూడాలని సూచించారు.

ప్రభుత్వ విద్యారంగానికి నష్టం : ఎస్ఎఫ్ఐ

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడో తరగతి వరకు విద్యాబోధన చేయాలనే ప్రతి పాదన ప్రభుత్వ విద్యారంగానికి నష్టం కలుగుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. ఆ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేసే కుట్రలో భాగంగానే ఆ నిర్ణయం చేసిందని విమర్శించారు. ప్రాథమిక తరగతులను అంగన్‌వాడీల్లో నిర్వహించాలనే ఎన్ఈపీలో ప్రతిపాదించిన ఆలోచలను రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని తెలిపారు. ఈ నిర్ణయం అమలు చేస్తే పేదప్రజలు, ప్రధానంగా బలహీన వర్గాలు విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతుందని తెలిపారు. అసెంబ్లీలో ఎన్ఈపీకి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధి కోసం విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరురు. విద్యారంగంలో తీసుకోవాల్సిన చర్యల గురించి, విద్యార్థి సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు.

ఆశించిన ఫలితాలుండవు : టీపీఎస్వీ

ప్రీప్రైమరీతోపాటు మూడో తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన చేయడం వల్ల ఆశించిన ఫలితాలుండబోవని తెలంగాణ పౌరస్పందన వేదిక (టీపీఎస్వీ) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండాలనీ, తరగతికి ఒక టీచర్‌ను మొత్తం ఏడు మంది ఉండాలనీ, ఒక హెడ్మాస్టర్ ఉండేలా మార్పులు చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిపాదనలపై మేధావులతో చర్చిస్తామంటూ చెప్పడం అభినందించదగ్గ విషయమని తెలిపారు.

అనాలోచిత నిర్ణయం : టీఎస్‌పీటీఏ

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడో తరగతి వరకు విద్యాబోధన అమలు చేయాలనేది అనాలోచిత నిర్ణయమని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య తెలిపారు.

నేడే ఉజ్జయిని బోనాలు..

- ప్రతి యేడు ఆషాఢ మాసంలో జాతర
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ
- దేశ విదేశాల నుంచి తరలిరానున్న భక్తులు
- ట్రాఫిక్ ఆంక్షలు విధింపు

నవతెలంగాణ-బేగంపేట్

బోనాలు అచ్చమైన తెలంగాణ వారి పండుగ. . ప్రాంతీయ ఆచార వ్యవహారాలను బట్టి ఆరాధనా విధానాలు మారుతూ ఉంటాయి. వ్యవసాయంపై ఆధారపడిన తెలంగాణ ప్రాంత ప్రజలు, భక్తి ప్రపత్తులతో మహాశక్తిని విభిన్న రూపాలలో కొలుచు కోవటం అనాది ఆచారంగా వస్తోంది. అలాంటి ఆచారాలలో శక్తి ఆరాధనలో భాగంగా తెలంగాణా ప్రజలు జరుపుకునే బోనాల పండుగ ఎంతో ప్రసిద్ధి గాంచింది. తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతూ.. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో హిందువులు జరుపుకొనే పెద్ద పండుగ బోనాలు. దీనినే ఆషాఢ జాతర అని కూడా అంటారు. ఈ జాతర ను ఆషాఢ మాసంలో వర్ష ఋతువు ప్రారంభ మయ్యేటప్పుడు జంట నగరాలలోనే గాకుండా తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో వివిధ తేదీలలో జరుపు కుంటారు.

ఇక ఈ యేడు ఆషాఢ మాస బోనాలు హైదరాబాద్ లో ఘనంగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సికిద్రాబాద్ ఉజ్జయని మహంకాళి బోనాలు నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు, ఆలయ సిబ్బంది పూర్తిచేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 21,22 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు పోలీసులు ఇప్పటికే తెలిపారు. ఉజ్జయిని మహంకాళి ఆలయానికి 2 కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.



ఆలయ చరిత్ర

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళ్లి ఆలయ చరిత్ర విషయానికొస్తే 1913వ సంవత్సరములో మిలటరీలో పనిచేయు చున్న సికింద్రాబాదు వాస్తవ్యులు అప్పయ్య (ఆర్మీ డోలీ బేరర్) మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినీ టవర్‌కు బదిలీ అయ్యారు. బదిలీ అయిన కొన్ని రోజులకు ఉజ్జయినీలో కలరావ్యాధి సోకి వేలాదిమంది మరణించారు. సమయంలో అప్పయ్య వారి అనుచరులు ఉజ్జయినిలోని శ్రీ మహాకాళి దేవిని దర్శించుకుని, కలరా వ్యాధి నుండి కాపాడవల సిందిగాను, పరిస్థితులు అనుకూలించిన తదుపరి సికింద్రాబాద్‌లోనే విగ్రహ ప్రతిష్ఠ చేయించి ఆలయ నిర్మాణం చేస్తామని మొక్కుకున్నారు. తదుపరి సురటి అప్పయ్య వారి అనుచరులు సికింద్రాబాద్ తిరిగి వచ్చి 1815వ సంవత్సరములో ఇప్పుడు అమ్మవారు ఉన్నచోట కట్టెతో అమ్మవారి విగ్రహం చేయించి ప్రతిష్ఠ చేశారు. అప్పటి నుంచి అమ్మవారికి నిత్యపూజలు జరుగుతున్నాయి. అలాగే అమ్మవారికి శ్రీ ఉజ్జయినీ మహాకాళి అని నామకరణం చేశారు. పూర్వము ఈ ప్రాంతమంతయు చెట్లు, చేమలు కొండరాయి మొదలగు వాటితో నిండియుం డెనని ప్రతీతి. ఇక్కడ ఒక పెద్దబావి ఉండేదని దానిని మరమ్మతు చేయుచున్న సమయమున త్రవ్వకములో "శ్రీ మాణిక్యాలదేవి" విగ్రహం దొరికింది. ఇదియే ఇప్పుడు గర్భాలయమునందు కుడివైపున కలదు. శ్రీ మాణిక్యాలదేవి అమ్మవారి కోరికామసారము శ్రీ మహాకాళి అమ్మవారి ప్రక్కన ప్రతిష్ఠించుట జరిగింది. సురిటి అప్పయ్య 1864వ సంవత్సరములో కట్టె విగ్రహము తీసివేసి ఇప్పుడు ఉన్న మహాకాళి మాణిక్యాలదేవి అమ్మవార్ల విగ్రహములను శాస్త్రోక్షముగా ప్రతిష్ఠచేసి ఆలయ నిర్మాణము చేసిరి. నాటి నుండి వారి తరువాత వారి వంశస్తులు సురిటి సంజీవయ్య, లక్ష్మయ్య, కిష్టయ్య. సరటి లక్ష్మయ్యగారి కుమారుడు సురటి అప్పయ్యగారి మునిమనుమడు సురటి క్రిష్ణ జాతర కార్యక్రమంలలో పాల్గొను చున్నారు. శాస్త్రానుసారముగా నిత్యపూజలు నిర్వహించుట జరుగు తున్నవి. ఈ దేవాలయమును 1953 సంవత్సరంలో దేవా దాయ ధర్మాదాయ శాఖ వారి ఆధీన ములోనికి తీసు కొని భక్తుల సౌక ర్యా ర్థము ఎన్ని యో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పిల్లల్లో అతిసారాన్ని ఆపుదాం...



జనక మోహనరావు దుంగ
8247045230

ఆరోగ్యవంతమైన దేశానికి ఆరోగ్యకరమైన పిల్లలు అవసరం. మన దేశంలో పిల్లల మరణాలకు అతిసార వ్యాధి ప్రధాన కారణంగా ఉంది. కలుషిత ఆహారం, కలుషిత నీరు తాగడం వలన ఈ వ్యాధి సంభవిస్తుంది. మన దేశంలో శిశు మరణాలు ఒక ముఖ్యమైన సమస్యగా తయారైనప్పటికీ పిల్లల మరణాల రేటును తగ్గించడంలో కొంత పురోగతి సాధించడం చెప్పుకోదగ్గ విషయం. పిల్లల మరణాలకు కారణాలు అనేకం. ఇవి ప్రాంతం సామాజిక ఆర్థికస్థితిని బట్టి మారుతూ ఉంటాయి. అతిసారానికి బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు ప్రధాన కారకాలు. ఐదేండ్లకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో అత్యంత సాధారణ వైరల్ వ్యాధికారకాలలో రోటవైరస్, నోరోవైరస్, అడెనోవైరస్, ఆస్ట్రోవైరస్లు బాక్టీరియల్ వ్యాధికారక కారకాలలో ఎస్చెరిచియా కోలి, సాల్మోనెల్లా, షిగెల్లా, కాంపిలోబాక్టర్లు పరాన్నజీవి వ్యాధికారకాలలో క్రిప్టోస్పోరిడియం, గియార్డియా, ఎంటమీబా ఉన్నాయి. రోటవైరస్, ఈ.కోలి అన్ని వయసుల పిల్లలలో అత్యంత సాధారణ వ్యాధి కారకాలు. పరాన్నజీవి వ్యాధి కారకాలు మూడు నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలలో ప్రబలంగా ఉంటాయి. ఇ.కోలి, సాల్మోనెల్లా, షిగెల్లాతో సహా బాక్టీరియల్ వ్యాధి కారకాలు, రోటవైరస్, నోరోవైరస్, సాపోవైరస్ వంటివి ఆరు నుండి పదేండ్ల వయస్సు పిల్లలలో సాధారణం. చిన్నపిల్లల విరేచనాలు నివారించదగినవి, నయం చేయగలవి. అయినప్పటికీ ఈ ముప్పు కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అతిసారం వల్ల కలిగే అత్యంత తీవ్రమైన ముప్పు నిర్జలీకరణం. విరేచనాల సమయంలో నీరు, ఎలక్ట్రోలైట్లు (సోడియం, క్లోరైడ్, పొటాషియం, బైకార్బోనేట్) వంటివి విరోచనాలు, వాంతులు, చెమట, మూత్రం, శ్వాస ద్వారా బయటకు పోతాయి. ఈ నష్టాలను భర్తీ చేయనప్పుడు నిర్జలీకరణం సంభవిస్తుంది.

స్టాప్ డయేరియా కార్యక్రమం

అతిసారం అనేది పిల్లలు ఎదుర్కొనే సాధారణ వ్యాధి. మిషన్ ఇంద్రధనుష్, రోటావైరస్ వ్యాక్సిన్, స్టాప్ డయేరియా ప్రచారానికి మధ్య సంబంధం ఉంది. 2014 సం.లో రోటావైరస్ వ్యాక్సిన్‌ను ప్రవేశపెట్టిన మొదటి దేశం భారతదేశం. జాతీయ జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ అభియాన్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నెట్‌వర్క్ విస్తరణ దేశంలో డయేరియా కేసులతోపాటు మరణాల తగ్గింపుకు గణనీయంగా దోహదపడ్డాయి. ఇంతకుముందు ప్రభుత్వం డయేరియాను తగ్గించడానికి పక్షం రోజులకోసారి ప్రచారం నిర్వహించేది. అది ఇప్పుడు చాలా విస్తృతమైన సమగ్రమైన ప్రచారానికి పునరుజ్జీవింపచేయబడింది. దేశంలో డయేరియా నిర్వహణ వ్యూహాన్ని బలోపేతం చేసేందుకు ఈ ప్రచారం దోహదపడుతుంది.

పిల్లలలో నానాటికీ పెరుగుతున్న డయేరియా సమస్యను పరిష్కరించడానికి శిశు మరణాలను సున్నాకి తీసుకురావడానికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తన దీర్ఘకాల ఇంటెన్సివ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ ని స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌గా రీబ్రాండ్ చేసింది. 2014 లో ప్రారంభించబడిన ఈ చొరవ నివారణ ,



> స్టాప్ డయేరియా ప్రచారం రెండు దశల్లో అమలు చేయబడుతుంది. 14 జూన్ నుండి 30 జూన్ 2024 వరకు ప్రారంభ దశ మరియు 1 జూలై నుండి 31ఆగస్టు 2024 వరకు ప్రచార దశ. ఈ కాలంలోని ప్రధాన కార్యకలాపాలలో డయేరియా సమర్థవంతమైన నిర్వహణ కోసం ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ఇళ్లకు ఆశా వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్, జింక్ కోప్యాకేజీల పంపిణీ, ఆరోగ్య సౌకర్యాలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ల ఏర్పాటు మొదలైన కార్యక్రమాలు ఉన్నాయి. ఇందులో అవగాహనా ప్రయత్నాలను తీవ్రతరం చేయడం కూడా ఉంది. అదనంగా సమగ్ర సంరక్షణ నివారణను నిర్ధారించడానికి డయేరియా కేసు నిర్వహణ కోసం ప్రచారం సదుపాయాన్ని బలోపేతం చేస్తుంది.

రక్షణ మరియు చికిత్స వ్యూహాన్ని పెంచడం, ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్స్ (ఒ ఆర్ యస్), జింక్ వినియోగాన్ని పెంచడంపై దృష్టి పెడుతుంది. ప్రచారం 2024 యొక్క నినాదం " నివారణ , పారిశుధ్యం, ఓఆర్ఎస్‌తో అతిసారాన్ని జాగ్రత్తగా చూసుకోండి", ఇది నివారణ , పారిశుద్యం సరైన చికిత్స ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

స్టాప్ డయేరియా ప్రచారం రెండు దశల్లో అమలు చేయబడుతుంది. 14 జూన్ నుండి 30 జూన్ 2024 వరకు ప్రారంభ దశ మరియు 1 జూలై నుండి 31ఆగస్టు 2024 వరకు ప్రచార దశ. ఈ కాలంలోని ప్రధాన కార్యకలాపాలలో డయేరియా సమర్థవంతమైన నిర్వహణ కోసం ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ఇళ్లకు ఆశా వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్, జింక్ కోప్యాకేజీల పంపిణీ, ఆరోగ్య సౌకర్యాలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ల ఏర్పాటు మొదలైన కార్యక్రమాలు ఉన్నాయి. ఇందులో అవగాహనా ప్రయత్నాలను తీవ్రతరం చేయడం కూడా ఉంది. అదనంగా సమగ్ర సంరక్షణ నివారణను నిర్ధారించడానికి డయేరియా కేసు నిర్వహణ కోసం ప్రచారం సదుపాయాన్ని బలోపేతం చేస్తుంది.

స్టాప్ డయేరియా దృష్టిదాల్చే ప్రాంతాలు

ఆరోగ్య సౌకర్యాల సరైన నిర్వహణ, వినియోగాన్ని నిర్ధారించడం, అవసరమైన వైద్య సామాగ్రి లభ్యతను ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉంచడం లాంటి ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్యాన్ని అందించడానికి కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలు స్థిరమైన పద్ధతులను అమలు చేయడం, పారిశుధ్య ప్రాప్యతను మెరుగుపరచడం మెరుగైన పోషకాహార కార్యక్రమాల ద్వారా అతిసార వ్యాధులకు ప్రధాన కారణమైన పోషకాహార లోపాన్ని పరిష్కరించడం వంటి కార్యక్రమాలను పెంచడం ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడం లాంటి అంశాలపై స్టాప్ డయేరియా ప్రచారం దృష్టి పెట్టడం జరుగుతుంది. ఈ ఫోకస్ ప్రాంతాలు డయేరియా నిర్వహణ నివారణకు సమగ్ర విధానాన్ని రూపొందించడం, చివరికి పిల్లల మరణాలను తగ్గించడం, మొత్తం ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, తాగునీరు పారిశుధ్య శాఖ, స్త్రీ శిశు అభివఅద్ధి శాఖ , పాఠశాల విద్య గ్రామీణాభివృద్ధి పట్టణాభివఅద్ధి శాఖ వంటి వివిధ మంత్రిత్వ శాఖలతో కలిసి పని చేస్తోంది. ఈ బహుళ రంగాల విధానం పిల్లల మరణాలను తగ్గించడానికి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి సమగ్రమైన ప్రభావవంతమైన కార్యక్రమాన్ని అందించడానికి ఉద్దేశించిన స్టాప్ డయేరియా ప్రచారానికి మెరుగైన సమన్వయం అమలును నిర్ధారిస్తుంది.

డయేరియాకు కారణాలు

విరేచనాలతో మరణించే పిల్లలు తరచుగా పోషకాహార లోపంతో బాధపడుతుంటారు. దీనివలన వారు డయేరియా బారిన పడే అవకాశం ఉంది. ఐదేండ్లకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో పోషకాహార లోపానికి అతిసారం ప్రధాన కారణం. అతిసార వ్యాధి వ్యక్తి నుండి వ్యక్తికి కూడా వ్యాపిస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత సరిగా లేకపోవడం వల్ల తీవ్రతరం అవుతుంది. ఆహారాన్ని అపరిశుభ్రమైన పరిస్థితుల్లో తయారు చేసినప్పుడు లేదా నిల్వ చేసినప్పుడు అతిసారం రావడానికి మరొక ప్రధాన కారణంగా చెప్పొచ్చు. అసురక్షిత గృహనీటి నిల్వ నిర్వహణ కూడా ఒక ముఖ్యమైన ప్రమాద కారకం. కలుషిత నీటిలో ఉండే చేపలను ఆహారంగా తీసుకోవడం కూడా వ్యాధికి దోహదపడతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత సరిగా లేకపోవడం, స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేకపోవడం, సరైన పోషకాహారం లేకపోవడం దేశంలో అతిసారం అధిక సంభావ్యతకు కారణాలు అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నివారణ చర్యలు ఏం తీసుకోవాలి? సురక్షితమైన నీరు తాగాలి. భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు కడుక్కోవాలి. శిశువుకు మొదటి 6 నెలలు తల్లిపాలు తాగించాలి.

(1జూలై-31ఆగస్టు 2024 వరకు ప్రచార దశ సందర్భంగా)

'గురు బ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర్ణ గురు సాక్ష్యాత్ పరబ్రహ్మ' అనే నానుడి మన తెలుగు ప్రజల నరనరాల్లో జీర్ణించుకు పోయింది. గురువులో దైవాన్ని చూడగలిగే విద్యార్థులు రేపటి సమాజంలో పూజ్యనీయులు అవుతారు. పరీక్షలో ఉత్తీర్ణులు కావడానికే కాదు, పరిపూర్ణ వ్యక్తిగా ఎదగడానికి చదువులు ఉపకరించాలి. విలువలు బోధించని విద్య సుగంధం లేని ప్లాస్టిక్ మల్లెపువ్వు లాంటిది. 'మొక్కయి వంగనిది మానై వంగునా' అను నానుడిని నిరంతరం గుర్తుంచుకోవాలి. బాల్యం నుంచే చదువు, సంస్కారాలు నూరి పోయాలి. బాధ్యతగల రేపటి పౌరులను తయారు చేసే కేంద్రాలుగా విద్యాలయాలు పూజ్యనీయ క్షేత్రాలుగా నిలబడాలి, గురువులు ఆరాధ్య దైవాలుగా పూజించబడాలి.

విజ్ఞాన సమాజానికి ఊతకర్ర గురువే!




డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

గురువు లేని నరుడుండడు. గురువును గౌరవించని మనిషుండడు. గురువును నిర్లక్ష్యం చేస్తే మనిషి మానసిక ఎదుగుదల ఆగిపోక తప్పదు. మన తెలుగు సాంప్రదాయంలో గురువుకు విలక్షణ స్థానం ఇవ్వబడింది. గురువును నమ్మితే జ్ఞాన వికాసనం వడివడిగా జరుగుతుంది. అజ్ఞానమనే చీకటిని తరమడానికి జ్ఞానమనే దీపం వెలిగించే మహత్తరశక్తి గురువుకు మాత్రమే ఉంటుంది. లోకానికే జ్ఞానాన్ని అందించిన గురువు వ్యాసుడు. గురుపరంపరను పూజించే సదాచారాన్ని పాటించే మన సంస్కృతిలో ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురు పౌర్ణమి పాటించడం అనాదిగా వస్తున్నది. వేదాలు, బ్రహ్మ సూత్రాలు, మహాభారతం, భగవద్గీత, పురాణాలను సమస్తం మానవాళికి అందించిన వేదవ్యాసుడి జన్మదినం రోజున గురువును పూజించుకునే ఆనవాయితీ గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమికి ఉన్నది.

గురువు అంటే జ్ఞానం. గురువు అంటే ధర్మం. గురువు లేని జన్మ వ్యర్థం. మట్టిని మాణిక్యంగా, మనిషిని మహామనిషిగా, వ్యక్తిలో వ్యక్తిత్వ వెలుగులు నింపుతూ, నిరక్షరాస్యుడిలో అక్షర విత్తులు నాటుతూ, రేపటి తరాన్ని నిర్మించే మహాయజ్ఞంలో ప్రధాన భూమికను నిర్వహించేది ఉపాధ్యాయుడు ఒక్కడే. భవిష్యత్ తరాల నిర్మాణంలో, దేశ సమగ్రాభివృద్ధిలో గురువు పాత్ర అమోఘం, అనిర్వచనీయం. భారతీయ సంస్కృతిలో గురువు మూల స్తంభంగా నిలబడి ఉన్నాడు. జగన్నాథుడు శ్రీ కృష్ణుడు, సకల గుణ సంపన్నుడు శ్రీ రాముడు కూడా గురువు చెక్కిన అపురూప భగవత్ రూపాలే. సన్మార్గాన్ని చూపే దీపస్తంభం, రాతిని నాతిగ మార్చగల నేర్పరి, ప్రతి ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వగల జ్ఞాని, విజ్ఞాన వితరణశీలి, జ్ఞాన బోధకుడు, వివేక జ్యోతి, నిస్వార్థ అక్షర కర్షకుడు, సమాజ క్షేత్రంలో విలువల విత్తులు నాటే అనంత విజ్ఞాన మేధోసంపన్నుడైన గురువు సమాజ నిర్మాతగా అద్వితీయ సేవలను అందిస్తూనే ఉన్నాడు, భవిష్యత్తులో అందిస్తాడు కూడా. గురువును గౌరవించని సమాజం నరక సమానం. గురు బోధనలు వినని తనువు వింత జంతువే. గురువును మనసారా నమ్మని శిష్యుడు వింతైన నిరక్షరాస్య జంతువు. గురువు రేపటి తరానికి బోధకుడు మాత్రమే కాదు సన్మార్గాల బాట చూపగల మార్గదర్శి.

మానవ సమాజోద్ధరణ మహాయజ్ఞంలో ప్రథమ స్థానం గురువుదే. పేదరికం, అధిక జనాభా, అనారోగ్యాలు, ఆకలి చావులు, నిరుద్యోగం లాంటి సమస్యలకు సమాధానం విద్యాధిక సమాజ జ్ఞాన సంపన్న నిర్మాణమే. విద్య సమపార్జనలో ఉపాధ్యాయుడే కేంద్రబింధువు. లేత విద్యార్థి శారీరక, మానసిక ఎదుగుదల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగేది గురువు మాత్రమే. ఆధునిక సమాజంలో విలువలు, ప్రాధాన్యతలు మారుతున్నాయి. ఉపాధ్యాయుల అంకితభావంలో కూడా మార్పు కనిపిస్తున్నది. ఉపాధ్యాయ వృతి వెలకట్టలేనిది, అత్యంత పవిత్రమైంది. నేటి ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం రేపటి సమాజ అశాంతికి కారణం అవుతుంది. బోధన వృత్తి కాదు, అదో పవిత్ర బాధ్యత అని గురువులు గుర్తెరుగాలి. చురుకైన, అత్యాధునిక, సృజనశీల, వినూత్న మేధో వికసిత సమాజ నాయకులను తయారు చేయగలిగే సామర్థ్యం గురు దైవం సొంతం. అసంఘటిత మానవ వనరులను సంఘటిత, సదాలోచనల శాస్త్రసాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దగల నేర్పరి గురువు మాత్రమే. నేటి సమాజ గురువుల్లో కూడా వ్యాపార ధోరణి కనబడుతోంది. పాఠశాలలో బెల్, బిల్ సంస్కృతి పెరుగుతోంది. చదువు సంస్కృతిని, సాంప్రదాయాలను, మానవీయ విలువలను పెంపొందించాలి. పుస్తకంలోని పాఠాల బోధనతో పాటు జీవన నైపుణ్యాలను, జీవించే కళను నేర్పించగలగాలి. పాఠ్యాంశాల్లో పట్టు, సుక్ష్మ గ్రహకశక్తి, అనువర్తిత పరిజ్ఞానం, సంక్షోభాలను అధిగమించగల నేర్పు లాంటి పలు అంశాలను అందించగలిగిన వారే అసలైన గురువులు అవుతారు. గురు శిష్య పరంపర ఆరోగ్యంగా, బలంగా కొనసాగితేనే సమాజోద్ధరణ సుసాధ్యం. నేటి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు ఉపాధ్యాయులను సాధారణ ఉద్యోగులుగానే



చూస్తున్నారు. గురువుకు ఇవ్వాల్సిన కనీస గౌరవాలు పలుచబడుతున్నాయి. గురువును నిర్లక్ష్యం చేస్తే రేపటి తరం శిక్షను అనుభవిస్తుందని మరిచి పోతున్నాం.

'గురు బ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర్ణ గురు సాక్ష్యాత్ పరబ్రహ్మ' అనే నానుడి మన తెలుగు ప్రజల నరనరాల్లో జీర్ణించుకు పోయింది. గురువులో దైవాన్ని చూడగలిగే విద్యార్థులు రేపటి సమాజంలో పూజ్యనీయులు అవుతారు. పరీక్షలో ఉత్తీర్ణులు కావడానికే కాదు, పరిపూర్ణ వ్యక్తిగా ఎదగడానికి చదువులు ఉపకరించాలి. విలువలు బోధించని విద్య సుగంధం లేని ప్లాస్టిక్ మల్లెపువ్వు లాంటిది. 'మొక్కయి వంగనిది మానై వంగునా' అను నానుడిని నిరంతరం గుర్తుంచుకోవాలి. బాల్యం నుంచే చదువు, సంస్కారాలు నూరి పోయాలి. బాధ్యతగల రేపటి పౌరులను తయారు చేసే కేంద్రాలుగా విద్యాలయాలు పూజ్యనీయ క్షేత్రాలుగా నిలబడాలి, గురువులు ఆరాధ్య దైవాలుగా పూజించబడాలి.

గురువు కంటే అధికమైన తత్వం, తపస్సు, జ్ఞానం లేదని మనకు తెలుసు. జ్ఞాన భాండాగారం, ప్రేరణామూర్తి, ప్రేమ చెలిమె, స్నేహ హస్తం, సంస్కర్త, బోధకుడు, మెంటర్, గైడ్, వివేక సంపన్నుడు, విజ్ఞాన గని, శాంత సముద్రుడు, ఫెసిలిటేటర్, డిమానిస్ట్రేటర్, నైపుణ్య ఊట, నాయకత్వ బాట, తడబడినపుడు ఊత కర్ర, సదా స్మరణీయుడు, నిత్య విద్యార్థి, సద్గుణ దీప స్తంభం అయిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా గురువును మన మనోమందిరాల్లో స్థాపించుకొని సన్మార్గంలో నడుద్దాం, విజ్ఞాన సమాజానికి దిశ నిర్దేశనం చేద్దాం.

(21 జులై 'గురు పౌర్ణమి')

ఏ నేలలను భారతదేశపు ధాన్యాగారాలుగా పేర్కొంటారు?

- భూమి ఉపరితలంపై వదులుగా ఉన్న పొరనే 'నేల' అంటారు.
- నేలను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'పెడాలజీ' లేదా 'ఎడపాలజీ' అంటారు.
- నేలల పుట్టుకను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని "పెడోజెనేసిస్" అంటారు.
- మృత్తికల స్వభావం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని "లీథాలజీ" అంటారు.
- శిలలు శైథిల్యం చెందే ప్రక్రియను వెదరింగ్ అంటారు.
- ప్రపంచ ధరిత్రి దినోత్సవం - ఏప్రిల్ 22
- వరల్డ్ వెట్ ల్యాండ్స్ డే - ఫిబ్రవరి 2
- వ్యవసాయం యోగ్యమైన నేల PH విలువ: 6.5 నుండి 7.5 మధ్య ఉంటుంది.
- శిలలు శైథిల్యం చెందగా ఏర్పడే పదార్థాన్ని 'మృత్తిక' అంటారు.
- తెలంగాణ రాష్ట్రం భారత ద్వీపకల్పంలోని ఈస్ట్రన్ సీ బోర్డ్ మధ్య పేలికలో దక్కన్ పీఠభూమి ఉంది.
- తెలంగాణ రాష్ట్రం అధిక సారవంతమైన ఒండ్రు నేలల నుంచి నిస్సారమైన ఇసుక నేలల వరకు పలు రకాల నేలలను కలిగి ఉంది. తెలంగాణలో ఎగుడు, దిగుడులు గల పెనిప్లేయిన్లు కలిగి ఉన్నప్పటికీ ఎర్ర నేలలు, నల్ల నేలలు, లాటరైట్ నేలలు విస్తరించి ఉన్నాయి.
- రాష్ట్రంలో ప్రధానంగా ఎర్ర నేలలు, ఒండ్రు నేలలు, నల్లరేగడి నేలలు, లాటరైట్ నేలలు విస్తరించి ఉన్నాయి.
- Soil Survey of India - 1956లో స్థాపించబడింది.
- Indian Council of Agriculture Research (ICAR) - 1929లో స్థాపించబడింది.
- ICAR (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) న్యూఢిల్లీ సంస్థ దేశంలో నేలలను 8 రకాలుగా వర్గీకరించింది.

1. నేలల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
1) లిథాలజీ 2) పోమాలజీ
3) మెట్రోలజీ 4) పెడాలజీ

2. ఎర్ర నేలల యొక్క PH విలువ ఎంత?
1) 6.0 నుండి 7.5 2) 7.8 నుండి 7.8
3) 6.0 నుండి 6.8 4) 6.0 నుండి 8.0

3. అత్యంత సారవంతమైన నేలలు?
1) ఒండ్రు నేలలు 2) నల్లరేగడి నేలలు
3) ఎర్ర నేలలు 4) లాటరైట్ నేలలు

4. సుగంధ ద్రవ్యాల పంటలకు అనుకూలమైన నేలలు?
1) నల్లరేగడి నేలలు 2) లాటరైట్ నేలలు
3) ఎర్ర నేలలు 4) ఒండ్రు నేలలు

5. ఆదిలాబాద్ జిల్లాలో తక్కువగా ఉండే నేలలు?
1) ఒండ్రు నేలలు 2) లాటరైట్ నేలలు
3) ఎర్ర నేలలు 4) నల్లరేగడి నేలలు

6. ఈ క్రింది వాటిలో ఏ నేలలను దుబ్బనేలలు, చెల్క నెలలుగా వర్గీకరించారు?
1) నల్లరేగడి నేలలు 2) ఎర్ర నేలలు
3) ఒండ్రు నేలలు 4) లాటరైట్ నేలలు

7. ఏ నేలలను ఉపయోగించి ఇటుకలను తయారు చేస్తారు?
1) నల్లరేగడి నేలలు 2) రాతినేలలు
3) ఎర్ర నేలలు 4) ఒండ్రు నేలలు

8. ఏ నేలలను భారతదేశపు ధాన్యాగారాలుగా పేర్కొంటారు?
1) ఒండ్రు నేలలు 2) ఎర్రనేలలు
3) లాటరైట్ నేలలు 4) నల్లరేగడి నేలలు

9. వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలలో తక్కువ విస్తరించి ఉన్న నేలలు ఏవి?
1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
3) నల్లరేగడి నేలలు 4) లాటరైట్ నేలలు

10. ఏ నేలలతో పొష్టిక, సేంద్రియ పదార్థాలు తక్కువ ఉండి, భాస్వరం అధికంగా ఉంటుంది?
1) ఒండ్రు నేలలు 2) లాటరైట్ నేలలు
3) ఎర్ర నేలలు 4) నల్లరేగడి నేలలు

11. అల్యూమినియం, ఇనుప (ఫెరిక్స్) హైడ్రైడ్ అక్సైడ్ మిశ్రమం కల్గి ఉన్న నేలలు ఏవి?
1) రాతి నేలలు 2) ఎర్ర నేలలు
3) ఒండ్రు నేలలు 4) నల్లరేగడి నేలలు

12. ఎర్ర నేలలో ప్రధానంగా పండే పంట?
1) వేరుశనగ 2) ప్రత్తి
3) జీడి మామిడి 4) గోధుమ

13. ఏ నేలలు తక్కువసారం కల్గి ఉండి పాలిపోయిన బూడిద రంగులో కనబడతాయి?
1) నల్లరేగడి నేలలు 2) ఎర్ర నేలలు
3) ఒండ్రు నేలలు 4) లాటరైట్ నేలలు

14. నల్లరేగడి మృత్తికలు ఏర్పడటానికి గల కారణం
1) అవక్షేప శిలలు 2) రూపాంతర శిలలు
3) షేల్స్ 4) పైవన్నీ

15. నల్లరేగడి నేలల యొక్క PH విలువ ఎంత?
1) 6.0 నుండి 7.5 2) 7.8 నుండి 8.7
3) 6.0 నుండి 6.8 4) 6.0 నుండి 8.0

16. ఏ నేలలో పొటాష్, సున్నపురాయి సమృద్ధిగా ఉండి నత్రజని శాతం తక్కువగా ఉంటుంది?
1) ఒండ్రు నేలలు 2) లాటరైట్ నేలలు
3) ఎర్ర నేలలు 4) నల్ల రేగడి నేలలు

17. ఏ నేలలో లావా, నీస్, గ్రానైట్ శిలలతో ఏర్పడుతాయి?



1) ఎర్ర నేలలు 2) లాటరైట్ నేలలు
3) నల్లరేడి నేలలు 4) ఒండ్రు నేలలు

18. ఏ నేలలను రేగర్ నేలలు అని అంటారు?
1) నల్లరేగడి నేలలు 2) ఎర్ర నేలలు
3) ఒండ్రు నేలలు 4) లాటరైట్ నేలలు

19. ఏ నేలలలో ఇనుము, కాల్షియం శాతం ఎక్కువగా ఉంటుంది?
1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
3) నల్లరేగడి నేలలు 4) లాటరైట్ నేలలు

20. ఏ నేలలో భాస్వరం, సేంద్రియ పదార్థాలు తక్కువగా ఉంటాయి?
1) ఒండ్రు నేలలు 2) ఎర్ర నేలలు
3) నల్లరేగడి నేలలు 4) లాటరైట్ నేలలు

21. రాతినేల యొక్క PH విలువ ఎంత?
1) 6.0 నుండి 7 2) 3.0 నుండి 7.8
3) 6.0 నుండి 6.8 4) 7.8 నుండి 8.8

22. ఏ నేలలు ఎక్కువ వర్షపాతం, ఎక్కువ ఉష్ణోగ్రత, అధిక తేమను కల్గి ఉంటాయి?
1) ఒండ్రు నేలలు 2) ఎర్ర నేలలు
3) నల్లరేగడి నేలలు 4) రాతి నేలలు

23. కాఫీ, తేయాకు, రబ్బరు వంటి పంటలకు అనుకూలమైన నేలలు?
1) రాతి నేలలు 2) ఒండ్రు నేలలు
3) ఎర్ర నేలలు 4) నల్లరేగడి నేలలు

24. ఒండ్రు నేలలో పండే పంటలు?
1) వరి, చెఱకు 2) అరటి, మామిడి
3) నిమ్మ, బత్తాయి 4) పైవన్నీ

25. ఏ నేలలు పంట దిగుబడికి ఎక్కువగా దోహదపడుతాయి?
1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
3) రాతి నేలలు 4) నల్లరేగడి నేలలు

26. ఏ నేలలు సాధారణంగా క్షారస్వభావాన్ని కల్గి ఉంటాయి?
1) ఒండ్రు నేలలు 2) ఎర్ర నేలలు
3) లాటరైట్ నేలలు 4) నల్లరేగడి నేలలు

27. జతపర్చుము :
1) ఎర్ర నేలలు ఎ) 48%
2) ఒండ్రు నేలలు బి) 20%
3) లాటరైట్ నేలలు సి) 7%
4) నల్లరేగడి నేలలు డి) 25%

1) 1-ఎ,2-బి,3-సి,4-డి
2) 1-బి,2-ఎ,3-సి,4-డి
3) 1-ఎ,2-బి,3-డి,4-సి
4) 1-ఎ,2-సి,3-బి,4-డి

28. ఏ నేలలు ఎక్కువగా బంకమట్టిని కల్గి ఉండి, తేమను నిల్వచేసుకునే సామర్థ్యం ఉంటుంది?
1) నల్లరేగడి నేలలు 2) ఎర్ర నేలలు
3) ఒండ్రు నేలలు 4) లాటరైట్ నేలలు

29. ఏ నేలలకు నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం ఉంటుంది?
1) ఎర్ర నేలలు 2) ఒండ్రు నేలలు
3) లాటరైట్ నేలలు 4) నల్లరేగడి నేలలు

30. సాధారణంగా ఏ నేలలు పసుపురంగులో ఉంటాయి?
1) ఒండ్రు నేలలు 2) ఎర్ర నేలలు
3) లాటరైట్ నేలలు 4) నల్లరేగడి నేలలు

31. కేంద్రీయ అటవీ పరిశోధనల సంస్థ ఎక్కడ ఉంది?
1. చండీగడ్ 2. ఊటీ
3. డెహ్రాడూన్
4. హైద్రాబాద్

32. ఐ.సి.ఏ.ఆర్. (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) న్యూఢిల్లీ సంస్థ దేశంలో నేలలను ఎన్ని రకాలుగా వర్గీకరించింది?
1. 5 2. 7 3. 8 4. 9

33. తెలంగాణలో ఎర్ర నేలల శాతం ఎంత?
1. 25% 2. 5%
3. 33% 4. 48%

34. ఈ క్రిందివాటిలో "తనను తాను దున్నుకొను నేలల"ని వేటిని అంటారు?
1. ఎర్రనేలలు 2. లాటరైట్ నేలలు
3. నల్లరేగడి నేలలు 4. ఒండ్రు నేలలు

35. తెలంగాణలో నల్లరేగడి నేలల శాతం ఎంత?
1. 4% 2. 25%
3. 20% 4. 48%

36. లాటరైట్ నేలలు తెలంగాణలో ఏ ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి ?
1. జహీరాబాద్, నారాయణఖేడ్, ఆదిలాబాద్
2. జహీరాబాద్, నారాయణఖేడ్, కరీంనగర్
3. జహీరాబాద్, నారాయణఖేడ్, ఖమ్మం
4. జహీరాబాద్, నారాయణఖేడ్, మెదక్

37. ఈ క్రింది వాటిలో వేటిని "జేగురు నేలలు" అంటారు?
1. ఎర్రనేలలు 2. లాటరైట్ నేలలు
3. ఒండ్రు నేలలు 4. నల్లరేగడి నేలలు

38. తెలంగాణ రాష్ట్రంలో లాటరైట్ నేలల విస్తీర్ణ శాతం?
1. 7% 2. 2.3%
3. 4.5% 4. 5.7%

39. ఈ క్రింది వానిలో అత్యంత సారవంతమైన నేలలు ఏవి?
1. లాటరైట్ నేలలు 2. ఒండ్రునేలలు
3. నల్లరేగడి నేలలు 4. ఎర్రనేలలు

40. తెలంగాణలో ఒండ్రునేలలు ఎంత శాతం విస్తరించి ఉన్నాయి?
1. 20% 2. 25%
3. 5.5% 4. 48%

సమాధానాలు

1.1	2.1	3.1	4.2	5.3
6.2	7.2	8.1	9.3	10.3
11.1	12.1	13.2	14.4	15.2
16.1	17.3	18.1	19.3	20.3
21.3	22.4	23.1	24.4	25.2
26.1	27.1	28.1	29.4	30.1
31.2	32.3	33.4	34.3	35.2
36.3	37.2	38.1	39.2	40.1